
ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రి



4 అ

28-11

ANDHRA PATRIKA

ILLUSTRATED WEEKLY



"రాధాసమేతా, కృష్ణా!"

—చిత్రకారుడు: వెల్లటూరి పూర్ణానందశర్మ.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక
Founder : K. NAGESWARA RAO

సంపుటము 51
సంచిక 13
28-11-56

దుర్ముఖ కార్తీక బహుళ ఏకాదశి బుధవారం

★ విషయానుక్రమణిక ★

ముఖచిత్రం : వైజయంతీమాల.



ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవంనాడు హైదరాబాదులో విద్యుద్దీపాలంకృతమైన
మ్యూజియం భవనం.

శ్రీరామ రక్ష



శ్రీ త్రివేది

"అమ్మకడుపు చల్లగా...
అత్తకడుపు చల్లగా .
నీకడుపు చల్లగా. "

అని తలకు నూనె అంటబోయే ముందు ప్రతి తెలుగుతల్లీ తన సంతానాన్ని దీవిస్తుంది; ఇది మన సంప్రదాయం.

నీవు, నీ భార్య, నీ సంతానం హాయిగా, కలకాలం వర్ధిల్లాలన్నదే మాతృదేవత చేసే ఈ ఆశీర్వాదంలోని అంతరార్థం

ఇంతేకాదు తలంటి నీళ్ళుపోయడం పూర్తికాగానే, కొంచం నీళ్ళు చేతిలోకి తీసుకొని చుట్టూతిప్పి, "శ్రీరామరక్ష; నూరేళ్ళ ఆయుస్సు," అని కూడా ఆమె ఆశీర్వదిస్తుంది

ఏ నాడు ఏ చల్లని తల్లి నోటవెంట ఈ దివ్యవాక్కులు వెలువడినవో తెలియదుగాని, నేటికీ మనవాళ్ళు మాత్రం వీటనే చెప్పుకుంటున్నారు

దేశోద్ధారకుడు తన జీవితకాలంలో తరుచు ప్రబోధించినటు శ్రీరాముడు ఆంధ్రుల హృదయాధినాథుడు. అందుచేత ఆయన పవిత్ర నామధేయంతో ప్రతి తెలుగుతల్లీ తన సంతానాన్ని దీవించుకోవడంలో ఆశ్చర్యమేమున్నది?

పైగా, ఇందులో మరో ధర్మసూత్రం కూడా లేకపోలేదు. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం శ్రీ రామనామధేయుడి ఆత్మాహుతి ఫలితంగానే ఏర్పడ్డది. పురాణపురుషుడు, మహాతపశ్శాలి అయిన దధీచి స్వయంగా సృష్టించుకున్న యోగాగ్నిలో తనదేహాన్ని పూర్ణాహుతి చేసుకుని దేవతల అస్త్రసంపద దేవతలకు సమర్పించి వేశాడని పురాణగాథ. అదేవిధంగా మన ఆంధ్రదధీచి ఆత్మాహుతి చేసుకుని ఆంధ్రులకు అమృతభాండ మనదగిన రాష్ట్రాన్ని సంక్రమింపచేశాడు. ఆనాడు రాష్ట్రమే ఏర్పడి వుండకపోతే, ఈనాడు విశాలరాష్ట్రం వచ్చేదో లేదో చెప్పలేము. అమరజీవి పవిత్రనామం నవ్యాంధ్రకు నిరంతర రక్ష.

అందుచేత ఈ శీర్షికకింద మన విశాలరాష్ట్ర వ్యవహారాలను వీలైనప్పుడల్లా ముచ్చటించుకుందాం. 'చిన్నా నా ఆంధ్రకు శ్రీరామరక్ష' అని ఆశీర్వదించుకుందాము.

* * *

రాష్ట్రం ఏర్పడి మూడు వారాలు అయింది నాలుగో వారంలో ప్రవేశించాము. పెద్ద ఉద్యోగులు, చిన్న ఉద్యోగులు, రాజధానిలో కాలూ చెయ్యీ కూడదీసుకుని, ఉత్సాహంతో తమ ఉద్యోగధర్మాలను నిర్వర్తించాలని ఉవ్విళ్లూరుతున్నారు. అయితే, చాలా మందికి స్థలం కొత్తది ఏ కొత్త స్థలమైనా పెద్ద ఉద్యోగులకేమీ ఫరవాలేదు; చిన్నవారికే చిక్కులన్నీ. చిన్న పెద్ద అనే తారతమ్యాన్ని పాటించకుండా సిబ్బంది అంతా త్రికరణశుద్ధిగా, సామర్థ్యంతో పనిచేస్తేనే ఏ ప్రభుత్వ యంత్రాంగమైనా సవ్యంగా నడిచేది. సిబ్బంది సర్వశక్తిసామర్థ్యాలనూ వినియోగించి పనిచేయాలంటే, వారికి కొన్ని కనీస సౌకర్యాలనైనా సమకూర్చక తప్పదు

'షేరానగర్' నుంచి 'సనత్ నగర్'కు మకాం మార్చిన రాష్ట్ర ప్రభుత్వపు సిబ్బందికి ఏ సౌకర్యా లున్నవో, ఏవి లేవో స్వయంగా తనిఖీచేసి తెలుసుకున్నారు, గవర్నర్ శ్రీ త్రివేదీ. సిబ్బంది ఇబ్బంది పడుతూన్నంతకాలం ప్రభుత్వ కార్యకలాపాలు సక్రమంగా సాగవనే విషయాన్ని ఏ సమర్థుడైన గవర్నరైనప్పటికీ తప్పకుండా ఇట్టే గ్రహించగలుగుతాడు. ఇది గ్రహించిన కారణంచేతనే, ఆంధ్రప్రదేశ్ అవతరణజరిగి రెండువారాలైనా తిరగకముందే, నగరంలో సిబ్బంది నివసించే వివిధ ప్రాంతాలకూ ప్రత్యేకంగా పనిగట్టుకొని వెళ్ళి, వారందరి యోగక్షేమాలను, కొత్తస్థలంలో వారెదుర్కొంటున్న కష్టాలను, అనుభవిస్తున్న సుఖాలను విచారించి తెలుసుకోవడమేగాక, తెలుసుకుని విచారించారు. సహృదయులైన శ్రీ త్రివేది ప్రభుత్వోద్యోగుల కష్టసుఖాల పట ఇలా శ్రద్ధవహించడం ఇది మొదటిసారి కాదు. మూడేళ్ళ క్రితం ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డప్పుడుకూడా, కర్నూలులో డేరా డేరాకూ వెళ్ళి పరిస్థితులు స్వయంగా చూశారు. ఇప్పుడు హైదరాబాదులోకూడా అదేపని చేశారు.

బస్సుఛార్జీలు ఎక్కువగా వున్నవనీ, చాలాదూరం ప్రయాణంచేసి సచివాలయాన్ని చేరవలసివస్తున్నదనీ, కూర నారా ధరలు మండిపోతున్నవనీ, భోజనపు ఖర్చులు మితిమీరుతున్నవనీ నెలకు ఏ అరవయ్యో, డెబ్బయ్యో రూపాయల జీతంవచ్చే ఉద్యోగులు ఇంతఖర్చును తట్టుకోలేరనీ ఉద్యోగులు, ఆప్యాయంగా తమ పరిస్థితులను పరిశీలించడానికి వచ్చిన గవర్నరుకు విన్నవించుకున్నారు. ప్రభుత్వం భత్యాల కింద ఇచ్చే డబ్బు బస్సు ఖర్చులకే సరిపోతున్నదని చెప్పుకున్నారు

"కర్నూలులోకంటె ధరలు ఎక్కువా, తక్కువా?" అని శ్రీ త్రివేదీ సిబ్బందిని ప్రశ్నించారు "మదరాసులోకంటె కర్నూలులో ఎక్కువ; కర్నూలులోకంటె హైదరాబాదులో మరీ ఎక్కువ" అన్నారు ఉద్యోగులు

కొట్టు యజమానిని అడిగితే, "అయ్యా! నేను సరుకు చాలా దూరంనుంచి తెప్పించుకోవాలి. మదరాసులో లేని పన్నులు ఇక్కడ భరించాలి. మదరాసు కర్నూలు ధరలకు సరుకుఇవ్వడం నాకు సాధ్యపడదు," అని తన ఇబ్బంది తాను చెప్పుకున్నాడు, అతగాడు. ధరలు పెంచవద్దని గవర్నర్ అతడికి హితవు చెప్పారు.

తర్వాత శ్రీ త్రివేదీ ఒక పాలదుకాణాన్నీ, కూరలదుకాణాన్ని, రెండు హోటళ్ళను కూడా చూశారు

కొన్ని హోటళ్ళలో పెడుతున్న భోజనం బాగుండడంలేదని ఉద్యోగులు ఫిర్యాదు చేయగా, గవర్నర్ "దక్షిణాదిన మంచి చపాతీలు దొరకవు. ఇక్కడ మంచి కాఫీ దొరకదు. ఎక్కడ ఏది దొరికితే, ఏది మంచిదైతే, దాన్నే అలవాటు చేసుకోవాలి. లేనివాటిని అపేక్షించి లాభంలేదు," అన్నారు.

ప్రభుత్వం అంటే కొంతసానుభూతి చూపి వ్యవహరించండని కూడా ఉద్యోగులను శ్రీ

శ్రీరామరక్ష

త్రివేది కోరారు. విజ్ఞప్తులఫలితం అనుభూతికివచ్చినంతకాలం, సానుభూతికేమీలోటు వుండదనే ఆశించవచ్చు. సిబ్బంది కోరిన ప్రకారం సచివాలయం పనిచేసే వేళను ఉదయం 11 గంటలకు ప్రభుత్వం ఎందుకు మార్చకూడదు? మంత్రి శ్రీ మందుముల నరసింగరావు చెబుతున్న ప్రకారం కొత్తగా వెయ్యిఇళ్ళనూ శీఘ్రంగా కట్టించి ఇస్తే చిన్నఉద్యోగులచిక్కులు తీరిపోతవనే ఆశించవచ్చు. ఏదిఏమైనప్పటికీ ప్రభుత్వసిబ్బంది సౌకర్యాల విషయమై మంత్రులకంటే ముందే గవర్నర్ స్వయంగా శ్రద్ధవహించి పరిశీలించడం విశేషం!

* * *

హిమాయత్ నగరంలో చిన్న ఉద్యోగుల వసతిగృహాన్ని చూస్తున్నప్పుడు, అక్కడ ఒక కాంటీన్ కంట్రాక్టర్ గవర్నర్ కు ఒక పెద్దపూలదండ వేయబోతే, "ఇక్కడవున్న వారికి మీరు మంచిభోజనం పెట్టండి; నాకు దండలు వద్దు," అన్నారట. ప్రజారాజ్యంలో దండలన్నీ మంత్రులవంతే నని చెప్పడంకూడా భావ్యంకాదేమోనని పిస్తున్నది.

ఎందుచేతనంటే, సొంతజిల్లాలో (అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకా బత్తలపల్లిలో) ప్రప్రథమంగా పర్యటిస్తూ ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి కూడా తమకు పూలదండలు, స్వాగతపత్రాలు ఇవ్వవద్దన్నారు. "మీ ప్రేమాభిమానాలు, సహకారం, నిర్విరామకృషీ కావాలి. స్వార్థరహితంగా ప్రజాసేవ చేయడం తప్ప నాకు వేరే కోరిక లేదు. దారిద్ర్యం, వ్యాధి, క్షుద్బాధ, ఇతర బాధలు నిర్మూలించి ప్రజలను రక్షించడమే నా విధి; ఒక్క రెండేళ్ళు వ్యవధి ఇచ్చి చూడండి. ఏదైనా మంచి జరిగితే అప్పుడు నన్ను చూసి గర్వపడండి; అప్పటివరకూ వద్దు" అన్నారు శ్రీ సంజీవరెడ్డి. ముఖ్యమంత్రి అంటే ప్రజల ప్రథమ సేవకుడన్న మాట అని నిర్వచనం చెప్పారు. బాగానే వుంది; మంత్రులు గవర్నరు ఏకమై దండలు వద్దంటే, రాష్ట్రంలో పూలవ్యాపారం, పూలతోటల పెంపకం ఏమైపోవాలి? ఈ వ్యాపారాన్ని ప్రోత్సహించడానికైనా వారు దండలు వేయించుకోవాలి.

* * *

కోటలు దాటేలా మాటలుచెప్పి లాభం లేదు; కావలసింది చేతలు; చెప్పే మాటలు కార్యరూపంధరించాలి. పదకొండు జిల్లాల ఆంధ్ర ప్రభుత్వానికి సాలీనా మూడుకోట్ల రూపాయలకుపైగా లోటు వుండేది. ఇరవైజిల్లాలఆంధ్రప్రదేశ్ లో ఇది ఎనిమిదికోట్లుదాటుతుంది. ఇప్పటికే మోయలేనంతగావున్న పన్నులభారాన్ని ఇంకా పెంచడం భావ్యమనిపించదు. అయితే నిర్మాణాత్మకమైన పనులు అనేకం జరగవలసివున్నవి. అదనపు రాబడికి మార్గాన్వేషణ చేయడంతోపాటు, ప్రభుత్వవ్యయాన్ని సాధ్యమైనంత తగ్గించుకోడానికి కూడా ప్రయత్నం జరగాలి. ఈ విషమ పరిస్థితిని ప్రభుత్వం ఏ విధంగా పరిష్కరిస్తుందో చూడాలి.

ఇప్పటి వరకూ తమదే అన్ని విధాలా వెనకబడిన ప్రాంతమని రాయలసీమ ప్రజలు ఆందోళన చేస్తూ వచ్చారు, ఇక మీద ఆవిధంగా ఆందోళనచేసేవంతు తెలంగాణా సోదరుల దవుతుందేమో నంటున్నారు ముఖ్యమంత్రి. తెలంగాణా పరిస్థితులు మరీ అధ్వాన్నంగా వున్నమాట నిజమే కావచ్చు. తెలంగాణాతో సరిసమానమనదగినఅధ్వాన్న స్థితిలోనేవున్న ప్రాంతాలు, ఈ శాన్య ఆంధ్రప్రదేశ్ లో కూడా లేకపోలేదు. అందుచేత, ఒకే ప్రాంతంమీద దృష్టి అంతా కేంద్రీకరించి ప్రయోజనం లేదు. పైగా, అది స్థానికఅసంతృప్తికి హేతువవుతుంది. అన్ని ప్రాంతాలూ అభివృద్ధి కావలసినవే.


ముఖ్యమంత్రి రాష్ట్ర సమగ్రాభివృద్ధినే దృష్టిలో పెట్టుకుని వ్యవహరిస్తారనీ, ఇందుకు అవసరమైనస్థిరత్వాన్నీ, నైతికతనీ పరిపాలనలో సాధిస్తారనీ, మంత్రివర్గ విస్తరణకు సాగిస్తున్న మంతనాలలో కృతకృత్యులవుతారనీ, ఏడు వారాల క్రితం మహాత్ముని జన్మదినోత్సవం నాడు తుంగభద్ర ఎగువ కాలువకు ప్రారంభోత్సవం జరుపుతూ, ప్రధాని నెహ్రూ జన్మదినోత్సవం నాటికి వంశధార ప్రాజెక్టు శంకుస్థాపనోత్సవం జరుపుతానని ఇచ్చిన మాటను ఇకనైనా నెరవేరుస్తారనీ ఆశిద్దాము

* * *

ఆంధ్ర-మద్రాసు రాష్ట్రాలసరిహద్దులపరిష్కారానికి తమిళుల ఆందోళన ఫలించబోతున్నట్లే కనబడుతున్నది. తమిళులు ఎలాగయినా కార్యసాధకులు; ఒకవైపు ఆశాంతిని తెచ్చిపెట్టనూ గలరు; మరొకవైపు దాన్ని నిరసిస్తున్నట్లు ప్రకటనలూ చేయగలరు. చివరకు కేంద్రానికి వారి వాద నచ్చింది. ఒక కేంద్రమంత్రి నేత సమస్యను పరిశీలింపజేయడానికి సమ్మతించారు.

మరో వారంరోజులలో కేంద్ర న్యాయశాఖ మంత్రి శ్రీ పటాస్కర్ వచ్చి సమస్యను పరిశీలిస్తారని వార్తలు తెలియజేస్తున్నవి. సేలం జిల్లాలోని హోసూరు కూడా వివాదగ్రస్తమయిన ప్రాంతమేనని మద్రాసు ప్రభుత్వం ఒప్పుకున్నది. గత సంవత్సరం నవంబరులో ఈ సమస్యపై ఉభయ ప్రభుత్వాలు మంత్రివర్గస్థాయిలో ఈ సమస్యను చర్చించినప్పుడు, మద్రాసు ప్రభుత్వము హోసూరువిషయంససేమిరాఒప్పుకోనన్నది. ఒప్పుకునివుంటే, సమస్య అప్పుడే, పరస్పర సమాలోచనలద్వారానే తేలి వుండేది. కేంద్రమంత్రి మధ్యవర్తిత్వాన్ని అభిలషించవలసిన ఆగత్యమే వుండేది కాదు. తమవి కాని ప్రాంతాలు తమకే వుండాలని గాని, తమకే రావాలని గాని ఆంధ్రులు ఎప్పుడూ కోరలేదు. దీన్ని తమిళులు కూడా కాదనలేరు. శ్రీ పటాస్కర్ మధ్యవర్తిత్వాన్ని ఈ సమస్య సామరస్యంతో, ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో పరిష్కారమవుతుందని ఆశిద్దాము. ఏది ఏమైనప్పటికీ, ఆంధ్రనాయకులు అప్రమత్తతతో వ్యవహరించవలసిన సమస్యఇది. కానిపక్షంలో, నష్టం తప్పదు.

—"భార్గవ" ★



ఢిల్లీలో [illegible] ప్రదర్శనల సీజను
[illegible] మార్పులు


ఈ నెల 14వ తేదీ రోజు రోజంతా సందడిగానే గడిచింది. ప్రధాని పుట్టినరోజు పండుగకదా! ఆనాడే శ్రీ మురార్జీ దేశాయి వాణిజ్యశాఖ, పరిశ్రమల శాఖ మంత్రిగా కేంద్రప్రభుత్వంలో సభ్యులయ్యారు. పార్లమెంటు భవనంలో ఆనాడే లోక్ సభ శీతకాలపు సమావేశం ఆరంభమైంది.

పార్లమెంటు సమావేశంతో పాటు ప్రదర్శనల సీజను కూడా ఆరంభమైంది. ఈ ప్రదర్శనలనేవి న్యూఢిల్లీ ప్రజాజీవితంలో ముఖ్యాంశంగా తయారైనాయి.

డబ్బిస్తే పిసకడానికి సిద్ధమైవచ్చేవారిలాగా, ఏ వివాదంపడితే ఆ వివాదం దొరకపుచ్చుకొని ప్రదర్శనల్లో పాల్గొనేవారి సంఖ్య జాస్తిఅయింది. ప్రదర్శనలు లలితకళగా తయారైయినాయి. ఒక్కొక్క రకం ప్రదర్శనకు ఒక్కొక్క రకం జెండాలు, నినాదాల అట్టలు ప్రత్యక్షమవుతాయి. కాని నినాదంచేసేవారి గొంతుకలు మాత్రం ఎప్పుడుచూసినా అవే. నినాదజీవులు నినాదాల్ని అరుస్తారు. ఊరేగింపులోని జనం ప్రతిధ్వనిస్తారు. వితంతువుల మోస్తరుగా రొమ్ము బాదుకోవడం గాని, జుట్టుపీక్కోడంగాని చేయకపోయినా, "హై, హై" అని అరుస్తారు.

ఈ ప్రదర్శనలు చీటికిమాటికి జరుగుతూండడంచేత, వాటిని ఎవరూ పట్టించుకోడం లేదు. పిల్లి సమర్థించిందంటేచాలు, లేక సమర్థించలేదంటే చాలు ప్రదర్శకులు తయారు. అసంతృప్తి వెల్లడించడానికి ప్రదర్శనలొక్కటే మార్గమని వాళ్ళ అభిప్రాయం. ఎందుకయ్యా ఈ అసంతృప్తి? ఢిల్లీ రాష్ట్రం రద్దుకవడం గురించికాదు. ప్రభుత్వానికిచెందిన భూమిని ఆక్రమించుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకున్నందుకు అసంతృప్తి! ఒక్క ఢిల్లీ నగరంలోనే ప్రభుత్వ స్థలాలలోకి కాస్తకాస్తే జరిగి ఆక్రమించుకున్న కేసులు 34 వేలు ఉన్నాయి. పండిన ఆహారాన్ని మూతలు గీతలు లేకుండా బజార్లలో అమ్ముతున్న వ్యక్తులను దండిస్తేదానికీ నిరసనే! ఆ అసంతృప్తికీ ఈ నిరసనకు మధ్య బ్యాంకి ఉద్యోగుల, ఇన్సూరెన్సు ఉద్యోగుల హంగామా జోరెడు.

కేంద్రపారిశ్రామిక, వాణిజ్యశాఖ మంత్రిపదవిని స్వీకరించిన శ్రీ మురార్జీ దేశాయి.



ఈ బాపతు హంగామా న్యూఢిల్లీ దైనిక జీవితంలో అతి సాధారణాంశంగా పరిణమించింది. నిరసన ప్రదర్శనలు, అసంతృప్తి ఊరేగింపులు జరగనివారం ఏదో వెలితిగా ఉంటుంది. పార్లమెంటు సమావేశం జరిగే రోజుల్లో వీటి తాకిడి ఎక్కువౌతుంది. ఊరేగింపుదార్లు పార్లమెంటు వీధిలో ఊరేగి, రేగి పార్లమెంటు భవనం ఎదురుగా ఉన్న ఇర్విన్ ప్రభు విగ్రహంముందర మూగుతారు. అక్కడ వారిని పోలీసులు అటకాయిస్తారు. పార్లమెంటు భవనంలోకి పోనివ్వరు. వివాదాలు ద్విగుణీకృతమవుతాయి. ఊరేగింపులోంచి ఒకరు భవనంలోకి పోయి ప్రతిపక్షనాయకులకు కబురు చేసి తమ విజ్ఞప్తి అందిస్తారు. ప్రతిపక్ష నాయకులు వాళ్లకి ధైర్య వచనాలు చెప్పి ఫోటోలు తీయించుకుని, విజ్ఞప్తి తీసుకుని లోపలికి పోతారు. పనిపూర్తయింది కనుక ఊరేగింపుదార్లు ఎవరి దారిన వాళ్లు పోతారు.

* * *

చరిత్రాత్మకమైన లోడీ గార్డెన్స్ పరిసరాల్లో మేరీ బధ్వార్, మోలీమిడ్గ్లీ ఇటీవల భారతీయ వేషధారణ ప్రదర్శన మొకటి విజయవంతంగా జరిపించారు. ఈ సందర్భాన్ని వ్యాఖ్యాత్రి శ్రీమతి రోషన్ మీనన్ ఇలా వర్ణించింది.

"ఆరవ శతాబ్దంనుంచి మొదలుపెట్టి భారతీయ వేషధారణలో జరిగిన మార్పులను వరుసక్రమంలో ప్రదర్శించుతున్నాము. ఆరవ శతాబ్దంలో వేషధారణ నిరాడంబరంగా ఉండేది. ఆడవాళ్లు, మగవాళ్లు కూడా నడుమునుంచి క్రిందివరకు మాత్రమే దుస్తులు ధరించేవారు: నగలాట్టే ఉండేవికావు పర్షియన్, గ్రీకు సంపర్కంతో ఊర్ధ్వభాగాన్ని కూడా ఆచ్ఛాదించడం అలవడింది. ఈ విదేశీ సంపర్కానికి మనమెంతో ఋణపడిఉన్నాము.

అడుగుభాగంలో కట్టేవస్త్రాలు నిటారుగా ఉండే లాగునుంచి, దాదాపు లాగూ మోస్తరుగానే కనబడే ధోవతికట్టుదాకా అనేకరకాలుగా మారాయి. 15వ శతాబ్ద ప్రాంతంలో ఉత్తరాది స్త్రీలు లాగుబనులుగాను మోస్తరుగా కనబడే చీరకట్టు ప్రారంభించారు దక్షిణాదివ చీరెను కాళ్ళ మధ్యనుంచి తీసుకువచ్చి బుజంమీద

ఒక చెంగు వేసుకునే పద్ధతి ప్రారంభమైంది. ఇప్పటి రోజుల్లోని చీరకట్టు మొదటిసారిగా 16 వ శతాబ్దపు దక్కను రాజదర్బారులలో దొరికిన చిత్రాలలో కనబడుతుంది. ఈ దక్కను దర్బారులు ఉత్తరాన రాజపుత్ర దర్బారుల పద్ధతులు మాని వాటిని అలవరుచుకున్నాయి. ఇందువల్లనే కాబోలు దక్షిణాదినకూడా చీరె అడుగుభాగాన్ని లాగు మోస్తరుగా కాక గౌను మోస్తరుగా కట్టటం అలవాటైంది. ఆ తరవాత ఉత్తరాదిన ధరించే మేలిముసుగు చీరెకట్టుకూడా దక్షిణాది చీరకట్టుమాదిరిగా మారింది. కాని ఉత్తరాన గౌనుమోస్తరు కట్టు ఒకటే కాదు ఆచారంలో ఉంది; మొగలాలకు పూర్వం ముస్లిం రాజదర్బారులలో షరీయన్న మోస్తరుగా బిగుతైన లాగూలు, వదులైన చొక్కాయి ధరించేవారు. ఈ పద్ధతిని రాజపుత్రులు భారతీయ సంప్రదాయానికి అనుగుణంగా మార్చి అలవరుచుకున్నారు. వారినుండి మొగలులు అలవరుచుకున్నారు. ఫ్యాషన్లు మారడంతో, ఈ దుస్తులు అనేకరకాలుగా మార్పు చెందాయి.

20 వ శతాబ్దారంభానికి భారతీయ స్త్రీలలో ఎక్కువమంది దక్షిణాది చీరకట్టును,అనుసరించారు. ఉత్తరాదిలోని గౌనుమోస్తరు చీరెకట్టును మాని లంగాలు ధరించడం మొదలెట్టారు.

ఉత్తరాది యువతులలో షాల్వార్, కమీజు, వదులులాగులు ధరించడం పరిపాటైంది.

భారతీయ పురుషుని దుస్తులు ఇన్ని మార్పులు చెందలేదు. ధోవతులు, షరాయీలు చాలమంది ఇప్పటికీ ధరిస్తున్నారు. బిగుతుపైజామాలు, పిక్కలవరకూ వచ్చే కోటు మొగల్—రాజపుత్ర సంప్రదాయానికి చెందినవి."

వేషధారణ ప్రదర్శనం 6 వ శతాబ్దపు దుస్తులతో, అనగా భరతనాట్య వేషంతో ప్రారంభమైంది. చారల చారల షరాయి బిగుతుగానే ఉంది. రవిక ఇప్పటి మాదిరి పొట్టిదిగాకాక ఉత్తరీయం మోస్తరుగా ఉంది. విలువైన ముత్యాలు, రాళ్ళు పొదిగిన హారాలు, గాజులు, చెవికమ్మలు ఉన్నాయి కాలి అందెలలో చిన్న చిన్న గజ్జెలున్నాయి.

తరవాత చంద్రాపీడ మహారాజు, కాదంబరి వేషాలువచ్చాయి కాదంబరి మెడలోను, పిరుదులమీద ముత్యాలహారాలు దట్టంగా ఉన్నాయి.

11 వ శతాబ్దంలో దుస్తులు అలంకార ప్రధానంగా ఉన్నాయి. బంగారు నగల వాడకం ఎక్కువైంది. ఖండఖండాంతరాల్లో పేరు మ్రోగిన మజిన్‌గుడ్డ విరివిగా వాడుకలో ఉండేది. సాలీడుదారంకంటె సున్నితమైన దారంతో చేత్తో నేసిన ఈ మజిన్ గుడ్డతోనే ఎర్రనిషరాయి, దానిపైన జరీడిజైన్లు తయారైనాయి. ఈ వస్త్రం ముందరభాగంలో కుచ్చెళ్ళు కుచ్చెళ్లుగా పడుతుంది. ఈ వేషంధరించిన స్త్రీ న్యాష్లీ నగరపు అందాలరాణి. ఆమెనడకలో గొప్ప ఆత్మవిశ్వాసం, హుందాకనిపించాయి. ఆమె తలపై ముత్యాలు పొదిగిన బంగారు కిరీటం ధరించింది. చేతులకు, కాళ్లకు బంగారు నగలు ధరించింది

ఇంకా తరవాతకాలంలో, అంటే 1400 ప్రాంతంలో, గుజరాత్ వస్త్రధారణం చూస్తే ఆడంబరం పెరిగినట్లు తోస్తుంది. రవికకు చేతులు పొడుగయ్యాయి. నగలు బంగారపువే అయినా పనివాడితనం సన్నగిల్లింది.

1600 ప్రాంతపు కథక్ నర్తకి దుస్తులు మరీ విచిత్రమైనవి. అక్బరుకాలంలో ఆ మాదిరి వేషం నాలుగురకాలుగా ధరించబడేదని డా॥ ఘ్రాబీ పరిశోధనలు చేసి కనుక్కున్నారు. జహాంగీరుకాలంనాటికి బిగుతు పైజామా తప్ప మిగతావన్నీ వాడుకలోంచి పోయి, వేషం ఆధునిక 'బాలే' నృత్య వేషంలాగా తయారైంది.

సంఘం పతనమవుతున్నకొద్దీ వేషధారణ ఇంకా ఆడంబరం కాసాగింది.

18 వ శతాబ్దం అంతంలో సారాష్ని వేషం అమలులోకి వచ్చింది. ఈ వేషం ఆడంబరమైనదే. కథియవార్ స్థాపకులైన కాథీలు దీన్ని ధరించేవారు. నగలు మరీ విపరీతం. చెవులకు, చేతులకు, మెడకు, కాళ్ళకు ఎక్కడ చూసినా దట్టంగా నగలే.

వజిద్ అలీషా ఔధ్ రాజులలో ఆఖరివాడు. భోగలాలసుడు. దర్బారు మద్యానికీ, మదవతులకు, నృత్యగాన గోష్ఠికీ పెట్టిందిపేరు. కొలువులో స్త్రీలు అందగత్తెలు. వారి అలంకరణం శోభాయమానంగా ఉంటుంది. పైజామాలుధరించేవారు. పైజామా కాళ్లు మూడునాలుగు గజాల వెడల్పు వాటిమీద చెమ్కీపని బోలెడు. రవిక మజ్లిన్ గుడ్డతో కుట్టినది: పొట్టిది జరీపని తనం గల ఉత్తరీయాలు. చేతులకు, మెడకూ కాక, నుదుటిమీదికి పడేలాగ తలనిండా నగలు.

రాజాగారికి వదులు పైజామాలు, ఎర్రని, బంగారు వన్నెంగల కోటు. ఆయనకి కూడా ఒంటినిండా నగలే.

ఒక చెలికత్తె రాజాగారికి ఎప్పుడూ సరసనే ఉండి హుక్కా అందిస్తూ ఉంటుంది.

భరత్‌పూర్ లంగా 150 ఏళ్ళనాటి నుంచీ వాడుకలో ఉంది. అల్లిక పనితనం మెచ్చుకోదగింది. లంగా వెడల్పు 45 గజాలు. అంతకు పూర్వం దాని వెడల్పు రెట్టింపు ఉండేదట. జాట్ రాజవనితలు అటువంటిలంగాలు ధరించేవారు. మొన్నటి ప్రదర్శనంలో ఒక మెక్సికన్ మహిళ ఈ వేషం ధరించింది.

ఈజిప్టుకు సమితి బలాల ప్రయాణం

"ఈజిప్టు భూభాగంమీద బ్రిటిష్ ఫ్రెంచిసేనలు తిష్టవేసేటట్లు కనిపిస్తుంది. ఇప్పుడప్పుడే వీరు ఈ ప్రాంతంనుంచి తప్పుకునే సూచనలు లేవు బ్రిటిష్, ఫ్రెంచిసేనలు ఈ విధంగా వుండిపోతే, అతిశీఘ్ర కాలంలోనే పరిస్థితి విషమించితీరుతుంది. ఈ పరిస్థితిని అదుపులో పెట్టకపోతే, యుద్ధంతప్పదు." అని ప్రధాని నెహ్రూ గత శుక్రవారంనాడు లోక్ సభలో అంతర్జాతీయ వ్యవహారాలను సమీక్షిస్తూ హెచ్చరిక చేశారు.

యుద్ధవిరమణ జరగాలనీ, బ్రిటిష్, ఫ్రెంచి, ఇస్రేలీ సేనలను తక్షణమే ఉపసంహరించాలనీ ప్రపంచ రాజ్యసమితి ఖండితంగా ఆదేశించినప్పటికీ, ఆ ఆదేశం ఇప్పటికీ పూర్తిగా ఆచరణలోకి రాలేదు. పోరాటం ఆగలేదు. పోర్టుసయ్యద్ పై అడపాదడపా విమానదాడులు ఇప్పటికీ సాగుతూనే వున్నవి ఆ రేవుపట్టణం నుంచి ఖాళీచేసి తలదాచుకోడానికి వేరే ప్రాంతాలకు పోతున్న నిరాయుధులైన అమాయిక ఈజిప్షన్ ప్రజలను అమానుషంగా కాల్చివేయడంకూడా జరుగుతున్నది. ఈజిప్టుపై దురాక్రమణ జరిపి కాలువప్రాంతంలో తిష్టవేసిన సేనలను ఉపసంహరించడానికి బ్రిటన్ ఫ్రాన్సులు లేనిపోని షరతులను పెట్టడం జరుగుతున్నది. తమ అధీనంలోకి వచ్చిన సూయజ్ కాలువ కీలకప్రాంతాలు చెయ్యిజారిపోకుండా చూసుకోడానికి బ్రిటన్ ఫ్రాన్సులు తాపత్రయపడుతూంటే, దురాగతంద్వారా చేజిక్కించుకున్న గాజా ప్రాంతాన్ని నిలబెట్టుకోవాలని ఇస్రేల్ తాపత్రయ పడుతున్నది.

సూయజ్ కాలువ తమ అధీనంలో లేకపోతే, కనీసం అంతర్జాతీయ ఆధిపత్యంలోనైనా వుండాలన్న పట్టుదలతోనే బ్రిటన్ ఫ్రాన్సులు మొదటనుంచీ వ్యవహరిస్తూ వచ్చినవి. బలప్రయోగంద్వారా, మెరుపుయుద్ధంలో దాన్ని స్వాధీనపరచుకొని, తర్వాత అవసరమైతే, ప్రపంచ రాజ్యసమితికి అప్పగిద్దామన్న బ్రిటన్ ఫ్రాన్సులు పన్నిన కుతంత్రం భగ్నమైంది. సమితి ఆదేశించిన అంతర్జాతీయ సైనికదళంలో బ్రిటన్ ఫ్రాన్సులకు స్థానం లేకపోవడంతో, ఆ సామ్రాజ్య రాజ్యాల ఎత్తుగడ విఫలమైంది. అందుచేతనే కాలువప్రాంతంనుంచి తమ సేనలను బేషరతుగా ఉపసంహరించడానికి ఆ



ఈజిప్టుకు అంతర్జాతీయ పోలీసుదళాన్ని పంపించడంలో ప్రముఖపాత్ర నిర్వహించిన సమితి కార్యదర్శి శ్రీ హామర్ షెల్డ్.

రాజ్యాలు నిరాకరిస్తున్నవి. పరిస్థితులు ఈ విధంగా వుండగా, రష్యా ప్రధాని బుల్గానిన్ గతవారం బ్రిటన్, ఫ్రాన్సులకు ఒక లేఖ వ్రాస్తూ ఈజిప్టులో సాగించిన విధ్వంసక కాండకు బ్రిటిష్ ఫ్రెంచి ప్రభుత్వాలు కైరో ప్రభుత్వానికి నష్ట పరిహారం ఇవ్వవలసి వుంటుందని ఒక హెచ్చరిక చేశారు. రష్యా సూచనను మన్నించినా, మన్నించకపోయినా, అన్ని విధాలా దెబ్బతినిపోయిన ఈజిప్టుకు బ్రిటన్, ఫ్రాన్సు, ఇస్రేలీ రాజ్యాలు పరిహారం ఇవ్వక తప్పదు; ఈ సమస్య ఉత్తరోత్తరా ప్రపంచ సమితి ద్వారానే పరిష్కారం కావలసి వుంటుంది. సమితి ప్రధాన కార్యదర్శి డాగ్ హామర్ షెల్డ్ కైరోకు వెళ్ళి అధ్యక్షుడు నాసర్ తో సమాలోచనలు పూర్తిచేసి తిరిగి న్యూయార్కు వెళ్ళారు. కెనడియన్ సేనాని బరన్స్ ఆధ్వర్యాన ఈజిప్టు పరిస్థితిని అదుపులో పెట్టడానికి సమితి సైనికదళం ఏర్పాటవుతున్నది. ఈ దళంలో పాల్గొనడానికి భారతదేశం దాదాపు నాలుగువందలమంది సైనికులను పంపాలని నిర్ణయించింది.

ప్రధాని నెహ్రూ ఆశీర్వాదంతో మొదటి జట్టు విమానంలో ప్రయాణమై వెళ్ళింది. ఇండోనేషియాకూడా మరొక ఆరేడు వందలమంది సైనికులను పంపబోతున్నది. నార్వే, స్వీడన్, డెన్మార్కు తదితర దేశాలనుంచి కూడా సేనలు చేరుతున్నవి. ఈ అంతర్జాతీయ సైనికదళంలో పాకిస్తాన్ సేనలకు స్థానం వుండకూడదని అధ్యక్షుడు నాసర్ స్పష్టపరిచాడు. ఈజిప్టు సమ్మతించనిదే ఏ దేశపు సేనలు అక్కడికి వెళ్ళడానికి వీలుండదు. బాగ్దాద్ సైనికకూటంలో అమెరికానుకూడా చేర్చడానికి ప్రయత్నిస్తున్న పాక్ ప్రధాని సురవర్దీ వైఖరిని శ్రీ నాసర్ తీవ్రంగా నిరసిస్తున్నారు. కైరో వెళ్ళిన సురవర్దీతో సంప్రతించడానికికూడా ఈజిప్టు అధ్యక్షుడు ఇష్టపడలేదు.

పాక్ ప్రధాని ధోరణిపట్ల పాకిస్తాన్‌లో తీవ్ర అశాంతి చెలరేగుతున్నది. ఈ అశాంతి ఇలా చెలరేగితే, పాకిస్థాన్‌లో మంత్రివర్గ ప్రతిష్టంభన తప్పదు. బ్రిటన్ ఫ్రాన్సుల మొండిపట్టుదలవల్ల సమితి సైనికదళం ఈజిప్టులోనూ, సూయజ్ కాలువ ప్రాంతంలోనూ గురుతరమైన బాధ్యతలనే ఎదుర్కొనవలసి వచ్చేమాట నిజం. ఈ అంతర్జాతీయ సైనికదళ ఆజ్ఞలను బ్రిటన్ ఫ్రాన్సు, ఇస్రేలీ ప్రభుత్వాలు శిరసావహించక ధిక్కరించే పక్షంలో సమితి వాటిపై తీవ్రప్రతీకారానికి ఉపక్రమించవలసివుంటుంది. ఈజిప్టు సమస్య ముందు ముందు ఏ విపరీతమైన పరిణామాలకు దారితీసుందో చెప్పలేము. ★

★ మూడు దేశాల కుట్ర ★


ఈజిప్టుపై ఇస్రేల్ దురాక్రమణ ప్రారంభించిన 24 గంటలలోగా, బ్రిటన్ ఫ్రాన్సులు కలిసి ఇస్రేల్, ఈజిప్టులకు అల్టిమేటమ్ పంపించి కైరోపై బాంబులు వేయడం ప్రారంభించాయి.

"అరెరే, బ్రిటన్ ఫ్రాన్సులుదిగుతాయని మాకు తెలియనే తెలియదే!" అని ఇస్రేలీ విదేశాంగ మంత్రి ఆశ్చర్యపోయారు. బ్రిటిష్ విదేశాంగ మంత్రి లాయిడ్ "మాలో మేము లాలూచీపడ్డామని కదూ, మీ అనుమానం? అలాంటిదేమీ లేదు ప్లీజ్' అని అమాయకత్వం అభినయించారు. కాని ఇస్రేల్

★ మూడు దేశాల కుట్ర ☆

బ్రిటన్, ఫ్రాన్సులు మూడూ మూడు వాయిద్యాలు వాయించినా, కూడబలుక్కుని ఒకే పాటని వాయించాయని కావలసినన్ని నిదర్శనాలున్నాయి. ఫ్రాన్సు పురికొల్పింది. బ్రిటన్ కొంచెం ఆలస్యంగానైనా తనూ పురికొల్పింది. ఇస్రేల్ 'రైటో' అని ముందుకు దూకింది.

అధ్యక్షుడు నాజర్ సూయజ్ కాలువ కంపెనీని జాతీయం చేయడం, ఆల్జీరియాలో జాతీయవాదులను నిభాయించుకోలేక పోవడంతో ఫ్రాన్సు పిచ్చెక్కినట్లయి ఏదో అఘాయిత్యం చేస్తేగాని లాభం లేదనుకుంది. సూయజ్‌ను మళ్ళీ ఆక్రమించుకోడానికి బ్రిటన్‌ను రెచ్చగొట్టి సంయుక్త సైనికపథకం తయారు చేసింది. ఒకమూల లండన్‌లోను, ఐక్యరాజ్య సమితిలోనూ "శాంతియుతమైన" సంప్రదింపులు జరుగుతూనే ఉన్నాయి; మరోమూల బ్రిటిష్, ఫ్రెంచి సేనలు సైప్రస్‌లో సర్వసన్నాహాలు సాగిస్తూనే ఉన్నాయి. టాంకులకు ఇసుకరంగు పూశారు. సూయజ్ ప్రాంతాన్ని ఆక్రమించుకున్న తరవాత జారీచేయడానికి కొత్తనోట్లు అచ్చువేశారు. తమపౌరులను చేరవెయ్యడానికి విమానాలను సిద్ధం చేసుకున్నారు.



ఇస్రేల్ ప్రధాని బెన్‌గురియన్ సెప్టెంబరు 23 న ఆనందం పట్టలేక "మాకో మంచి నేస్తం దొరికాడు" అని బాహాటంగా అనేశారు. "ఎవరా నేస్తం?" అని అమెరికన్లు అడిగితే "చెప్పంపో"మ్మన్నారు.

బ్రిటన్‌కు అరబ్ రాజ్యాలు ఎదురు తిరగడం, నాజర్‌ను లొంగదీయడానికి చేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థం కావడం, అమెరికన్లు శల్యసారథ్యం చెయ్యడం — వీటితో చిరాకు పెరిగిపోయింది.

అక్టోబరు 16 న ఈడెన్, లాయిడ్ పారిస్ వెళ్లారు. ఫ్రెంచి ప్రధాని మోలేతోను, విదేశాంగమంత్రి పినోతోను అయిదుగంటలసేపు తమ సొంత సలహాదార్లనుకూడా రానీయకుండా రహస్యంగా మంతనాలు జరిపారు. అప్పటికే వారికి తెలుసు ఇస్రేల్ ఈజిప్టుపై దూకబోతోందని. ఇస్రేల్ దాడినుంచి సూయజ్‌ను రక్షించాలనే వంకతో మళ్ళీ సూయజ్‌ను ఆక్రమించుకుందామని కూడా ఈడెన్, మోలే ఆనాడే, అంటే ఇస్రేల్ ఇంకా 12 రోజులకు దురాక్రమణ ప్రారంభిస్తుందనగానే ప్లాను పన్నారు.

అప్పటినుంచే బ్రిటన్, ఫ్రాన్సులు అమెరికాతో తమ పథకాల్ని గూర్చి, తాము చేసే రహస్యాలోచనల్ని గూర్చి చెప్పడం మానేశాయి. "మాకు దండయాత్ర చేసే ఆలోచనే లే"దని కూడా అమెరికన్ ప్రభుత్వాన్ని నమ్మించాయి. అక్టోబరు 23 న పినో లండన్ వెళ్ళి "ఇస్రేల్ నాజర్ మీదికి పోవడానికి సర్వసిద్ధంగా ఉం"దని చెప్పి వచ్చారు. ఈముక్కను ఈడెన్ అమెరికాతోగాని, కామన్వెల్తు రాజ్యాలతోగాని కామన్సు సభతోగాని, ఆఖరికి సెల్విన్ లాయిడ్‌తో తప్ప తన తోటి మంత్రులతోగాని చెప్పలేదు. మొట్టమొదటి ఇస్రేలీ టాంకు ఈజిప్టు సరిహద్దును ఇంకో పదకొండు గంటల్లో దాటుతుందనగా పినో మళ్ళీ లండన్ వెళ్లారు. "యుద్ధం మొదలైనట్లేనా?" అని ఒకరడిగ్గా "ఇప్పుడప్పుడే చెప్ప"నన్నారు. జెరుసలెంలోని బ్రిటిష్ రాయబారి సర్ జాన్ నికొల్స్‌కు అక్టోబరు 29 పొద్దునే ఆరాత్రి ఇస్రేలీ సైన్యం దాడి ప్రారంభిస్తుందని తెలిసింది. ఆ సంగతి ఆయన ఈడెన్‌కు అందజేశారు.

విషాదఘడియలలో
హంగరీ ఆక్రందనం

ఈమధ్య చెలరేగిన మహాసంక్షోభంలో ఒక అయిదు రోజులపాటు హంగరీ స్వాతంత్ర్యం అనుభవించింది. అంతలోనే ఆ స్వాతంత్ర్యం అంధకార బంధురమై హరించిపోయింది!

అక్టోబరు 30వ హంగరీనించి రష్యా సైన్యం వెళ్ళిపోతుందని రష్యా నాయకులు వాగ్దానం చేశారు. సైన్యాలను తరలించివేసే వ్యవహారం పరిష్కరించడానికి సంప్రతింపులు జరగగలవని కూడా ప్రకటించారు.

రష్యా ప్రతినిధులు, హంగరీ ప్రతినిధులు ఈ వ్యవహారంపై సంప్రతిస్తూండగానే సోవియట్ రష్యా అదనపు సైన్యాలు తిరిగి శరవేగంతో హంగరీలో ప్రవేశిస్తున్నాయనే పుకారులు గుసగుసలు వ్యాపించాయి. మొత్తం మీద పదేపది రోజుల వ్యవధిలో సోవియట్ ఉపగ్రహరాజ్యమైన హంగరీలో విప్లవం రావడము అయిదు రోజులపాటు స్వాతంత్ర్యం ఊపిరి పీల్చుకోవడము, మళ్ళీ అంతలోనే రష్యా సైన్య పదాఘాతంకింద పడి నలిగిపోవడము అన్నీ జరిగిపోయాయి.

నవంబరు నాలుగవ తేదీ ఆదివారంనాడు హంగరీ రాజధాని బుడాపెస్టునుంచి వియన్నాకు (ఆస్ట్రియా) టెలిప్రింటర్ లైన్‌పై వచ్చిన వార్తలలో ఈ విషాదగాథ అంతా క్షణక్షణానికీ మారుమ్రోగిపోయింది. ఆ వార్తలలో ప్రస్ఫుటమైన హంగరీ ఆక్రందనాన్ని ఇక్కడ తెలియజేస్తున్నాము.

* * *

“రష్యా దోపిడీముఠా మమ్మల్ని మోసగించారు! బుడాపెస్టు నగరంఅంతా మర ఫిరంగుల ఘోషతో మారుమోగిపోతున్నది. యూరప్ దేశాలకు, ఆస్ట్రియాకు ఈ సంగతి వెంటనే తెలియజెయ్యండి! కదర్ తన అనుచరులతో ప్రభుత్వం ఏర్పాటు చేశాడు. అతగాడు రష్యాకు నమ్మినబంటు!”

అంతటితో హఠాత్తుగా ఆవార్త ఆగిపోయింది. ఇంకొక క్షణంలో టెలిప్రింటరు యంత్రం మళ్ళీ మారుమోగింది:

“కొన్ని వందలు రష్యా టాంకులు బుడాపెస్టు నగరం మీదికి దండెత్తివచ్చాయి. ఘోరంగా యుద్ధం సాగుతూంది. ప్రతీ సంగతీ ప్రపంచానికి స్పష్టంగా తెలియజెయ్యాలనే పట్టుదలలో నేనిక్కడ కూర్చున్నాను. రష్యా టాంకులప్పుడే రాకోసి వీథి వరకూ వచ్చేశాయి”.

టెలిప్రింటరు రణగొణ ధ్వని ఒక క్షణంపాటు ఆగిపోయింది. రెండో క్షణంలో మళ్ళీ మొదలు...

“మర ఫిరంగుల ఫిరంగిగుళ్ళ వర్షంతో చెవులు గల్లు పడుతున్నాయి. ప్రధాని నాజ్ ప్రజలను హెచ్చరిస్తూ ప్రసంగిస్తారు. మీ రేదైనా ముఖ్యవార్త పంపిస్తారా! త్వరగా! త్వరగా!”

తరవాత ఒకగంటసేపటిదాకా టెలిప్రింటరు కదలిక లేదు. ఆ తరవాత యంత్రం మళ్ళీ కదిలింది. ఆ కదలికతో విషాదగాథ ప్రారంభమైంది:

“నేను ప్రధాని నాజ్ తరఫున మాట్లాడుతున్నాను. మా ప్రజానీకం అంతా సహాయంకోసం ఆక్రోశిస్తున్నారు!”

అంతలోనే టెలిప్రింటరు ఆగిపోయింది. ఒక నిమిషం తరవాత మళ్ళీ మోగింది:

“ఏదైనా ముఖ్యవార్త అందజేస్తారా? హంగరీ దేశము, ప్రజ చిరకాలం వర్ధిల్లాలి! రషియనులు భాస్వరంతో నింపిన తుపాకీ గుళ్లు ప్రయోగిస్తున్నారు!

“సహాయం మా కేమైనా చెబుతారా!

ఈజిప్ట్‌పై మూడు దేశాలకుట్ర

మర్నాడు ఈడెన్ అల్టిమేటమ్ ప్రకటించారు. ఈజిప్టు తన సరిహద్దునుంచి వంద మైళ్లు వెనక్కి తగ్గాలని, ఇస్రేల్ నుంచి సూయజ్‌ను రక్షించడానికి వీలుగా బ్రిటిష్, ఫ్రెంచి సేనలను సూయజ్ ఆక్రమించుకోనివ్వాలనీ అల్టిమేటమ్ సారాంశం. అల్టిమేటమ్ ఇచ్చినవెంటనే, ఇస్రేలీల జోలికి పోలేదు సరిగదా, ఈజిప్షనపై బాంబు దాడి సాగించారు.

ఆనుపానులన్నీ ఆలోచించివేసుకున్న ప్లాన్ను ప్రకారమే బ్రిటన్, ఫ్రాన్సు, ఇస్రేల్ దురాక్రమణ జరిగిపోయింది. లాలూచీలేదని బుకాయించినా నమ్మేదెవ్వరు? —“టైమ్” నుంచి. ★

త్వరగా! త్వరగా చెప్పాలి! ప్రధాని నాజ్ స్వయంగా సహాయం కావాలని అర్థిస్తున్నాడు! రేడియోలో ప్రసంగిస్తున్నారు!"

ఆతరవాత టెలిప్రింటరు మరి పలకలేదు. కాని బుడాపెస్టు వార్తాపత్రిక జాబాద్ నెప్ వియన్నాలో ఒక వార్తాసంస్థ కార్యాలయానికి క్రిందిసందేశం అందించింది:

"రక్షించండి! రక్షించండి! మా శాయశక్తులా సాయం చెయ్యండి! చిన్నపిలలు కూడా ఆయుధాలు చేతబుచ్చుకుని, వీధులలో రష్యన్లతో పోరాడుతున్నారు. మేమేమీ జంకిపోవడంలేదనీ, నిర్భయంగా పోరాడుతున్నామనీ ప్రపంచ ప్రజానీకానికి ఎలుగెత్తి చాటండి!

"పోరాటం మా కార్యాలయం సమ్మంముంచే సాగుతూంది. మాదగ్గిర చాలినన్ని తుపాకులైనా లేవు! ఎంతకాలం పోరాడగలమో మాకే తెలియదు. పెద్దపెద్ద బాంబులు మాకిళ్లి కెదురుగుండానే పేలుతున్నాయి. పైన విమానాలహోరు మారుమోగుతూంది. అయినా మాకేమీ భయంలేదు."

"నేనుకూడా కళ్లుమూసుకుని పోరాటంలోకి దూకుతున్నాను. కిటికీదగ్గిరికి పరుగెడుతున్నాను. మళ్ళీ తిరిగివస్తాను. నా శరీరంలో ఒక్కరక్తబిందువైనా మిగిలేదాకా నేనూ పోరాటం సాగించి తీరతాను. కింది అంతస్తులో ఉన్నవాళ్ల దగ్గిర ఒక్క చేతిబాంబుకూడా లేదు.

"మళ్ళీ తుపాకులమోత వినబడుతూంది. మాలో కొంతమందికి బలంగా గాయాలు తగిలాయి. టాంకులతో వట్టి చేతులతో పోరాడడమెలాగ?

"ఇంతకీ సమితి ఏమి చేస్తూనట్లు? మాకు కొంచెం మాట సహాయమైనా చెయ్యండి! రెండుమూడు గంటలలో అమెరికా సైన్యాలిక్కడికి రాగలవని వదంతులు బయలుదేరాయి. ఇది నిజమేనా? ఉదయం 9½ దాకా మా పోరాటం సాగుతూనే ఉంది!"

అంతే! ఆమాటతో టెలిప్రింటరులో చైతన్యం పూర్తిగా స్తంభించిపోయింది. బుడాపెస్ట్ వార్తాపత్రిక వార్తలుకూడా అంతటితోనే ఆగిపోయాయి.


తరవాత బుడాపెస్ట్‌లోని మరొక వార్తాసంస్థ విలేఖరి పంపించిన ఈ తుది వర్తమానంతో హంగరీ స్వాతంత్ర్య సమరం నామమాత్రావశేషమై పోయింది. ఆ వార్త ఇది:

"మిత్రు లందరికీ మాఅభినందనవాలు ఇక మాకు దేవుడే దిక్కు! రష్యన్లిప్పుడే మామీద విరుచుకుపడ్డారు!"

* * *

రష్యాతో పోలిస్తే హంగరీ చాలా చిన్న దేశం.

అలాంటి చిన్న దేశం రష్యా ప్రచండాయుధశక్తికి కెదురుగా నిలబడడం మాటలతో పనిగాదు. అయినా హంగరీ ప్రజ



'గుండె బలం'

గుండెమీద శస్త్రచికిత్స చెయ్యాలంటే ముందుగా గుండె శక్తిసామర్థ్యాలు తెలుసుకోవడం చాలా అవసరం. లేకపోతే ప్రమాదాలు కలగవచ్చును.

అమెరికాలో ఇటీవల ఒక కొత్త పద్ధతి కనిపెట్టారు. ఈ కొత్త పద్ధతి శస్త్రవైద్యులకు చాలా ఉపయోగిస్తుందని అనుకుంటున్నారు. ఇంతకు పూర్వం జంతువుల గుండెలలో ఏర్పడే రక్తప్రవాహం వేగాన్నిబట్టి ఆయా జంతువుల హృదయశక్తులు గ్రహించేవారు.

మనుష్యుల హృదయాల మీద కూడా అదేపద్ధతి ప్రవేశపెడతారట. ఈ కొత్త పద్ధతి ప్రకారం కాలులోని ఒక ధమనిక (ఆర్టరీ) లోకి సున్నితమైన ప్లాస్టిక్ గొట్టాలు రెండు చొప్పించి, వాటిద్వారా, "ఎకాథీటర్" అనే యంత్రం సహాయంతో, ఆ మనిషి హృదయశక్తి ఎంతో నిక్కచ్చిగా తేల్చుకుంటారు.

హంగరీ ఆక్రందనం

ధైర్య సాహసాలతో రష్యా బలాల కెదురుగా నిలిచి తమ స్వాతంత్ర్య పోరాటం సాగించారు. ప్రపంచ రాజ్యాలన్నీ ఈజిప్టు సమస్యతో సతమతమవుతూన్న సమయం కనిపెట్టి రష్యా దొంగచాటుగా హంగరీపై గట్టి దెబ్బతీసింది.

అసలు హంగరీలో అల్లకల్లోలం చెలరేగే సూచనలు కనబడగానే బ్రిటను, ఫ్రాన్సులు ఇజ్రేల్ తో రహస్యంగా చేతులు కలిపి హఠాత్తుగా ఈజిప్టుమీద విరుచుకు పడ్డాయి.

ఇలాగ ఈ రెండు దురాక్రమణలకు చాలా దగ్గర సంబంధము, పోలికలు ఉన్నాయి.

బ్రిటన్ ఫ్రాన్సుల ఆయుధ బలంతో పోల్చి చూస్తే ఈజిప్టు బలంకూడా చాలా తక్కువే.

అయినా సంయుక్తరాజ్య సమితి ఒత్తిడివల్ల నైతేనేమి, రష్యా బెదరింపులవల్ల నైతేనేమి ఈజిప్టులో పైపైకి యుద్ధవిరమణమైనా జరిగింది.

కాని రష్యా ప్రచండ బలంతో హంగరీపై విరుచుకుపడడంతో హంగరీ స్వాతంత్ర్యం అంధకారంలో ఆర్తనాదంగానే మిగిలిపోయింది. ★

నాటిక

పెద్దమనిషి

(గతసంచిక తరవాయి)

గాగిల్సు: చట్టం వరకూ అవసరం లేదు చూస్తారూ - మనమే వీళ్ళని ప్రోత్సహిస్తున్నాం-ఎవ్వడూ ఒకదమ్మిడీఅన్నా ఇవ్వడం మానిండి-నాలుగురోజుల కెవడన్నా ఉంటాడేమో...

ఏజెంటు- (ఒకముష్టివాడితో) ఏరా? (పాకలవేపు చూపిస్తూ) అటువేపు తాగే నీళ్లు దొరుకుతాయా?

ముష్టివాడు! నేను బాబయ్యా...సాయింత్రం గాడీరావాల... నీరు దొరకాల. బాబయ్యా ఒకఅణా ధర్మం సెయ్యి బాబయ్యా రెండు రోజులె తిండి నేదు—

ఏజెంటు. (ముఖం తిప్పుకుని గంభీరంగా పెట్టుకుంటాడు. వాడితో మాటాడనట్టె).

గాగిల్సు: ఎంత Idleness - పెరుగుతున్నాది దేశంలో. Collosal waste of human energy - మూర్తిగారు నాతో ఒప్పుకుంటా రనుకుంటాను.

మూర్తి: (ఇటు చూచి, చిరునవ్వు నవ్వి, ముఖం తిప్పుకుంటాడు).

50 ఏళ్ళ వ్యక్తి: వాడి ముందా మొన్న మద్రాస్‌లో ఒక ముష్టి వాడికి బ్యాంక్ అకౌంట్ ఉందిట - మొన్న పేపర్ లో తేలిందీ సంగతి.

గాగుల్సు: చూసేరా...చూసేరా మరి? అదీ జరుగుతోంది మనదేశంలో - మరి మన దేశస్థితి ఇలా ఉండక ఏమవుతుంది? ఛీ!... వాళ్ళు మాచెస్తే అసహ్యం ... (ముఖం మీద మందు పుచ్చుకున్నట్టు పెడతాడు).

(ముష్టివాళ్లు గాగుల్సున్నాయన ఉన్న వేపు వస్తారు).

ఒరియా : ఒణా గొట్టేదియె బాబూ. తుమొకు జొరొ కొరిచి బాబూ...

(అణా ఒక టివ్వండి బాబూ ... మీకు దండం పెడతా బాబూ—)

హిందీ: దో అణా దేవ్ బాబా... చాకీ నేకా...

50 ఏళ్ల వ్యక్తి: ఎక్కడెక్కడి వాళ్లూనూ - ఒకఒరియా ఏమిటి - హిందీ ఏమిటి... తెలుగేమిటి ... దేశం మొత్తంమీద...

(ముష్టి వాళ్లు చెవులు చిల్లులు పడేటట్టు గోల చేస్తారు)

గాగిల్సు : (లేచి పెద్దనోరుతో) Get away bastards! !

(గోలకట్టి పోతుంది - అంతా అదోలా చూసి బస్సు వెనుకకి పోతారు - మూర్తి, గాగుల్సాయన వేపు కొద్దిగా ఆశ్చర్యపోతూ చూసి ముఖం తిప్పుకుంటాడు.)

ఒకరైతు : (వెనకకు పోతూ) దరమదాతలు నేడు - ఏంముందా కొలమొచ్చి నాది.

మరోరైతు : ఒక అణా ఇత్తే యీళ్ళ సొమ్ము తిరిగి పోతాదా.... బగమంతుడు సూడడా...యీళ్ళకీ ఆ గేచారంరాదా?

ఒరియా : ధొర్మొ సొబ్బు నాసొహాయిగొల్లా - కలి దెఖిలె ఒదొర్మొయొకా...

(ధర్మంఅంతా నాశనమైపోయింది. ఎక్కడ చూసినా అధర్మమేకదా—)

ముసలమ్మ : (నోరు పెడుతూ) పిల్లలు తింటున్నదిచ్చి మంతావులే-పిండం పెట్ట - ఒరే బుల్లిగా - అముంధని తగులు!

భార్య : కొంచం వడ్డింద తియ్యి - నాకాకలికావడం లేదు - ఏం చేసుకుంటాం...

పండిట్ : అవతరించింది అన్నపూర్ణ. (బైటికిచూసి) వెధ వ్యాధ వ్యాధులు-ఫావే...

ముసలమ్మ : మిగులే పిల్లలు తింటారు- పారేసుకుంటాములే వెర్రిపిల్లా--

(16 ఏళ్ల అమ్మాయి బస్సుదగ్గరి కొస్తుంది ఛాయ నల్లగావున్నా ముఖం ఆకర్షణీయంగా ఉంది - ముఖ్యంగా కళ్లు, అమాయకంగా కానొస్తూ-ఒంటి మీది బట్టలు బాగా మురికి బట్టి అక్కడక్కడ చిరిగికూడా ఉన్నాయి).

అమ్మాయి: (బస్సుకు దగ్గరగా వెళ్ళి మూర్తి ఉన్న చోట నిల్చొని ఆయనతో) బాబూ...

మూర్తి : (ఆమెను చూస్తాడు కనురెప్పలు వాల్చకుండా - కొంత సేపు చూసి ముఖం తిప్పుకుంటాడు,ఆమెని చూడనట్టు).

అమ్మాయి : (చిన్నగొంతుతో) అయ్యకి కళ్లు నేవు. రెండుగోజుల్నుంచి గింజల్లేవు బాబూ...

(అందరూ ఆమెను చూస్తారు. పేపర్ ఆయన పేపర్ అలా ఉంచుకునే చూస్తా ఉంటాడు. ఆమె మరెవ్వరినీ అడగదు- అంతా కొంతసేపుచూసి, ముఖం తిప్పుకుని మళ్లీ చూస్తూముఖం తిప్పుకుంటూవుంటారు- కాని ఎవ్వరూ ఏమీ ఇచ్చేందుకు ప్రయత్నం చెయ్యరు, మధ్య మధ్యని ఒకర్నొకరు అదోక రకంగా చూసుకుంటూ)

అమ్మాయి : (మరెవ్వరినీ అడగక మూర్తినే) అయ్యకి కళ్లు నేవు. రెండురోజుల్నుంచి పస్తున్నాడు బాబూ.

గాగుల్సు : (ఆమెని పరీక్షగాచూసి) దీనికొక్క దమ్మిడీ యిచ్చినా మనమంతా కట్టి పనికిరాని వాళ్ళమన్నమాట - బోనపడి పోతున్నాది. తనకున్న కొస్త ఛారమ్ (Charm)నిఉపయోగిస్తున్నాది,ఈవిధంగా చూడగానే ఎవడన్నా వలలో పడిపోతాడు. How sad! How sad!! ఎంత అధమాధపు స్థితికి దిగజారిపోతున్నారు మనుష్యులు. మన దేశం ఎలా బాగుపడుతుంది? ఏమంటారు మూర్తిగారూ...

మూర్తి : (అతనివేపుచూసి, రాని చిరునవ్వును తెచ్చుకుని తల తిప్పుకుంటాడు.)

గాగిల్సు: మీరు న్యాయమైన మాట అనగలరు - చూడండి ఈ పిల్లస్థితి- ఎంత అధమాధపునీచస్థితికి దిగిపోయిందో. నేను ఘంటా పదంగా చెప్పగలను -

★ మంథా వెంకటరమణారావు ★

★ పెద్దమనిషి ★

ఇలాటివాళ్లు రోగాలతోనూ వాటితోనూ కుళ్లి కుళ్లిచస్తారు. డబ్బుకోసం ఎంతకన్నా కక్కుర్తిపడుతున్నా చేస్తారు...Nature యిచ్చిన ఈCharm తో ఎన్ని నాటకాలన్నా ఆడతారు సాగినంతసేపు——ఈరకం ఏంతక్కువ రకం అనుకున్నారా?

అమ్మాయి: (ఆశ్చర్యపోయి, అమాయకంగా చూస్తుంది అందరి ముఖాలలోకీ.

(అందరూ ఈమాటలు వింటూ ఆమె వేపు మరో దృష్టితో చూస్తారు——

మూర్తి, గాంగుల్సు ఆయనవేపు ఆశ్చర్యపోయి చూసి అతనికళ్లు కలియగానే చిరునవ్వునవ్వి తలదించుకుంటాడు.)

గాంగిల్సు: మీకేం అనుమానం అక్కర్లేదు మూర్తిగారూ...చూడండి - మీ వేపే ఎలాచూస్తున్నాదో -- మీమీదే కన్ను వేసి ఉంచింది ఇందాకట్నుంచి-

(మూర్తి ఆశ్చర్యంగా చూస్తాడు గాంగుల్సు కేసి ఏమీ అనక)

ఔను మూర్తీజీ - ఏం? నమ్మరా? The thing is simple-వీళ్ల స్థితిచూసి ఎవడన్నా అడ్వాంటేజ్ (Advantage) తీసుకుని దారిచూసి వదిలేస్తాడు- దాంతో ఇంక అదే How sad! How sad!

అమ్మాయి: (మూర్తి ముఖంలోకి ఏదో జవాబుకోసంలా చూస్తుంది- మూర్తి మాటాడక ముఖం మరో వేపు మళ్లించుకుంటాడు-

(ఆమెముఖం ఎర్రనౌతుంది ఆమె అక్కడ్నించి కదలిపోతుంది)

గాంగిల్సు: (ఫ్రెండ్...మూర్తిగారూ... ఫ్రెండ్ - ఒక అర్థణా మీదగ్గర ఉంచుకోదామనుకుంది - దాన్ని వెనకేసుకొస్తారని కూడా అనుకొని ఉంటుంది - చెప్పచ్చుకకొట్టినట్టు చేసేరు-

(మూర్తి బ్యాగ్‌లోనుండి ఒక పుస్తకం తీసి ముఖానికడ్డం చేసుకుంటాడు)

డ్రయివర్: (వచ్చి) బాబూ...కొంచెం లేటరూ...ఫ్యూయల్ పంపు అన్నీ యిప్పేసేం... ఒక రివిటెరిగిపోయింది- కొంచెం ఆలీసమవుద్ది-

గాంగిల్సు: My! My!!

జ॥ కం॥ ఛంపేవయ్యా - అనుకున్నంతా చేసేవ్ - సరే యేపాటాలేసం అవుతుంది?

డ్రయివర్: సెప్పలేంబాబూ...

పేపర్: గంటలో బౌతుందా?

డ్రయివర్: ఆరివి బెయ్యడానికే రెండు గంటలౌతాది బాబూ... మూడు నాలుగ్గంటలౌతాది - అంగడా! తియ్యి తియ్యి ఆరెంచి... ప్లయర్......తియ్యి తియ్యి. కాలర్ పిన్నులు తెచ్చేవా?

గో॥ ఛా॥ ఛంపేశు - ఈ ఎండలో ఇంక మనపాట్లు కుక్కలుకూడా పడవ్-

ఏజెంట్: తాగడానికి నీళ్లెక్కడున్నా దొరుకుతే బాగుణ్ణు-

గో॥ ఛా॥ నాకు ఇందాకట్నుంచి...... అబ్బబ్బ! ఏం చెమట ... ఏం ఉక్క!!

గాంగిల్సు: అంతా ఓలాగే ఉన్నాం లెండి- మరేం ఫరవాలేదు. But very thrilling!

(పకపక నవ్వుతాడు- జరీకండువా ఆయన, పేపర్ ఆయన, ఆనవ్వుకి అయిష్టత కనబరుస్తారు ముఖంలో-)

50 ఏళ్ల వ్యక్తి: చెట్టుకిందకి పోదాం - చల్లగా ఉంటుంది- (సగం లేచి, ఎవ్వరూ లేవకపోగా మళ్లా కూచుంటాడు)

(ఒక కారు అరుచుకుంటూ పోయినసడి)

పేపర్: (ఆత్రంగా) ఎవరిదా కారు- అర్రెర్రే... వెళ్ళిపోయిందే - ఆపేనున్నా కాదు - అందులో పోయిఉందుం-

జ॥ కం॥ అయినా ఎలా అనుకోగలం పనికారొకటి ఒచ్చి ఏడుస్తుందని - ఎంత పనయిపోయింది-

పేపర్॥ హుం! (పేపర్ లో మునిగిపోతాడు)

జ॥ కం: ఆ కారు ఎవరిది చెప్మా...

కండక్టర్: (దిగువనుండి) రివిన్యూమంత్రిగారి బాబూ.. అర్జెంటుగా వెళ్తున్నారు-

పేపర్ (పేపర్ టపుక్కున దించి) ఏమిటే - నరసయ్య వెళ్లేడా... నరసయ్య కారా?!!

కండక్టర్: ఔను బాబూ...

పేపర్: అతని కారు కాదే అది-అతని కారు కాదే——

కండక్టర్: ఎ డి కె టూ టూ నాట్ వన్ బాబూ...నాకు తెల్సు——

పేపర్: సరిగా చూడలేదు మరి...ఛీ ఛీ ఛీ ఛీ...(తొడమీద గట్టిగా చేతితో కొట్టుకుంటాడు) ఇంతకన్నా ఇది ఉంటుందా ఎక్కడన్నా

జ॥కం: ప్రోగ్రామ్‌కూడా పడేసిగా వేసి వట్టుందే-లేకపోతే మీకు తెలీయకుండానా?

పేపర్: ఎన్నో సంగతులు మాటాడాల్సి ఉండేది-ఎన్నో సంగతులు-(పేపర్ ముఖం ముందుకు తెచ్చుకుంటాడు) పెధవ బస్సులు పెధవ బస్సులు——

జ॥ కం: ఇంక ఈ ఎండకి...ఈ...ఈ...

50 ఏ. వ్యక్తి: చెట్టుకిందకి పోదాం... చల్లగా ఉంటుంది.

[సగం లేచి అందరివేపూ చూస్తాడు.]

(పోతాడు)

[రంగం 2]

(ఇటుకలతో కట్టిన పూరిళ్లు—ఆఇళ్లు ఇప్పుడు చాలా అధ్వాన్నపు స్థితిలో ఉన్నాయి. చుట్టూ విశాలమైన కాళీ జాగా-జరీకండువాఆయన, పేపర్ ఆయన ఎడమవేపు నుండి వస్తారు. ఆయన నడుస్తూనే పేపర్ చూస్తూఉంటాడు.)

జ కం: ఎంత డబ్బు దండగ్గా ఉంటుంది వీటికని-ఆ గాగిల్సువాడు చెప్పినదాంట్లోనూ సబబు లేకపోలేదు.

పేపర్: వాడిబొంద-వాడిమొహం-ఆ వెధవలు ఉండకుండా పోతారని కలగన్నారా? చేతనయింది చేస్తారు గోదావరీ డెల్టాల్లాటి చోట ప్రతీ అడ్డమైన వెధవకీ భూములూ, ఇళ్లూ ఇవ్వాలంటే, ఏం తేరగా పడుందా? ఏవిటి చెప్తారు...మాటలు.

జ కం: అదీ నిజమేలెండి. అయినా ఈ ముష్టివెధవలంతా వీటని తగలెట్టేసి ఒదిలేసేరు. వీటిలో ఏవన్నా కుటీరపరిశ్రమలు స్థాపించి నట్టయితే...

పేపర్:-కుటీరపరిశ్రమలు....నా...నా... ఇదీనూ...

జ కం: పాడుముండాచోట...ఎక్కడా నీటిచుక్క లేదుకదా...ఇందాకటి నుండీ.. (ఇద్దరూ కుడివేపుపోతారు. వాళ్లు పోయాక ఏజెంటు వస్తాడు, వెనకకీ, చుట్టపట్లా చూస్తూ-ఆగుతాడు. ఆగి ఎదురుగా ఇంటివేపు చూస్తాడు-అలానే కొంతసేపు ఉంటాడు-చెమట తుడుచుకుంటాడు-కొంతసేపయాక నిట్టూర్చి కుడివేపు పోతాడు, బరువుగా అడుగులు వేసుకొంటూ-

కొంతసేపు అంతా నిర్జనంగా, నిశ్శబ్దంగా ఉంటుంది-ఎదురుగా ఉన్న ఇంట్లోనుండి ఇందాక బస్సుదగ్గరి కొచ్చిన 16-17ఏళ్ళ అమ్మాయి వస్తుంది-ఇంటి ముందాగి కుడివేపు వింతగా చూస్తుంది-అలాకొంత సేపు చూసి, తలుపు దగరగా లాగి, ఎడమవేపు నడుస్తుంది, లేడిలా ఇటూఅటూ చూస్తూ-

ఎడమవైపు నుండి మూర్తివస్తాడు-ఆమె అతనిని చూసి హఠాత్తుగా ఆగిపోతుంది-మూర్తికూడా ఆగిపోతాడు-ఆగి ఆమెవేపు చూస్తాడు-

ఆమె నాలుగడుగులు వెనుకకి వేసి, అతనిని మరోసారి బెదురుగా చూసి గిరుక్కున తిరిగి ఇంటివేపు నడుస్తుంది)

మూర్తి: (ముందుకు నడుస్తూ) ఏయ్... అమ్మాయ్...

(ఆమె ఆగిపోతుంది - తిరిగి అతనివేపు బెదురుగా చూసి, తలదించుకుంటుంది - మూర్తి ఆమెవేపు వస్తాడు-

ఆమె వెనుకకు అడుగులు వేసుంది, కనుల వందు నుండి, ఇటూఅటూ బెదురుగా చూస్తూ)

ఏయ్ ... అమ్మాయ్ ... నిన్నే ... ఇక్కడ నీళ్ళెక్కడన్నా దొరుకుతాయా?

(మరి కొస్త ముందుకు వస్తాడు. ఆమె వెనుకకి వెడుతుంది. బెదురుగాచూసి ముఖం దించుకుని)

మూర్తి (చిరాకుగా) నిన్నే...ఇక్కడ తాగేందుకు నీరుదొరుకుతుందా, అనిఅడుగుతున్నాను...

(ఆమె మాటాడక అతని ముఖాన్ని చూస్తుంది.)

నిన్నే....

(ఆమె తల అడ్డంగా ఊపుతుంది)

ఓహో!

(కారే చెమట తుడుచుకుని రుమాలుతో విసురుకుంటాడుమూర్తి. ఆమె అతనిముఖాని కేసి చూస్తూ, కళ్లు తిప్పుకుంటూ ఉంటుంది, అతనిలో ఏదో ఆకర్షణ ఉన్నట్టు.

మూర్తి పోబోతూ నాలుగు వేపులా చూస్తాడు. మళ్ళా ఆగుతాడు.)

మూర్తి: నువ్విందాక బస్సుదగ్గరకొచ్చిన పిల్లవేనా?

(ఆమె ఔనన్నట్టు తల ఊపుతుంది. మూర్తి ఆమెముఖాన్ని పరీక్షగా చూస్తాడు.

అక్కడ నువ్వన్న మాటలు నిజమే?

(ఔనన్నట్టు మరోసారి తల ఊపుతుందామె)

మీ అయ్య సెంగుకు వెంట పెట్టుక రాలేగు?

(బెదురుగా చూసి తలదించుకుంటుంది)

అబద్ధంకదూ?

అమ్మాయి: (కాదన్నట్టు తల ఊపి) లేద లేదు-తిండి లేదు...

మూర్తి: (అదోలా చూస్తూ) నువ్వంకీ కూడానా?

(ఆ మాటలన్నాక మూర్తి ముఖం సిగ్గుతో ఎర్రనౌతుంది—

ఆమె అర్థమవనట్టు చూస్తుంది—

తప్పుచేసినవాడిలా మూర్తి ఆమె వేపు చూడక, ఇటూ అటూ చూస్తూ తడబడే గొంతుతో)

నీ...రు...దొరకదా...ఎక్కడా?

అమ్మాయి: (తల అడ్డంగా ఊపి) గాడీ బాబులు సాయంత్రం సిన్న కుండతో యిస్తారు...ఆ నీరే తాగి ఉన్నాడయ్య... అవీ సాలవ్...

(మూర్తి మరోసారి అన్ని వేపులా చూస్తాడు)

మూర్తి: కూలీనాలీ ఎందుకు చేసుకోవు ఆ ఊరు పోయి? నాలుగు డబ్బు లొస్తాయే?

అమ్మాయి: (జవాబివ్వక అతని ముఖాన్ని చూసి తల తిప్పుకుంటుంది)

మూర్తి: కష్టపడవ్ - తిండి కొచ్చెయ్యాలి...

అమ్మాయి: (బాధపడుతున్నటు చూసి) కొసిని రోజులు సేత్తాను-ఆబాబుల్ని సూత్తే భయమౌతాది-మళ్ళా మరోకాడ కొసిని రోజులు సేత్తే మళ్ళా ఆ బాబుల్ని సూత్తే బయమౌతాది.

మూర్తి: ఏం? ఎందుకూ భయం-చంపేస్తారనా? మింగేస్తారనా?

(ఆమె ఈసారి ఆశ్చర్యపోయి అతనికేసి చూసి తలదించుకుంటుంది. ఆమె ముఖం కందగడ్డ అవుతుంది—

మూర్తి పొరపాటుచేసినవాడిలా, ఇదివరలానే తలతిప్పుకుని నాలుగు వేపులా చూస్తాడు—కొంతసేపు మౌనంగా నిల్చుంటారు—)

ఇస్.. (రుమాలుతీసి విసురుకుంటాడు)

అమ్మాయి: బాబూ......

మూర్తి: ఏం ముష్టికావాలా?

(బాధ ఆమె ముఖంలో కనిపిస్తుంది-

అతను అదిగాంసి ఇదివరకులానే సిగ్గుపడి ముఖం తిప్పుకుంటాడు—

మళ్లా మౌనం)

మూర్తి. (సౌమ్యంగా) ఏం......ఏం కావాలి?

(ఆమె ముఖం వికసిస్తుంది-నేలనిచూస్తూ, కొస్త సమయం గడిచాక)

అమ్మాయి: నీళ్లు నీళ్లు......(ఆగిపోతుంది.)

మూర్తి: (ఆత్రంగా) ఉన్నాయా?

అమ్మాయి: (ఉన్నాయన్నట్టు తల ఊపుతుంది.)

మూర్తి: ఎక్కడ?

(ఆమె ముఖం బాగా వికసిస్తుంది. ఆమె ఆగకుండా గబగబా ఇంట్లోకి వెడుతుంది. మూర్తి అటువేపు కొద్దిగా ఆశ్చర్యపోతూ చూస్తాడు. తరువాత నాలుగు వేపులా చూస్తాడు. ఆమె చిన్న పాతకుండతో బైటి కొస్తుంది. ఆ కుండని చూసి మూర్తి ముఖం ముడుచుంటాడు. ఆమె సంతోషంగా వస్తుంది మూర్తి దగ్గరకు)

ఇవా?......

అమ్మాయి: (ముఖం వాడిపోతుంది. వెలవెలబోతూ చూస్తూ) మంచినీళ్ళు బాబూ

మూర్తి: మాటాడక నిల్చొని చిరాగా ఇటూఅటూ చూస్తాడు. ఆమె చిన్నబోయి నిల్చుంటుంది. అదిచూసి) అదికాదదికాదు. మీ అయ్యకో మరి? అందుకు...తిండికూడా లేదా?

అమ్మాయి: (బాధపడుతూ) మా అయ్య కున్నాయి బాబూ......

మూర్తి: (అయిష్టంగా) చూడు. నీకు కూడా కావాలా మరి?

అమ్మాయి: (ప్రాధేయ పూర్వకంగా) నా కక్కరలేదు బాబూ...మంచి నీళ్లు బాబూ...

★ పెద్దమనిషి ★

మూర్తి: (నాలుగు వేపులా చూసి) మీ నీళ్ళని తాగడం లేదనుకోకేం...

(ఆమె ఆశ్చర్య పోతుంది.) అహ అది కాదది కాదు.

నువ్వింకోలా అనుకోకు-(కొంచం ఆలోచించి) చూడూ..నువ్వుమాత్రం తిన్నావా? చెప్పు? (నాలుగువేపులా చూసి) నాదాహం తగ్గిపోయింది — (గొంతులో Sincerity ధ్వనించదు.)

అమ్మాయి: (చిన్నబోయి నిల్చుంటుంది)

మూర్తి: నిజం! నామాట నమ్మ... (నాలుగువేపులా చూసి) ఆ కుండ ఉంచేసిరా...వేగం...(ఆమె కదలదు) వెళ్ళు...ఉంచేసిరా... (ఆమె అలానే ఉంటుంది-అతడు బెదురుగా అటూ ఇటూ చూసి, దగ్గరకి వెళ్ళి బుజ్జగిస్తున్నట్టు ఆమె భుజం తట్టి) ఉంచేసిరా...నామాట వినవ్...చూడు...నీకు ఉండాలా?

(ఆమె తిరిగి బరువుగా అడుగులు వేసుకుంటూ వెడుతుంది—

బరువు తగ్గినట్టు నిట్టూర్చి, విసుక్కుంటూ మూర్తి నాలుగువేపులా చూస్తాడు-కొన్ని నిముషాలు గడుస్తాయి-ఆమె ఎంతకీ రాదు-చిరాకుగా ముఖంపెట్టి మాటిమాటికీ నాలుగు వేపులు చూస్తూ ఉంటాడు మూర్తి..ఆఖరుకామె వస్తుంది-వచ్చి ఇంటిముందే నిల్చుంటుంది.)

మూర్తి: హమ్మయ్య!!

(ఆమె దగ్గరగావెళ్ళి పర్సుతీసి ఐదు రూపాయల నోటుతీసి పర్సు ఉంచేస్తాడు. నాలుగు వేపులా మరోసారిచూసి)

కష్టంగా ఉన్నాయి. ఎందుకు? మీ అయ్యకురించేనా?...వెర్రిపిల్ల — ఇంద...ఇది ఉంచుకో ... మీ అయ్యకి తిండి కొని పెట్టు—

(ఆమె ఆశ్చర్యపోతుంది)

ఇంద—ఉంచు...మీ అయ్యకి....

(ఆమె పుచ్చుకోదు — అతని కళ్ళలోకి బాధగాచూసి, తల దించుకుంటుంది)

వేగం తీసుకో ... (నాలుగు వేపులా చూస్తాడు ఆత్రంగా) నాకు వేళైపోతోంది.

(ఏదో అర్థంకానట్టు ఆమె అతని ముఖానికేసి చూస్తూ ఉంటుంది — గాగిల్సాయన ఎడమవైపునుండి వస్తాడు)

గాగిల్సు: హల్లో మిష్టర్ మూర్తీ!! మీ రిక్కడా?

(మూర్తి ఉలికిపడి గబుక్కున నోటు జేబులో ఉంచేసుకుంటాడు—గాభరాగా వెనుకకుతిగ్గి గాగిల్సాయనని చూస్తాడు)

ఏంచేస్తున్నా రిక్కడ?

మూర్తి: (కొద్దిగాతడబడి, చిరునవ్వుతో) ఏముందీ... నీ రిక్కడ న్నా దొరుకుతుందేమోనని కనుక్కుంటున్నాను.

(ఎవరో గట్టిగా కొట్టినట్టు అవుతుందామె)

గాగిల్సు: నీళ్ళా? లాభం లేదు..... వీళ్ళ నడిగి లాభం లేదు మూర్తీజీ-ఉత్తనోరు దండగ-వీళ్ళదగ్గర లేదనుకోకండి-ఉంటుంది కాని అబ్బే...ఈరకం......

(ఆమెను పరీక్షగా చూచి)

why! ఇది ఇందాక మనబస్సు దగ్గరి కొచ్చింది. My! ఇది డేంజర్ జోన్. (Danger Zone) మూర్తి గారూ!

మూర్తి: ఇప్పుడే ఇంకా ఇలా వచ్చి అడుగుతున్నాను. మీరూ వచ్చేరు.

గాగిల్సు: నయం-నేనొచ్చేను-మీలాంటి తగు మనుషులు నడిచేందుకు జాగా కాదిది బాబూ...ఎన్ని మాయలు...ఎన్ని నాటకాలు!

(మూర్తి భుజంమీద చెయ్యివేసి)

మీలాంటి అమాయకుల్ని నిమిషంలో వలలోకి లాగేస్తారు —

(ఆమె వేపు చూచి)

కుక్కలు......

(మూర్తిని లాక్కుపోతాడు. మూర్తి తిరిగి చూడకుండా పోతాడు— ఆమె అలానే ఉంటుంది.)

*　　*　　*

[రంగం.3]

(సూర్యాస్తమయ సమయం-బస్సులో భాగం; చాలా మంది బస్సులో ఉన్నారు.)

పేపర్ ॥ (పేపర్ చూస్తున్నాడు)

జ॥ క॥ (పేపర్లోనికి చూస్తున్నాడు)

ఏజెంట్ ॥ (సీటుకి చేరబడి కళ్ళు మూసుకున్నాడు)

గాగిల్సు॥ (లేడు)

ముష్టివాళ్లు : (గోల చేస్తున్నారు)

మూర్తి: (మాటిమాటికీ ముష్టి వాళ్ళ మూకలోనికి చూస్తున్నాడు)

డ్రయివర్ : (కూర్చొని, తలుపు గబీలున వేసి) అంగదా! యాండియల్ కొట్టు యాండిల్ కొట్టు...

మూర్తి: (ముష్టి వాళ్ళ మూకలోనికి ఆత్రంగా చూస్తూ ఉంటాడు)

క్లీనర్ : (హాండిల్ కొడేడు)

(ఇంజను : స్టార్టు అయింది)

డ్రయివర్ : అడ్డుకట్టతీసి...అగందా! యేగం...యేగం. బాబు లెవ్వరూ బోజనం సెయ్యలేదు....

(ఇందొకటి 16-17 ఏళ్ళ అమ్మాయి ముఖం మూర్తి ఉన్న వేపు కొద్ది దూరాన కానవస్తుంది బయటికి -- ఆమె మూర్తికేసి చూస్తోంది, ఏదో అర్థం కానట్టు-]

మూర్తి : (ఆమెను చూస్తాడు - బస్సులో భాగంలోని కొకసారి చూసి, అందరినీ గమనించి, జేబులోనుండి ఇదివరకటి నోటు తీస్తాడు - నోటు కానరాకుండా పిడికిట పట్టి, చెయ్యి కిటికీమీద ఆన్చి, ఆమెను రమ్మన్నట్టు తలఊపి, చెయ్యిచూపిస్తాడు).

అమ్మాయి : (అతడు చూడగానే ముఖం తిప్పేసుకుంటుంది).

డ్రయివర్ : (హారన్ వేస్తాడు).

గాగిల్సు : (గాభరాగా ఎక్కి, సీట్లో కూర్చొని) హమ్మయ్య!!

ముష్టివాళ్లు : (గోల ఎక్కువచేస్తారు).

డ్రయివర్ : (శబ్దమయేటట్టు గేరు లాగులాడు).

మూర్తి : (చెయ్యి లోనికితీసుకుంటాడు నోటు కనిపిస్తుంది).

గాగిల్సు : What Mr. Murthy!! అయిదు రూపాయలా? ఈ ముష్టివాళ్ళకనే!!! I am very very......

మూర్తి : (పర్సుతీసి నోటుఉంచి. చిరునవ్వుతో) పొరపడ్డారు - జేబులో లూజ్ గా ఉండిపోయింది. పర్సులో ఉంచెద్దామని......

గాగిల్సు : Then I am extreamly sorry! (పెద్దనోరుతో) బ్రేవో! ఆముండ మళ్ళీ తయారు!...వాట్ మూర్తీజీ మిమ్మల్ని ఇవాళ ఒకపట్టాన వదిలేటట్టు లేదె చూడండి మీ వేపే ఎలా చూస్తోందో!!

మూర్తి : (చూడడు - "ఆః...... పో నిద్దురూ" అన్నట్టు పెదవులు విరచి, నిర్లక్ష్యంగా చేతులు విసురుతాడు.)

ముష్టివాళు : దర్మదాతలు...దర్మపెబువులు...కానీ యియ్యండి బాబయ్యా!...

గొట్టె పాయిసా దియొ బాప్పా!

ఏక్ పయిసా దేవ్ బాబా!

క్లీనర్ : రైట్! రైట్!

బస్సు : (కదలగా)

(తెర)

అయిపోయింది.

పసుపు, కుంకుమ

పురాణం సూర్యప్రకాశరావు

కామాక్షమ్మ వంటగదిలోంచి ఇవతలికి వస్తూ విన్న పొలికేకలో స్తంభించిపోయి, ఏవీ తోచక క్షణం అలా నిలబడిపోయింది. ఇవాళ ఎందుకో మరీ నీరసము నిస్సత్తువా అనిపించి, గుండెలు ఉండి ఉండి గుబులు గుబులు మంటున్నాయి. ఈ కేక విని గబగబా వీథిలోకి పరుగెత్తింది. అప్పటికే పక్కింటి గుమ్మంముందు గుంపుగా జనం పోగుబడి ఉన్నారు. ఆమె గుండెలు వేగంగా కొట్టుకున్నాయి వెన్నులోంచి వణుకు పుట్టుకొచ్చినట్టయింది. "కొంప తీసి..." అన్న అర్థాంతరపుమాట మటుకు ఆమె నోటినుంచి వెలువడింది. ఆ కంగారులో మనసు వికలమైపోయింది. వీథి గుమ్మం తలుపు వేసి, చరచరా పెరట్లోకివెళ్ళి గోడమీదనుంచి పక్కవాళ్ళింట్లోకి చూసింది. తను అనుకున్నంతపనీ అయింది!

కామాక్షమ్మ రెండు కళ్ళూ చెమ్మగిల్లాయి.

"వరలక్ష్మమ్మకి పసుపు, కుంకుమ...ఈనాటితో సరి!"

ఈ మధ్య పదిహేనురోజుల్నించి వరలక్ష్మమ్మ భర్తకి అనారోగ్యంగానే ఉంది. పట్నంలో పేరున్న డాక్టరుగారే వైద్యం చేస్తున్నారు. ఎవరూ ఇంతలో ముంచుకు వస్తుందని అనుకోలేదు. అనుకోకుండానే ఇంత ఘోరం జరిగిపోయింది.

కామాక్షమ్మ చొరవగా లోపలికి ప్రవేశించి, స్పృహ తెచ్చుకుని తలబాదుకుంటూ రోదిస్తున్న వరలక్ష్మమ్మని గట్టిగా పట్టుకుని, "ఊరుకో తల్లీ...ఏం చేస్తాం...ఎంత ఏడ్చినా జరిగిపోయింది కలిసిరాదుగా," అంటూ అనునయవాక్యాలతో దుఃఖోపశమనం కల్గించాలని ప్రయత్నించింది. అంతవరకూ రెండుచేతుల్తో ముఖం కప్పుకున్న వరలక్ష్మమ్మ చేతులు ముఖంనించి తప్పించగానే, ఆమె ముఖంమీద చెదిరిన దమ్మిడీకాసంత కుంకుమబొట్టూ చూసేసరికి కామాక్షమ్మకి కన్నీరు ఆగలేదు. చివరికి ఓదార్చటానికి వచ్చిన తను కూడా మనసు చెదిరి కళ్ళనీళ్ళు క్రుక్కుకుంటూ చతికిలబడిపోయింది.

పోయినవ్యక్తి గుణగణాల గురించి మంచిగానే పదిమంది పదివిధాల చెప్పుకున్నారు.

ఆ తర్వాత కొద్దిసేపట్లోనే, ఊళ్ళోనే ఉన్న దగ్గర బంధువులు వచ్చారు. నేలని అలుముకుపోయి, గుండెలు బాదుకుంటూ రోదించే వరలక్ష్మమ్మని వాళ్ళు కూడా ఓదార్చలేకపోయారు. కొద్ది చనువుగా రెక్కలు పట్టుకుని వెనక్కిలాగి, అనునయించే దూరపుచుట్టాన్ని ఆమె విదిలించుకుని భర్తశవం మీద విరుచుకుపడిపోయింది. ఈ దుఃఖతీవ్రతతో ముఖంమీద నరాలన్నీ వాచి, ఉబ్బిపోయాయి. గొంతు బొంగురుపోయింది. చెంపలు చారికలు కట్టాయి. దుఃఖమయమైన ఆ ముఖాన్ని, హృదయవిదారకమైన ఆమె అవస్థనీ చూడలేక కామాక్షమ్మ ఇంటికి వచ్చేసింది.

బావి దగ్గర తలారా స్నానంచేసి, ఆమైలబట్టలు వదిలి మూల పడేసి దేవుడుమందిరంలో దీపంతోబాటు ఇంట్లో దీపాలన్నీ వెలిగించి, రామనామస్మరణ చేసుకుంటూ వీధిగదిలో కొచ్చి గుమ్మంవార కూర్చుంది కామాక్షమ్మ.

పక్కింటిలోనుంచి, ఉండుండి ఆమె గొంతు వినిపిస్తూనే ఉంది. కామాక్షమ్మ ఆలోచనలో పడింది. "ఆడదానిజీవితం తామరాకుమీద నీటిబొట్టులాగ అంతలో ఉంటుంది కాబోలు. నిన్నటివరకూ మహాలక్ష్మిలాగా కలకలలాడుతూ కాళ్ళకి పసుపు రాసుకుని, నుదుట ఇంత కుంకుమబొట్టుతో పేరంటానికి వచ్చిన వరలక్ష్మమ్మ ఇవాళ ఇలా అయిపోయింది. ఒంటరిజీవి అయిపోయింది. పాతికేళ్ళ సాహచర్యం ఇవాళ్టితో తెగిపోయింది. ఇంతటితో ఆగిపోయినా బాగుండిపోను. ఈ చనిపోయిన మనిషితో తన సంబంధం తను చనిపోయేవరకూ వదలదు. తన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు తగ్గించేసుకోవాలి, వికారరూపం తెచ్చిపెట్టుకోవాలి, భోజనం కూడా ఒక్కపూటే చెయ్యాలి. చొరవగా ఎక్కడికిపడితే అక్కడికి పోకూడదు చప్పున ఎవరికి ఎదురుపడినా, వాళ్ళు తప్పకుండా మనసులోనైనా విసుక్కుంటారు. కారణం లేకుండానే, ఏవీ అపరాధం చెయ్యకుండానే సమాజంలో తన గౌరవాన్ని పోగొట్టుకునే జీవచ్ఛవాలు స్త్రీలు. కొన్ని క్షణాల్లో వాళ్ళు ప్రపంచానికి దూరం అయిపోతారు. ఏనాడో అర్థాంతరంగా తన జీవితంలో ప్రవేశించి అర్ధాంతరంగా తప్పుకునే వ్యక్తికోసం జీవితపర్యంతం అనేక త్యాగాలు ఆమె చేస్తూఉండాలి. ఒక్క ప్రాణంతప్ప సర్వం ఆమె వదులుకోవాలి. ఒకప్పుడు ఆమె ఆ ప్రాణాన్ని కూడా వదులుకోవలసి ఉండేది నిండుప్రాణాన్ని భర్తశవంతోపాటు చితిలో వేసి కాల్చేసేవాళ్ళు. అలాంటి ఆచారాన్ని కూడా సమర్థించేవాళ్ళు ఆనాడు లేకపోలేదు." కామాక్షమ్మ అంతటితో ఆలోచన ఆపేసింది. ఇంతటితో ఈ విషయం మర్చిపోవాలనే అనుకుంది. గట్టిగానే రామనామస్మరణ మొదలుపెట్టింది. కొద్దిసేపు దేవుడిముందు వెళ్ళి కూచుంది. గదిలో అటూ ఇటూ ఎందుకో తెలియకుండానే తిరిగింది. కాని మనసు మటుకు అధ్యాసనించి మళ్ళటం లేదు.

పూడుకుపోయిన గొంతు చించుకుని విలపిస్తోంది వరలక్ష్మమ్మ

కామాక్షమ్మకి ఆ గొంతు విన్నప్పుడల్లా, మనసు దిగజారిపోతోంది. భాగవతం ముందు వేసుకుని పేజీలు తిప్పింది. కాని ధ్యాస దానిమీదికి పోవటంలేదు. ఆమె చేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థమైపోయాయి.

బయట బాగా చీకటి అయిపోయింది.

"బయటికి పోయినవాళు తొందరగా ఇంటికి పోదాం అనే ధ్యాస ఉండదు కాబోలు," అని భర్తమీద విసుక్కుంది.

మంచం వాల్చుకుని నడుంవాల్చినా కామాక్షమ్మ మెదడు ఆలోచించటం మానలేదు. ఆడది చచ్చిపోతే, టింగురంగా అని నాలుగోనాటికల్లా మరొకత్తెని తెచ్చుకుంటాడు మొగవాడు. చనిపోయిన వ్యక్తికోసం అతను చెయ్యగలిగే త్యాగం అది! ఇటువంటి వాళ్ళని అనేకమందిని తను చూసింది, తన బంధువుల్లోనే ఇలాంటివాళ్ళున్నారు. తన మరిదిభార్య ఈమధ్యనే చనిపోయింది. బ్రతికి ఉన్నన్నాళ్ళూ నానా అవస్థలూ పడింది భర్త తిడితే పడింది; కొడితే పడింది. ఎవరినీ పల్లెత్తుమాట అని ఎరగదు. చనిపోయిన పదిహేను రోజులకి మరో ఆడదాని మెళ్లో పుస్తెకట్టాడు, ఆ

★ పసుపు: కుంకుమ ★

మొగాడు! ఆడదాని స్థానం, విలువ, అంతలో ఉన్నాయి!! అయినా పెద్దవాళ్లు ఇలాంటి నియమాలూ, నిర్బంధాలూ ఎందుకు పెట్టినట్టు? -కామాక్షమ్మ ఆలోచనలకీ, అభిప్రాయాలకీ స్థిరత్వం లేదు. ఇటువంటి విశితమైన అనుభవాలు తటసించినప్పుడు స్త్రీని గురించి కొంత విప్లవాత్మకంగానే ఆలోచనలు తడుతూంటాయి. కాని ఆ తర్వాత ఆమె ఎప్పటిమాదిరి అభిప్రాయాలకే వస్తూంటుంది.

తోటికోడలు పోయినప్పుడు ఆమె విచారించక పోలేదు. కాని ఆమెని కాలనే 'అదృష్టవంతురాలు. పసుపు, కుంకుమతో వెళ్ళిపోయింది' అనే భావం కలిగింది. ఎవరికీ పట్టని అదృష్టం ఆమెకే పట్టినట్టుగా అనిపించింది. భర్త జీవించి ఉండగా ఇలా జరగటం సవ్యం; అందుకు విరుద్ధంగా జరిగితే అపసవ్యం అనిపించింది.

రాత్రి పదయింది. అంతవరకూ కామాక్షమ్మ ఓ చిన్న కునుకు తీసింది. పక్కింట్లోంచి ఏడుపు ఉన్నట్టుండి హెచ్చటంతో నిద్ర చెదిరిపోయింది. గడియారం కేసి చూసింది. ఇంతవరకూ ఈ ఇంట్లో ఒక్కతే ఉన్నదనే భావం స్ఫురించగానే, గుండెలు గుభిల్లుమన్నాయి. "ఈ ముసలాయన వేళకి ఇంటికి చేరకూడదూ! ఈ వయసులో ఇంకా పేట్లాట పిచ్చి ఏమిటి? ఆరోగ్యం చూసుకో వద్దూ? ఒచ్చే వయసా పోయే వయసా?" అని విసుక్కుంది. లేచి తలుపుతీసి వీథిలోకి చూసింది. పక్కింటి అరుగుమీద అయిదారుగురు కూచుని మాట్లాడుకుంటున్నారు. వీథి మొగలో కుక్కలు ఏడవటం మొదలెట్టాయి. కుక్కలు ఏడుస్తుంటే, కామాక్షమ్మకి గుండెల్లో నమిలి మింగే భయం. "అబ్బ! ఎవరైనా వాటిని అదిలించకూడదూ?" అనుకుంది. తలుపు వేసి వెనక్కి తిరగటానికి ఆమెకి ధైర్యం చాలేదు. పక్కింటి అరుగుమీద కూచున్న వాళ్ళ మాటలు వింటూ, అలాగే నిలబడి భర్తకోసం ఎదురుచూడసాగింది.

ఆయన వచ్చేసరికి రాత్రి పదకొండు దాటిపోయింది. రాగానే ఎన్నో అనాలనుకున్న కామాక్షమ్మ నోరైనా మెదపలేకపోయింది. ఆయన వస్తూనే, "ఎంతఘోరం జరిగింది!" అన్నారు.

"అవును. ఎవరూ ఇలా జరుగుతుందని అనుకోలేదు. నిన్నకూడా ఆవిడ్ని "ఎలా గున్నారండీ మీవారు" అంటే, తగ్గింది అనే చెప్పింది. నిమిషాలమీద ముంచుకొచ్చేసింది. లక్ష్మీదేవిలా ఉండేది పాపం," అంది కామాక్షమ్మ.

"వీథి మొగలో ఎవరో కనిపించి చెబితే నమ్మలేదు. నిన్నకూడా వీధి అరుగుమీద కూచుని పలకరించాడే. ఎలాగుందంటే బాగానే ఉందన్నాడు. చూట్టానికి బాగానే ఉన్నాడు." ఇలాగ కొద్దిసేపు ఆయన చాలా బాధపడ్డాడు. పోయిన వ్యక్తి గుణగణాల గురించి కాసేపు ఇద్దరూ చెప్పుకున్నారు. బ్రతికిఉన్న వరలక్ష్మమ్మని గురించి కామాక్షమ్మ బాధపడితే, చనిపోయిన వ్యక్తిని తల్చుకుని, ఆయన పదే పదే వాపోయాడు.

భోజనం దగ్గరమటుకు కామాక్షమ్మ భర్తని కొంత మందలించింది. "ఇదిగో చూడండి. ఇలా అర్ధరాత్రిదాకా తిండి, తిప్పలూ లేకుండా పేట్లాటలాడ్డం ఏమీ బాగుండలేదు. ఆరోగ్యం పాడవదూ? ఇప్పుడా అన్నంతినటం? మీపద్ధతి బొత్తిగా బాగుండలేదు," అంది.

"ఇంటిదగ్గర కూచుంటే తోచదే. అయినా ఇంట్లో కూచుని చేసేదేముంది చెప్పు. కాసేపు కులాసాగా ఆడుకుంటే అదో కాలక్షేపం."



"అంతే అన్నమాట. ఒక్కతినీ బిక్కు బిక్కుమంటూ ఉంటానని నే ఆలోచనలేదన్నమాట. ఇవ్వాళ ఎంత భయపడిపోయానో చెప్పలేను. పక్కనే ఇంత ఘోరం జరిగింది. పైగా వీధిలో కుక్కల ఏడుపు. ఇక చూసుకోండి ఎలాగుందో," అంది కామాక్షమ్మ మజ్జిగపోస్తూ.

ఆయన తలవంచుకునే నవ్వేశాడు "నా అంత ధైర్యస్థురాలు ఇంకెవరూ లేరంటావు," అంటూ ఎత్తిపొడిచాడు.

"బాగుంది. అటువంటప్పుడు ఎవరైనా భయపడతారు."

"నువ్వేమైనా చెప్పు. కబ్బురుటుకు చూడలేనే"

కామాక్షమ్మ తల మొత్తుకుంటూ. "చిన్నపిల్లలకంటే కనాకష్టం అయిపోతే, ఇక నే చెప్పేదేముంది? పోనీ నాకోసం కాకపోయినా, మీ ఆరోగ్యం కోసమైనా నామాట వినండి," అంది ఆమె.

"నా ఆరోగ్యం గురించి నీకు బెంగక్కర్లేదు. తొంభైఏళ్ళదాకా నాకు మారకంలేదని ఇద్దరు జ్యోతిష్యులు చెప్పారు.

అర్థాంతరంగా అడ్డుపడుతూ, "అబ్బ అలాంటిమాట లనకండి నే వినలేను," అంటూ కామాక్షమ్మ గోడకి జారబడిపోయింది.

అన్నం తింటున్నవాడల్లా, ఆయన హఠాత్తుగా, "అదేమిటి అలా పడిపోయావు! తల తిప్పుతోందా?" అంటూ లేచి, భార్యదగ్గరికి వెళ్ళి ఆమెను పట్టుకున్నాడు.

ఆమె క్షణం పోయింతర్వాత కళ్ళు తెరిచి గుండెలు రాసుకుంటూ "కాసిని మంచినీళ్ళు ఇవ్వండి.." అంది.

మంచినీళ్ళుతాగుతూ, "ఇవాళ నా మనసు బొత్తిగా పాడయిపోయింది," అంది.

ఆయన అనుకోకుండా, ఆ ప్రస్తావన తెచ్చినందుకు పశ్చాత్తాప పడ్డాడు. "నే ఊరికే మాటవరసకన్నా" అన్నారు.

"అలాంటి మాట వినలేనండీ. ఇవాళ అసలు వినలేను," అంది కామాక్షమ్మ

ఆమె చెయ్యి ముందుకు జాపి, "రేపట్నుంచి వేళకి ఇంటికి వస్తానని మాట ఇవ్వండి. ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చెయ్యనని మాట ఇవ్వండి," అంది.

ఆయన ఆమె ముఖంలోకి చూస్తే ఎక్కడో హృదయంలో ఊరి హృదయమంతా నింపి, కంటి కొలకుల్లో నించిన రెండు కన్నీటి బిందువులు దీపకాంతిలో తళుక్కుమన్నాయి. ఆమె కను రెప్పలు మూసింది. ఆ రెండు బిందువులూ రాలిపోయాయి.

ఆయన అయోమయంగానే తన చెయ్యితీసి ఆమె చేతిలో వేసి నవ్వుతూనే, "నువ్వెంత పిచ్చిదానివే ముసలమ్మా," అన్నాడు.

ముడతలుపడిన ఆమె పెద్దముఖం తేరుకుంది.

రాత్రి నిద్రపోయే ముందు, "ఈ మనుష్యులకి హృదయాలుండవు కాబోలు. ఒక చెంప భర్తని పోగొట్టుకుని తను ఏడుస్తుంటే ఆ చారాలంటూ మరింత కృంగతియ్యటానికి చూస్తారు. అలా ఆమె మానాన్ని ఆమెని ఒదిలెయ్యకూడదూ? భికారిని చేసి నలుగురూ అసహ్యించుకునేట్టు చేసేగాని, వాళ్ళ మనసుకి తృప్తిగా ఉండదు కాబోలు! అలా చేస్తేగాని దేముడు మెచ్చడా?" అంది.

"పెద్దవాళ్ళు అలా ఏర్పాటు చేశారు. ఈనాటి ఆచారమా ఇప్పుడు మారటానికి! అందులో ఏ రహస్యం ఉందో ఎవరికి తెలుసు," అన్నారాయన.

"ఏమిటి ఆచారమో! చూడలేం"

"ఇక పడుకుందూ," అంటూ ఆయన విసుక్కున్నారు

తెల తెలవారుతోందనగా కామాక్షమ్మ పెద్ద కేక పెట్టి లేచి కూర్చుంది. భర్త కంగారుగా లేచి, "ఏమిటే," అన్నారు.

"కలత నిద్ర అయిపోయింది. పీడ కల వచ్చింది," అంది కామాక్షమ్మ. పెద్ద ఇసుక మైదానం. మైదానమంతా పరుచుకున్న తలవెంట్రుకలు; వాటి మీద అక్కడక్కడ గుత్తులు గుత్తులుగా సలిపి విసిరేసినట్టుగా ఉన్న పూలు; అక్కడక్కడ కుప్పలు కుప్పలుగా, గుట్టలు గుట్టలుగా పసుపూ కుంకుమాను. ఉన్నట్టుండి, పెద్దగాలి రివ్వుమని వీచింది. పసుపూ, కుంకుమా పూలతో కలిసి రివ్వుమని తాడిఎత్తున, ఆకాశం మీదకు సుళ్ళుతిరుగుతూ లేచాయి. కోటి ఆడగొంతుల విషాద స్వరంలా ఆగాలి గీపెట్టింది. ఆ స్వరం రానురాను తన్నే సమీపిస్తున్నట్టనిపించింది. ఆమెకి మెలుకువ వచ్చి పెద్దకేక పెట్టింది.

"అంత బెంబేలుపడిపోతే ఎలాగు? ఇటువంటివి ఎన్ని చూడలేదు? ఇవాళ కొత్త కాదుగా. అలా మనసు పాడుచేసుకుంటే ఎలాగు" అంటూ ధైర్యం చెప్పారాయన.

"అవును. ఎన్నో చూశాను. కాని ఈ మారు తట్టుకోలేకుండా ఉన్నాను. మనసు మళ్ళటం కష్టంగా ఉంది," అంది కామాక్షమ్మ.

ఇంతలో వీధిలోంచి పాలవాడికేకలు వినిపించాయి. ఆ వెంటనే పక్కింటిలోంచి వరలక్ష్మమ్మ విషాదస్వరమూ వినిపించింది. "అయ్యో మా తల్లీ! నీ బతుకంతా చీకటయిపోయిందికదమ్మా! ఈ వెలుగు నీకు కాదు తల్లీ," అనుకుంది కామాక్షమ్మ. రాత్రంతా నిద్రలేదేమో కళ్ళు ఉబ్బిపోయి ముఖం ఉబ్బినట్టయింది. మత్తుగా ఉండి ఒళ్ళుతూలటం మొదలెట్టింది.

పనిమీద ఆయన వెళ్ళబోతుంటే, వీధి గుమ్మంవరకూ వచ్చి, "జాగ్రత్తగా నడవండి రోడ్డుమీద. మీకు అసలే పరాకుఎక్కువ. వంట పెందరాళే అయిపోతుంది. తొందరగా వచ్చేయండి," అని పదే పదే హెచ్చరించింది కామాక్షమ్మ.

ఆయన నవ్వుకున్నారంతే! ఆయన వీధి మలుపు తిరిగేవరకూ గుమ్మంలో నిలబడి చూస్తూనే ఉంది. ఆయన ఎదురుగుండా ఓ బండి వస్తోంది. కామాక్షమ్మకి ఆదుర్దా ఎక్కువైంది. "ఆ వెధవబండి అలా మీది మీదకి వచ్చేస్తోందే! ఈయన కాస్త పక్కకి తప్పుకోకూడదూ? అది కొంపతీసి..."

అనవసరంగా ఆమె కంగారుపడింది కాని, ఆ బండి దూరంనించే వెళ్ళిపోయింది. అయినా ఏదో పెద్ద ప్రమాదం తప్పిపోయినట్టే అనిపించింది. ఈ పాడుమనసు ఇవాళ కీడు శంకిస్తూనే ఉంది.

రాత్రివచ్చినకల ఒక చెంప ఆమెని కలవరపెట్టసాగింది. "ఈ కల మంచిదవునో కాదో దీటిగురించి తనకంతగా తెలీదు. ఎవరినన్నా కనుక్కోవాలి," అనుకుంది. ఈ కలలంటే ఆమెకి గాఢమయిన నమ్మకం ఉంది తోటికోడలు పోయినప్పుడు ఇలాగే పీడకల వచ్చింది. ఇంటిగోడ గుభేలుమని కూలిపోయినట్లుగా కలవచ్చింది. అంతే! మర్నాడు తోటికోడలు పోయినట్లు ఉత్తరం వచ్చింది. ఇలాంటి నిదర్శనాలు అనేకం ఉన్నాయి. మామగారు పోయే ముందు కూడా ఇలాంటి పాడుకలే వచ్చింది. నగ్నంగా ఒళ్ళంతా నూనె రాసుకుని పేగులు పీక్కుతింటూ, గంతులేసే ఆకారాలు కళ్లో కనుపించాయి! తెల్లవారగానే, మామగారు పోయినట్టు టెలిగ్రాం రానే వచ్చింది. ఇంకా ఇలాంటివి ఎన్నో. ఇప్పుడామె రాత్రికన్న కలని మునుపటివాటితో పోల్చుకుంటే, ఇదేమీ తక్కువది కాదనిపించింది. "అయినా ఎవరినైనా కనుక్కుంటే మంచిది," అనుకుంది పని పాటలు త్వరత్వరగా తెముల్చుకుని వీధి చివరన ఉన్న ముక్కోళ్ళ ముసలమ్మ ఇంటికివెళ్ళి ఆవిడ చెవిని తనుకన్న కల యావత్తూ పూసగుచ్చినటుగా చెప్పింది. అంతా విని ఆమె అంది! "ఏం ఫర్వాలేదు. పక్కనే అటువంటి సంఘటన చూశావుకదూ! మనసు చెదిరితే ఇలాంటి కలలే వస్తూంటాయి. అయినా ఎందుకన్నా మంచిది, ఓ ముత్తయిదువుని పిల్చి పసుపూ, కుంకం, ఓ రవికలగుడ్డా పెట్టుకో. ఆ దోషమేదైనా ఉంటే పోతుంది," అని ఆమె సలహా చెప్పింది.

(55 వ పేజీ చూడండి)

బుడుగు! చిచ్చులపిడుగు!

బొమ్మలసిరి కలిత్

ఈ బొమ్మ నేను.

నా పేరు బుడుగు. ఇంకో పేరు పిడుగు. మా బామ్మ హారి పిడుగా అంటుంది అందుకు.

ఇంకో అస్సలు పేరుంది. ఇప్పుడు చెప్పడానికి టైము లేదు. అది చాలా పొడుగు. కావలిస్తే మా నాన్నని అడుగు.

అగో మానాన్న మానాన్నకి నేను కొడుకు మా నాన్న నాకు గొడుగు ఇలా అని కొత్త ప్రవేటు మేస్టరు చెప్పాడు. వీడు మంచివాడు కాడు. అంటే చెడ్డవాడు. అసలు వీడే కాడు. ఈ ప్రవేటు మేస్టర్లు అందరూ అంతే. చిన్న పిల్లలకి చదువు చెప్పడం రాదు. పైగా సొంటి పిక్కలు తీస్తానంటారు.



అమ్మ

ఈడుకితగని లెక్కలు చెయ్యమంటారు

ఆ లెక్కలుచూసి బామ్మ కూడా అమ్మ బాబోయ్ అనేసింది. (బామ్మకి ఆఆలుకూడా బాగా రావుట) అంటేనేం మళ్ళా మేష్టరొస్తే రండి బాబూ అని చాపేస్తుంది.

అలుసు అంటే ఇదే. (ఈమాట బామ్మ చెప్పింది) ఈ మాష్టరు అలుసు తీసుకున్నాడు తీసుకుని నన్ను తిడుతున్నాడు. నేనేం చిన్నవాడినా. లేకపోతే చితక వాడినా (నాన్న సిగరెట్లు చాలా కాలిస్తే బామ్మ చిన్న వాడివా చితకవాడివా అంటుంది.)

ఇప్పుడప్పుడే ఏడోఏడు నాకు. ఏడాది నించీ ఈ మేష్టర్లు నాకోసం వస్తున్నారు, ఒకడి తరవాత ఒకడు వీడు పదోవాడు కాబోలు. అందరూ నన్ను డబాయించడమే. ముందర చాకలెట్లు తెస్తారు. ఒక్కడూ పకోడీలు తేడు. పైగా ఆ చాకలెట్లు ఇచ్చినందుకు లెక్కలు చేసిపెట్టమంటారు. వాడు పది ఇస్తే (ఊ తది ఒకటో రెండో తెస్తాడు). నేను రెండతింటే ఎన్ని ఉంటాయి అంటాడు నేను ఏదో చెబుతా. రెండు రోజులయ్యాకా, తిడతాడు నేను చిన్న వాడినా లేకపోతే చితకవాడినా. మేష్టరంతవాడు వాడు, నాఅంత వాడు నేను. ఆసంగతి చెబుతానా వాడు ఒకలా మొహం పెడతాడు ఉత్తినే నన్ను కొప్పడి ఆవక, నేను చూడకుండా పితూరి నాన్నకి చెప్పకుంటాడు

ఎందుకు చెప్పాలి! అందుకే నేను తరవాత కొప్పడతాను ఆమేష్టరు ఇంక రాడు తరవాతి ఇంకో కొత్త వాడు.




నాన్న

మళ్ళీ నాన్న నన్ను కోప్పడతాడు. రాడీరాస్కెల్ అంటాడు. మేష్టరు మాటలే అందరూ వింటారు. అమ్మ నన్ను పోకిరీవెధవా అంటుంది. ఒక్కోసారి వెధవకానా అంటుంది. బామ్మ ఆరిపిడుగా అంటుంది బామ్మ మంచిది

నా అంతవాడు లేడు. నన్ను ఎవరూ తిట్టకూడదు, కొట్టకూడదు కొడితే పాపం. అసలు నేను చిన్నవాడిని. నా నెత్తిమీద దేముడుంటాడు. నన్ను కొడితే వాణ్ణి కొట్టడం అన్నమాట.

నేను నిజంగా పెద్దవాణ్ణే అనుకో. అందుకని కొట్టొచ్చు అయితే, వాళ్ళే నన్ను కుర్రకుంక అంటారుగా. అందుక నే నన్ను కొట్టకూడదు. ఇదే నా అభిప్రాయం.



ఈ మాట బాబాయి నేర్పాడు. బాబాయిదగ్గిర ఇవి చాలా ఉన్నాయి.

నా చదువు సమస్యట. సమస్య అంటే కొత్త ప్రవేటు మేష్టర్ని తేవడం. ఎవడూ రానంటున్నాడుట. అసలు ఇప్పుడు చదువూ సంధ్యా వద్దు అంటాడు బాబాయి

ఇది బాబాయి అభిప్రాయం. బాబాయి సంధ్యవార్చడు నాన్న కూడా. బామ్మ రోజూ గంజి వార్చుతుంది.

బాబాయిమాట ఎవరూ వినరు విడిశావు ఫో అంటారు. వాళ్ళ కాలేజిలో ఓ అమ్మాయి ఉంది. ఫరవాలేదు బాగా నే ఉంటుందనుకో అది ఒక్కటే బాబాయి మాట వింటుంది యస్ అంటుంది యస్ అంటే ఇంగ్లీషు అన్నమాట నాకు ఇంగ్లీషు ఇంకా బాగారాదు అయినా ఆ మాటలకి అర్థాలు ఉన్నాయట. ఎందుకుండవు? తెలియాలి అంతే నాకు కోపంవస్తే జాటర్ డమాల్ అంటాను.

అది ఎవరికీ తెలియదు నేను అలా అంటే నాన్న జడ్డి వెధవా అంటాడు ఆ మాటకి అస్సలు అర్థం లేదంటాడు. ఎందుకు లేదు? ఉంటుంది. తెలియాలి అంతే జాటర్ డమాల్ అంటే అర్థంలేదూ అని అర్థం అన్నమాట

ఇది ఒక్క ప్రవేటు మేష్టరుకే తెలుసు. ఆ మేష్టరికి నేనేం చెప్పినా తెలుస్తుంది. తెలివిగలవాడన్నమాట. అందుకే నాదగ్గిర మానేశాడు.

ఇప్పుడు కొత్తవాడు. వీడు మహాయితే పదిరోజులుంటాడేమోలే చిన్నపిల్లల్ని (నేను కాదనుకో నేను పెద్దవాణ్ణి) ఎలా నేస్తంకట్టాలో, నేను సలహాఇస్తాను సలహా అంటే అభిప్రాయం. అంటే నాకు బాగా తెలీదు. బాబాయినడుగు.

నాదగ్గిర పది మేష్టర్లు పనిచేశారు వాళ్లు చేసిన తప్పులు నాకు కంఠతా వచ్చు. నా తలమీద, చెవిమీద ఇంకా ఆ మొట్టికాయలు ఉన్నాయి అందుకని నేను సలహాలు ఇస్తాను అప్పుడు పెంకె మేష్టర్లని ఎంచెయ్యాలో మంచి పిల్లలికి తెలుస్తుంది. పిల్లలికి ఎలా చదువు చెప్పాలో పెంకె మేష్టర్లకి తెలుస్తుంది.

(ఇంకావుంది)

★





కవితావతరణం

౧

తమసానదీ తరంగాలపై ప్రాతఃకాల సూర్యకిరణాలు పరవళ్లు దొక్కుతూ ప్రసరించాయి. తీరసైకతం వరకు ప్రవహించిమరలిపోయే చిరు తరంగాల మలుపులలో సన్నని ఇసక రేణువులు రత్నచూర్ణంలా తళతళా మెరిశాయి.

మహర్షి వాల్మీకి తమసానదిలో స్నానం చేసి, పరిశుభ్రవల్కలాలు ధరించి, జపతపాలు ముగించుకొని, తన ఆశ్రమానికి బయలుదేరాడు. శిష్యుడు భారద్వాజుడాయన మడుగు దోవతులు భుజంమీద వేసుకుని ఆ మహర్షి అడుగుజాడల్లో అడుగులు వేసుకుంటూ వెంటవెంటనే సవినయంగా నడిచి వెళ్లిపోయాడు.

మహర్షి అలాగ నడిచిపోతున్నాడన్నమాటే కాని ఆయన మనస్సంతా నారదమహర్షి చెప్పిన సూక్తుల మీదనే లగ్నమైపోయింది.

"ప్రస్తుతం ఈ లోకంలో మహనీయుడైన పురుషోత్తము డెవరు?"

అని వాల్మీకి నారదమహర్షి నొకమారు ప్రశ్నించాడు. నారదుడు శ్రీరామ కథ సంగ్రహంగా ఆయన కెరిగించి, అతడే లోకోత్తర పురుషుడని అభివర్ణించి చెప్పాడు. అప్పటినించీ వాల్మీకి హృదయం శ్రీరామ చరిత్రమీదనే లగ్నమై పోయింది.

ఇంతేకాక, ఆ మనోహర సూర్యోదయ వేళలో ఆనంద డోలికలలో ఓలలాడుతున్న పరిసరారణ్య పక్షుల కిలకిలా రావాలాయన హృదయంలో పసిపాపల జిలిబిలి పలుకుల్లా వినిపించాయి. లేళ్లు, జింకలు, నెమళ్లు మొదలయిన ఆశ్రమజీవాలా మహర్షి తమపక్కనే నడిచిపోతున్నా, అది గమనించనట్లే చెంగుచెంగున గంతులు వేసుకుంటూ అరణ్యంలో నిర్భయంగా యథేచ్ఛగా విహరిస్తున్నాయి. మరికొన్ని చిన్న చిన్న లేడిపిల్లలు మహర్షి చేత ధరించిన కమండలువు తమ తల్లి పొదుగనుకొని బాగా దగ్గిరికి చేరుకొన్నాయి

రామకథా స్మరణంలో లీనమైన వాల్మీకి హృదయం కొంతసేపటికా అరణ్య ప్రాతఃకాల సౌందర్యంలో తన్మయమై పోయింది.

లేత లేత సూర్యకిరణాలప్పుడప్పుడే మేలుకొన్న చిత్రవిచిత్ర వర్ణాల విహంగాలతో కలిసి దిగ్దిగంతాలవరకు పరుగులు పెడుతున్నాయి; పసరి పచ్చికలపై విశ్రమించిన మంచు బిందువులకు గిలిగింతలు పెట్టి నవ్విస్తున్నాయి

ఆకాశంలో ఎగురుతూ రంగురంగులతోరణాలలాగ వేలాడే పక్షుల బారుల సొగసులు పరిశీలించగానే మహర్షికి ప్రపంచమంతా ఒక మహానందలీలా డోలికగా భాసించింది

అందులోను ఒక క్రౌంచపక్షి మిథునం ఆనందోల్లాసాలవలోకిస్తుంటే ఆ మహాకవి హృదయం రెక్కలు కట్టుకొని ఆకాశానికె ఎగిరిపోయింది.

క్రౌంచపక్షులు రెండు చక్రాకారంగా గిరగిరా తిరిగాయి మళ్ళీ అవి రెండు ఒక చిన్న రెమ్మమీద వాలి అప్రయత్నంగా తూగుటుయ్యాలలూగాయి అంతలో మగపిట్ట ఒక పండేదో ముక్కుతో కరిచి పట్టుకొని వచ్చి ఎంతో ఆప్యాయంగా ఆడపిట్ట

ప్రాచీన గాథాలహరి

కందించింది. ఆడపిట్ట అది కొంచెం ఆరగించి తిరిగి మగపిట్టకందించింది.

అంతలో అవి రెండు జంటగా ఆకాశంలో ఎగురుతూ అత్యంత మనోహరంగా ధ్వనించాయి.

ఆ అమాయిక జీవుల అన్యోన్యత, అప్యాయత చూడగానే మహర్షి హృదయంలో ఆనందదుగ్ధం జాలై ప్రవహించింది. ఆ ద్రష్ట్వృషి పిట్టజంట ఎటుపోతే అటు వైపే తిరిగి ఆనందంతో ఊరకలు వేసింది. అతని నేత్రాలు రెండుపిట్టలై క్రౌంచ మిథునం వెనువెంట తిరిగాయి. ఆ ఆనందంలో మహర్షి తన గమ్యస్థానమే విస్మరించి యథేచ్ఛగా ముందుకు సాగిపోయాడు

అంతలో ఆ రెండుపిట్టలు ఒక్క గొంతుతో ఎంతో మనోహరంగా గానం చేశాయి. ఆ ధ్వని మాధుర్యం ఆ పరిసరారణ్యంలో అంతటా మంద్రమంద్రంగా మారుమోగింది. మహర్షి అలాగే అప్రయత్నంగా అడుగులు

పి. గణపతిశాస్త్రి

వేసుకుంటూ ఆశ్రమం వైపు నడిచిపోయాడు.

ప్రపంచంఅంతా నూతనోదయకాంతుల్లో అప్పుడప్పుడే మేలుకొని ఆ క్రౌంచపక్షుల ఆనందలీలలవైపే చూస్తూన్నట్లు కనబడింది. దుర్గమారణ్యమార్గంలో కూడా వాల్మీకి విశాలనేత్రాలు వాత్సల్యంతో తొణికిసలాడుతూ ఆ పక్షులతోబాటే ఆనందాకాశంలో విహరించాయి. చూస్తూండగానే క్రౌంచపక్షులు రెండు ఆకాశంలో చాలా దూరంవరకు ఎగిరిపోయాయి. మళ్ళీ రెండు రివ్వుమని జంటగా కిందికి దిగివచ్చాయి. కాని ఆ క్షణంలో ఆ జంట ఉత్సాహం మిన్ను ముట్టింది!

౨

అంతలోనే ఆకాశంలో కీచుమని ఒక మహాదారుణ కరుణాక్రందనం వినబడింది. మహర్షి హృదయం ఆ ఆక్రందన ధ్వని వినీ వినడంతో నిలువునా చీలిపోయింది. ఆ తత్క్షణంలో మగపిట్టరక్తసిక్తమై వాల్మీకి కనతిదూరంలోనే నేలపై కూలి గిలగిలాకొట్టుకుని ప్రాణం విడిచింది. ఆడపిట్ట ఆకాశంలో చక్రాకారంగా తిరుగుతూ అతి దీనంగా, జాలిగా ఆ మగపిట్టకోసం ఆక్రోశించింది.

అల్లంతదూరంలోనే బోయవాడొకడు విల్లెక్కు పెట్టి మగపిట్టమీద బాణం వేశాడు. ఆ బాణం కనురెప్పపాటులోనే మగపిట్ట ప్రాణాలు హరించివేసింది

ఆడపిట్ట దారుణకరుణాక్రందనం వినగానే వాల్మీకి హృదయం శోకావేశంతో ద్రవించి జాలైపోయింది. మహర్షికిక ఒక్క అడుగు ముందుకు పడలేదు. కంఠం గద్గదంతో వణికిపోయింది. ఆయన ముఖతః అప్రయత్నంగా ఒక ఛందోమయగీతం వెలువడింది.

'మానిషాద ప్రతిష్ఠాం త్వ
మగమః శాశ్వతీః సమాః
యత్ క్రౌంచమిథునాదేక
మవధీః కామమోహితమ్'

"నిషాదా! కామమోహితమైన క్రౌంచపక్షిని సంహరించివేశావే! నీవిక చిరకాలం జీవింపవుసుమా!"

అని ఆ గీతంతాత్పర్యం. వాల్మీకి తానన్నమాట తెలుసుకొని తానే ఆశ్చర్యపోయాడు.

★ కవితావతరణం ★

తన ముఖతః వెలువడినది సామాన్య గీర్వాణ వాక్యం కాదు!

అది ఛందోబద్ధమై నాలుగుపాదాల లయతోను, చరచరా సాగిపోయిన కరుణా శ్లోక వాఙ్మయావతారం! ఆ ఛందః స్వరూపం ఇంతకుపూర్వం వాల్మీకికొక్క వేదాలలో వినిపించింది. అది అపూర్వ కరుణాసౌందర్య సమ్మేళనం పొంది ఆ క్షణంలో అతని ముఖతః ఆవిర్భవించింది! మహర్షికా విషయంలో ప్రత్యేకంగా సంకల్పమేమీ కలగలేదు. కాని అది అంతరాంతరాలలో ప్రతి ధ్వనిస్తూ అప్రయత్నంగా ఆ కవిబ్రహ్మ ముఖంలో నృత్యం చేసింది!

మహర్షి ఆ గీతిక నాలుగైదుమారులలాగే మళ్ళీ మళ్ళీ ఉచ్చరిస్తూ ఆ క్రౌంచ మిథునంపై విరుచుకుపడిన దారుణాఘాతానికెంతైనా తల్లడిల్లిపోయాడు.

ఆ గీతికావతరణంతో భరద్వాజునికి కలిగిన ఆశ్చర్యానికిక అంతేలేదు. భరద్వాజుడు కూడా ఆ కరుణాశ్లోకగీతం పదేపదే పదిమారులుచ్చరించాడు. ఆ విధమైన ఛందోవతారం సాక్షాత్తుగా వేదవాఙ్మయంలోనించే లౌకిక వాఙ్మయంలోనికి అవతరించినదని అతడనుకొన్నాడు.

'మానిషాద' గీతి మళ్ళీ సభక్తికంగా పఠించి మహర్షికా విషయం నివేదించాడు. వాల్మీకి అతని అభిప్రాయం కొంతసేపంతర్ముఖుడై ఏదో ధ్యానించాడు.

"నాయనా! ఈ గీతి క్రౌంచ పక్షి మిథునంపై నా హృదయంలో బయలుదేరిన శోకం వల్లనే ఆవిధంగా ఆవిర్భవించింది. ఇందుచేత ఇది నేటినించీ శ్లోకమనే పేరుతో ప్రసిద్ధికెక్కగలదు!"

అని అంతలోనే ఏదో ఆలోచిస్తూ అంతర్ముఖుడైనాడు.

ఆదికవిహృదయ శోకం అంతమాత్రంతోనే ఉపశమించలేదు. భరద్వాజుడలాగే మహర్షి వెంట నడక సాగించాడు.

మహర్షి హృదయంలో క్రౌంచపక్షి మిథునాన్ని గురించిన దురంత చింతాస్రవంతి అలాగే ఎడతెగకుండా ప్రవహించింది. కాని ఆవిధంగా ఆ శ్లోకం అప్రయత్నంగా ఆవిర్భవించడం అతనికి మరింత ఆశ్చర్యంగా కనిపించింది. ఆశ్రమంలో అడుగు పెట్టే వరకు మహర్షి హృదయంలో ఆలోచనలలాగే సాగిపోయాయి.

ఆనాటి సాయంకాలం వేళవరకు వాల్మీకి ఆ విషయాన్ని గురించి అనేక విధాలుగా మథనపడ్డాడు.

తమసానదీతరంగాలు దూరదూరంగా మంద్రమంద్రంగా వినిపించాయి వాల్మీకి వ్యాఘ్రాజినంమీద కూర్చొని ఆ శ్లోకాన్ని గురించి నిశ్చలంగా ధ్యానించాడు. అతని పార్శ్వంలో సాయంకాల హోమాగ్ని జ్వాలలు మంద్రంగా వేదాలుచ్చరిస్తున్నట్టుగా ధ్వనిస్తూ బాగా ప్రజ్వలించాయి. ఆ జ్వాలల కాంతులు వాల్మీకి మహర్షి వ్యాఘ్రాజినంమీద వింతవెలుగులు విరజిమ్మాయి.

వాల్మీకి హృదయం క్రమంగా ధ్యాన తన్మయతలో విలీనమైపోయింది. ఆ తన్మయతలో మహర్షికి క్రమంగా బాహ్యజగత్తే అదృశ్యమైపోయింది.

3

కొంతసేపటికి వాల్మీకి లోపలి చూపుల కెదురుగా చతుర్ముఖుడు ప్రత్యక్షమైనాడు. కవిబ్రహ్మ బ్రహ్మదేవునికి సాగిలపడి సభక్తికంగా చేతులు జోడించి నిలుచున్నాడు. మేఘ గంభీరస్వరంతో కమలాసనుడా మహర్షి సందేహాలొకటొక్కటిగా తొలగించి వేశాడు:

"మహర్షీ! ఆ శ్లోకం నీ ముఖతః ఆ విధంగా ఆవిర్భవించడానికి కారణమేమని ఆశ్చర్యపడుతున్నావు కాబోలును!

వేదవాఙ్మయంఅనంతరం ప్రప్రథమంగా లౌకిక వాణిలో నీ వాక్కులోనే కవితావతరణం జరిగింది. నీకీనాటితో శబ్ద బ్రహ్మ సాక్షాత్కారం జరిగింది. నీ వాది మహాకవివైనావు!

"శోకం శ్లోకమై అవతరించిన ఆ శ్లోకచ్ఛందస్సులోనే శ్రీ రామగాథ రచించవలిసింది."

అని మహోల్లాసంతో చతుర్ముఖుడతని వైపుచూచి, అంతటితో తన ప్రసంగం ముగించి వేశాడు.

వాల్మీకి హృదయంలో ని సంశయగ్రంథులన్నీ చాలావరకు పటాపంచలైపోయాయి. అయినా ఏదో ఒక సందేహం అనిర్వాచ్యమై అతని హృదయాంతరాళలో సుళ్లు తిరిగింది.

అది గ్రహించి బ్రహ్మ కవిబ్రహ్మ సందేహచ్ఛాయ తొలగించి వేశాడు:

"ఆదికవీ! నీ సందేహం నా కవగతమైనది ఎప్పుడో జరిగిపోయిన శ్రీ రామ చరితం తిరిగి నేనీనాడెలాగ రచించగలనని నీవు సంకోచిస్తున్నావేమో! నీవు సంకోచించవలసినంత అంతరాయమేమీ లేదు.

"నీ ఆదికావ్య రచనా సమయంలో భూత భవిష్యద్వర్తమాన వ్యవహారాలన్నీ నీ ఎదట వర్తమాన రూపంలోనే గోచరించ గలవు! ఇంతే కాక ఆయా దేవమానవ రాక్షసుల మనోవృత్తులే కాక, పశుపక్ష్యాది ప్రాణుల మనోవృత్తులుకూడా నీకు కరతలామలకాలుగా గోచరించగలవు. ఇందువల్ల నీవాణిలో అసత్యలేశమైనా ప్రవేశించ నేరదు. శ్రీ రామాయణరచనవల్ల నీవాణి మానవలోకంలో నదీనదాలున్నంతవరకు శాశ్వతమై ప్రకాశించగలదు!

"అంతేకాక నీవీ మానవ శరీరం విడిచిన పిమ్మట నీకావ్యం మానవలోకంలో వినిపించినంతవరకు బ్రహ్మలోకంలో నాసాయుజ్యంలో నివసించగలవు! వెనువెంటనే శ్రీమద్రామాయణ రచన కుపక్రమించి జన్మ చరితార్థం చేసుకో! ఆర్షకవీ! నీ సత్సంకల్పం నిర్విఘ్నంగా నెరవేరుతుంది!"

ఆ మేఘగంభీరస్వరం విని వాల్మీకి మహాకవి కన్నులు తెరిచి చూచాడు.

వెంటనే ఆ వృత్తాంతం అంతా శిష్యుడు భారద్వాజుని కెరిగించాడు.

మరునాడు ప్రాతఃకాల జపతపాలన్నీ ముగించుకొని శ్రీమద్రామాయణ రచన కుపక్రమించాడు. అతని రచనా సమయంలో అంతటా 'మా నిషాద గీతి' ఒక మహా శ్రుతిగా మారుమోగింది. ★

అసమర్థుని ఆదర్శం

వారణాసి శ్రీరామమూర్తి

"ఏరా రామం! తయారయ్యావా? అప్పుడే ఆరయింది," అంటూ ప్రకాశరావు హుషారుగా గదిలోకి వచ్చిన వాడల్లా రామాన్ని చూడగానే నీళ్ళు కారాడు. ఆనాడు మొదటి ఆట "హెలెన్ ఆఫ్ ట్రాయ్" చూద్దామని కాలేజినుంచి వచ్చేటప్పుడే ఇద్దరూ ప్రోగ్రాం వేసుకున్నారు. ప్రకాశరావు త్వరగానే కార్యక్రమం ముగించుకొని వచ్చాడు. కాని రామం ఇంకా కాలేజి బట్టలైనా మార్చకుండా కిటికీలోంచి తోటలోకి తదేక దృష్టితో చూస్తూ కూర్చున్నాడు. రామాన్ని చూడగానే ప్రకాశరావుకి ఒకవిధమైన విసుగు, కోపంకూడా కలిగాయి.

రామం ఉలిక్కిపడి "ఆఁ! మార్చుకుంటాను. అయినా ఈవేళ సినిమాకు వెళ్ళకపోతేనేమిరా? నా మనస్సు బాగోలేదు."

ఈదెబ్బతో ప్రకాశరావు మరి ఉండబట్టలేకపోయాడు. తన ఆనందమంతా ఖూనీ అయినట్లు ఫీలయ్యాడు.

"నవ్వీమధ్య మరీ వింతమనిషివయిపోతున్నావేమిరా? మునుపటి చురుకు రవ్వంతైనా కన్పించటంలేదు ప్రేమలో పడ్డావేమిటి కొంపతీసి. ఎప్పుడు చూసినా ఒకటే ఆలోచన."

"అవును. ఒకవిషయం గురించే ఆలోచిస్తున్నాను. నామనస్సు చాలా గాయపడింది. దాన్ని ఎలా తేల్చాలో అర్థంకాకుండా ఉంది. కాని ఆ విషయం ప్రేమమాత్రం కాదు." అంత విషాదంగా ఉన్నవాడు కూడా కొద్ది చిరునవ్వుతో అన్నాడు.

రామంధోరణి చాలా క్రొత్తగా ధ్వనించింది ప్రకాశరావుకి. సెలవలకి ఇంటికివెళ్లి తిరిగి వచ్చినప్పటినుంచి ఇలాగ మారిపోయాడు. ఎప్పుడూ ఏవిషయాన్ని సీరియస్‌గా తీసుకోని రామం ఏ సమస్యతో ఇలా క్రుంగిపోయాడో అర్థంకాలేదు ప్రకాశరావుకి. వాడికి ఎటువంటి బాదరబందీలు లేవు. వాడిచదువేమిటో, వాడేమిటో. కాని ఇలా ఎప్పుడూ బాధపడి ఎరుగడు డిబేటులో సాంఘిక సమస్యలను తీసుకొని చర్చించి అందర్నీ ఆశ్చర్యపరచేవాడు. ఆరోజున డిబేట్‌నుంచి తిరిగివస్తున్నపుడు, ఎప్పుడూ ఎవరినీ పలకరించి ఎఱుగని లలిత "వరకట్నాలమీద మీకున్న అభిప్రాయానికి నాకు చాలా సంతోషం. అవినీతి, అన్యాయం పెరిగిపోతున్న నేటిసమాజంలో మీలాంటి యువకులు బయలుదేరడం మా మహిళల అదృష్టం మా అందరితరఫునా నా కృతజ్ఞతా వందనాలు" అంది. వాడు తనవ్యక్తిత్వాన్ని నిలబెట్టుకొంటానంటాడు. తన ఆత్మాభిమానానికి దెబ్బతగిలే ఏపని చేయనంటాడు. తనకు తన స్వంత ఆలోచనల మీదే విశ్వాసమంటాడు. లెక్చరర్లుకూడా వాడి నిశితబుద్ధిని చాలా శ్లాఘించారు. కాని ఇతడు అప్పటి రామం కాదు. ఏమాత్రం చురుకులేదు. ఎప్పుడూ మందంగా ఆలోచిస్తూ కూర్చుంటున్నాడు. ప్రతిదీ అయిష్టంగానే చూస్తున్నాడు. ఎప్పుడూ ఏదో ఆలోచనే.

దీనికి ప్రబలమైన కారణం ఏదో ఉండాలనుకొన్నాడు ప్రకాశరావు. రామం, ప్రకాశరావు, బి. ఎ సీనియర్ క్లాసు చదువుతున్నారు వాళ్ళిద్దరిమధ్య ఎడతెగని స్నేహం. ఎలాగైనా ఈనాటితో సమస్యేమిటో తేల్చవలసిందేననుకొన్నాడు ప్రకాశరావు. తిరిగి రామం, "మునుపటి రామం"గా మారాలనుకొన్నాడు.

"నిన్నంతగా గాయపరచిన విషయమేమిటిరా" మాటవరసకన్నట్లుగా అన్నాడు ప్రకాశరావు.

"ఇప్పుడు కాదులే! తర్వాత చెప్తాను."

"కాదిప్పుడే చెప్పాలి. చెప్పకపోతే నన్ను చంపుకుతిన్నట్టే."

ఈ మాటతో రామం కొంచెం చలించేడు.

"నీకు చెప్పకూడనిది ఏంలేదు. నీకంటె నాకు ఆప్తులెవరూ లేరు. ఆ విషయం నాకు తెలుసు"

"అయితే నీకొచ్చిన సమస్యేమిటో త్వరగా చెప్పు."

ప్రకాశరావు మరీ బలవంతం చేయటంచేత రామం చెప్పనారంభించేడు.

"నేను సంక్రాంతి సెలవులకి ఇంటికి వెళ్లేటప్పుడు సాధారణంగా ప్రతివాడు ఎంత ఆనందంగా ఉంటాడో నేనూ అలాగే ఉన్నాను. వెళ్లగానే అమ్మ, చెల్లాయి చాలా ఆప్యాయంగా పలకరించేరు. నాన్న "జాగ్రత్తగా చదువుతున్నావా?" అని అడిగేడు. "ఊఁ" అన్నాను

ప్రతి తలీ అనేటట్లుగానే అమ్మకూడ "చిక్కిపోయేవురా! నాయనా!" అంది. నేను చిరునవ్వుతో ఊరుకున్నాను.

"చదివేవాడు కాస్త చిక్కకుండా ఎలా ఉంటాడు?" నాన్న సమాధాన పరిచేడు.

"కాదే అమ్మా! త్వరగా ఒక వదినను తీసుకురావాల్సిందే!" అంది చెల్లాయి నవ్వుతూ. నేను గుడ్రురచేయడంతో పారిపోయింది. అందరం నవ్వుకొన్నాం. ఇలాగ రెండు రోజులు ఆనందంగా గడిచింది. అమ్మ నాకిష్టమైన పదార్థాలన్నీ చేసిపెట్టేది.

ఒకరోజున రాత్రి భోజనాలయ్యాక, నాన్న, నేను ఆరుబయట పడుకొన్నాం. అమ్మ, చెల్లాయి ఇంకా ఇంట్లో ఏదో పని చేసుకొంటున్నారు.

నాన్న ప్రారంభించేడు. "అయితే, జాగ్రత్తగా చదువుతున్నట్టేనా? ఈ ఏడాది ఎలాగో కష్టపడి ప్యాసు అయావంటే మన కష్టాలన్నీ గట్టెక్కినట్టే. నేను ప్రతి నెలా ఆ ఏభైరూపాయలు పంపడానికి ఎంత కష్టపడుతున్నానో నీకు తెలిసే ఉంటుంది."

ఔను నాకు తెలుసు. నాన్న చిన్నప్పట్నుంచి నాకోసం, చెల్లాయికోసం ఎంతో కష్టపడుతున్నాడు నా చదువుకోసమని ఉన్న ఒక ఎకరంకూడా అమ్మేశాడు నా చదువుకోసం అనేకమంది చుట్టాలనుకొన్నవాళ్ళు చాలా అడ్డులు చెప్పారు. కాని నాన్న వాటిని లెక్కచేయలేదు. ఇప్పుడు నాన్న ఉద్యోగం మీద వస్తున్న ఆ నాల్గురూకలే సంసారానికి ఆధారం. త్వరగా చదువు ముగించి అమ్మని నాన్ననిసుఖపెట్టా


లక్స్ టాయ్‌లెట్
సబ్బును వాడి చూడమని
లలిత మీకు సలహా చెప్పుచున్నది
"శుద్ధమైనది, తెల్లనిది—
ఈ సబ్బు ద్విగుణమైనది!"
. . . లలిత, తన చర్మ సౌందర్యమును చెక్కు చెదరకుండా కాపాడుకొనుటకు ఎల్లప్పుడూ లక్స్ టాయ్‌లెట్ సబ్బునే వాడుచుండును. దాని సమృద్ధియైన నురగ తన చర్మమును పరిశుభ్రంగాను, నునుపుగాను వుంచుచున్నదని ఆమె గ్రహించింది—మరియు మనోహరమైన దాని పరిమళమును ఆమె చాల మెచ్చుకొనును!
సినీమా తారలవలె చేయుడు—దీని మెత్తని నురగతో మీ చర్మ సౌందర్యమును కాపాడుకొనుడు. దాని అద్భుతమైన తెలుపు లక్స్ టాయ్‌లెట్ సబ్బుయొక్క శుద్ధతకు నిదర్శనము.
లక్స్ టాయ్‌లెట్ సబ్బు
LUX
TOILET SOAP
సినీమా తారలకు సౌందర్యమునిచ్చు సబ్బు
L.TS. 494-X52 TL

★ అసమర్థుని ఆదర్శం ★

లని హృదయపూర్వకంగా అనుకొన్నాను.

మళ్ళీ నాన్న ఇలా అందుకొన్నాడు, "చూడు, చెల్లాయి పెళ్ళి తరవాయి ఉంది. కట్నాలు చూస్తే వేలకి వేలు ఇవ్వాలి. ఇంట్లో చూస్తే చిల్లిగవ్వలేదు. చూస్తూ చూస్తూ, పిల్లను ఏ రెండో పెళ్ళివానికో ముడెట్టడానికి ఏ తండ్రికీ మనస్కరించదు కదా? అందుకే నీకీ నిదాఘ పెళ్ళి చేసెయ్యాలని నిశ్చయించుకొన్నాను. సుబ్బయ్య శాస్త్రిగారు మొన్న వచ్చి వాళ్ళ పిల్లనిస్తామన్నారు."

మొట్టమొదట నా కిక్కడే అనుమానం వచ్చింది? నా పెళ్ళికి, చెల్లాయి పెళ్ళికి ఉన్న సంబంధమేమిటో అర్థం కాలేదు. నా పెళ్ళి అయితే, చెల్లాయి వివాహం ఎలా జరుగుతుంది నాన్న ఆడబోయే బ్రహ్మాండమైన నాటకానికి నాంది అనుకున్నాను.

నాన్న తిరిగి అందుకున్నాడు "వాళ్ళు రెండు వేలిస్తామన్నారు. అందులో కొంత డబ్బు చెల్లాయి పెళ్ళికి పనికి వస్తుంది."

వెంటనే నన్ను ఆందోళనలు ఆవరించుకున్నాయి. కట్నం ఒక్క కానీ కూడా తీసుకోకూడదని నేను ఏనాడో నిశ్చయించుకొన్నాను. కాని నాన్న దానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడు. నా వ్యక్తిత్వం, ఆదర్శంమీద ఇంకొకళ్ళకి అధికారం లేదు. ఈ మాటే చెప్పాలనుకొని "నేను ఆ సంబంధం చేసుకోలేను నాన్నా! ఇంతకీ కట్నం తీసుకొని పెళ్ళి చేసుకోవడం నీచంగా భావిస్తాను. ఈ విషయం నీకూడా తెల్సిందే. నా మనస్సుకి వ్యతిరేకంగా ఏ పనీ చెయ్యలేను." అన్నాను ఉద్వేగంగా.

దీనితో నాన్న ముఖం మలినమైంది. కోపంతో ముఖమంతా కందగడ్డయింది. "అయితే చెల్లాయి పెళ్ళెలా చేస్తావ్? రెండువేలదాకా ఇస్తేగాని ఎవరు చేసుకుంటారు." అని గట్టిగా అరిచాడు.

అయినా నేను చలించలేదు. "ఏమో! మీ యిష్టం" అని విసుగ్గా దుప్పటి తీసుకొని లోపలికి పోయేను.

"బాధ్యతా విహీనుడు!" నాన్న గొణుగుడు వినిపించింది.

రాత్రంతా ఇదే ఆలోచన. నిద్ర పట్టలేదు. తెల్లవారుఝామున ఎప్పుడో పట్టింది. తెల్లారి ఏడింటిదాకా లేవలేదు. ముఖమంతా వాడిపోయింది. కళ్ళు ఎఱ్ఱగా అయ్యాయి. కాలకృత్యాలు ముగించి కాఫీ త్రాగి కూర్చున్నాను.

ఇంతలో అమ్మవచ్చి "నాయనా! నీకు కొంత చెప్పాలనుకొంటున్నాను. నెమ్మదిగా వింటావా?" బ్రతిమాలుకొంటున్నట్లుగా అంది.

"తప్పకుండా చెప్పమ్మా! వింటాను" ఇక్కడొకమాట చెప్పాలి అమ్మ మామూలు స్త్రీలలాగ ప్రతీ చిన్న విషయానికి కన్నీరు కార్చదు. విషయాన్ని బాగా విమర్శించి అర్థంచేస్తుంది. ఇంట్లో చిన్న చిన్న విషయాలకు నాన్న హంగామా చేయడం, అమ్మ వాటిని సర్దడం పరిపాటి. కొద్దిగా చదువుకుందికూడా. నేమో బాగా మాట్లాడుతుంది.

"ప్రతిమనిషికి కొన్ని కోర్కెలూ, ఆదర్శాలు ఉండడం సహజం. ఉండాలంటాను కూడా!" పెద్ద వేదాంతిలా మొదలెట్టింది. "కాని పరిస్థితులు మనకోరికలకు అడ్డుతగుల్తాయి. అప్పుడు మానవుడు పరిస్థితులను అనుకూలంగా చేసుకోవడానికి చాలా ప్రయత్నిస్తాడు. కాని అవి విషమంగా పరిణమిస్తాయి. అప్పుడు మానవుడు వ్యర్థప్రయత్నాలుమాని తలఒగ్గడమే శ్రేయస్కరం."

"అయితే ఇప్పుడు నా వ్యక్తిత్వాన్ని గులుకొని మీరు నిశ్చయించిన సంబంధం చేసుకోవాలన్నమాట!"

"ఏదైనా సమస్య ఉందంటే దాన్ని ఆమూలాగ్రంగా చర్చించాలి. నీకొక ఆదర్శంఉంది. బాగుంది. నీ ఆదర్శం కోసం, నీ చెల్లాయి భవిష్యత్తు పాడుచేస్తావా? దాని శ్రేయస్సుయొక్క బాధ్యత నీకు లేదా?"

"తప్పకుండా ఉంది."

"అయితే విను. నీకింత చదువు చెప్పించకుండా ఉంటే, ఆ ఎకరం పొలం ఉండేది. దానితో చెల్లాయి పెళ్ళి చేసేవాళ్ళం. కాని నాన్న నీబాగు కూడా కోరేవారే! అందుచేతనే ఎవళ్ళేమి అడ్డుతగిలినా వినకుండా ఇంత చదువు చెప్పించేరు. అయినా నీకున్న ఆదర్శం బాగా డబ్బున్నవర్గం వాళ్ళు ఆచరిస్తే బీదపిల్లలకు మేలుకలుగుతుంది. దానివల్ల సమాజం బాగుపడుతుంది. బాధ్యతలముందు ఆదర్శానికి విలువలేదంటాను. నువ్వు కానీ తీసుకోనంటున్నావు నీ చెల్లాయికి కానీ ఇవ్వక్కర్లేకుండా పెళ్ళి చేయగలవా?" అమ్మ సవాలు చేస్తున్నట్లనిపించింది.

ఇంతవరకు చెల్లాయిమాట ఆలోచించనే లేదు. ఉన్న ఆస్తిఅంతా నా చదువుకే అయింది. సమానంగా రక్తం పంచుకొన్న చెల్లాయికి ఇప్పటివరకు ఏం పెట్టేం? ఏం ఇచ్చేం? నా ఆదర్శంతో నా బాధ్యత మర్చిపోతున్నాననిపించింది. ఆశయసిద్ధికై పోరాడ్డమా? చెల్లాయి బాగు చూడ్డమా? ఏది దారి? కర్తవ్యతామూఢుడనయ్యాను.

"ఇప్పుడు చెప్పు నాయనా! చెల్లాయి ముఖం చూసి చెప్పు. బాగా ఆలోచించుకుని సమాధానం చెప్పు. రక్తాన్నంతా, చెమటగా ధారపోసి సంపాదించిన డబ్బు నీకోసం ఖర్చుపెట్టినప్పుడు నీ బాధ్యత ఎంత ఉందో గుర్తించుకో."

ఏడుపు పెల్లుబికి వచ్చింది. నోరు విప్పలేకపోయేను. చెల్లాయి ముఖం చూస్తే "నా బ్రతుకింతేనా అన్నయ్యా?" అన్నట్లనిపించింది. ఒక్క క్షణం నిలబడలేకపోయాను. వెంటనే బయలుదేరి వచ్చేసేను.

"మీ అమ్మ నిజంగా దేవతే సుమా గిరీ! ఎంత చక్కగా చెప్పింది. సరిగ్గా అడగవలసిన ప్రశ్నే అడిగింది. వెర్రి వెర్రి ఆదర్శాలకై ఆనందమయమైన సంసారం, సంతాప నిలయంగా చెయ్యకు. నామటుకి ఈ "వరకట్నాల సమస్య" అందరికీ ఒక వేలంవెర్రిగా పరిణమించిందని తోస్తోంది. నీ చెల్లెలి కోసం, నీ ఆదర్శాన్ని త్యాగం చెయ్యి. ఎవరూ ధన్యవాదాలర్పించకపోయినా, నేను మాత్రం నిన్ను శ్లాఘించకుండా ఉండలేను." తేలికైన హృదయంతో అన్నాడు ప్రకాశరావు.

"నిజంగానా?" సంతృప్తితో రామం "ఆసంబంధం నిశ్చయం చెయ్యమన్నట్టు ఇంటికి కార్డు రాశాడు. ★

★ మాంత్రిక


గోడా సీతారా

మంత్రాలు

ఇంటినిండా పాములే. రకరకాలపాములు. కస్సుకస్సుమంటూ, బుసకొట్టుతూ, చేటలంతలేసి పడగలు విప్పి, మెల్లమెల్లగా తోకలాడిస్తూ అన్నిపాములే పొట్లకాయలు ఇంటినిండా పరిచినట్టున్నాయి. ఒక మూలగా దేవుడిపెట్టె. ఆ పెట్టె ప్రక్కనే కూర్చున్నాడు ఏడెనిమిదేళ్ల యీడుగల పిల్లవాడు. చేతుల్లో ఒక చిన్న పుస్తకం. కాగితాలు తిరగవేసి ఏవో చదువుతున్నాడు. ఇంటినిండా పాములు చెలరేగిపోయాయి. చూశాడు. నిలువున ప్రాణాలు ఎగిరిపోయినట్టయి దేవుడిపెట్టెకి చేరబడిపోయాడు. చేతిలో ఉన్న పుస్తకం క్రిందపడిపోయింది. కాని పాములు ఎటూపోలేదు. చిర్రు బుస్సుమంటున్నాయి. కొట్టాడుకొంటున్నాయి. ఇల్లంతాకలగాములా జేస్తున్నాయి. అంట్లు తోమే పనిమనిషి సామాను ఇంట్లో పెట్టి పోదామని పెరటిగుమ్మం దాటి నట్టింట్లో కాలు పెట్టబోయి తుళ్లిపడి వెనకకి ఒక్కడుగు వేసి 'అమ్మో బాబోయ్; ఎన్ని పాములో సచ్చిపోనాడు పిల్లోడు'— అంటూ పెరటిలోకి పారిపోయింది. పెరటిలో నూతి దగ్గర స్నానం చేస్తూన్న ఇంటావిడ 'ఏమిటే ఆ కేకలు? ఏం వచ్చిందే' అని కేకలు వేస్తూ గుమ్మంలోకి వచ్చి చూసింది. ఏముంది? ఇంటి నిండా పాములే. పనిమనిషి పెరటిలోంచే కేకలు వేస్తూంది. 'అమ్మగారూ! లోపల ప్రకాశంబాబు ఉండిపోనాడు. యీ దుష్టపాములు పొడిసినాయి గావాల. మా నాయనో! ఎంతపనైపోయింది బాబో'— అని ఏడుస్తూంది. ఇంటి యిల్లాలు గతుక్కుమన్నాది. కాని ఏమిచేయడానికి తోచలేదు. చటీమని పొరుగింటికి వెళి

మంత్రవేత్త గోడా సీ
మైనది. గారుడ, ఆంజనేయమం
వున్న సాలూరు. ఆజ్ఞ అయితే,
వీరి పాదాలకు నమస్కరించేవి.
వున్న నాగుబాము వెలికివచ్చి,
కాటువేసిన కోడెతాచు సర్పదష్ట
పీల్చివేసేది. ఈ విధంగా అనే
ప్రభావాన్ని ప్రత్యక్షంగా చూ
పరమపదించారు. వీరి జీవితాన్ని

★ యామిజాల



శిఖామణి

మ శాస్త్రి గారు

: నమ్మకాలు

ారామశాస్త్రిగారి జీవితగాధ మహాద్భుత
్త్రోపాసకులైన వీరి నివాసం బొబ్బిలి వద్ద
నీటిబిందెలు కాళ్ళువచ్చినట్లు, నడిచివచ్చి
ప్రట్టలో దాగి, మానవుడి కంటబడకుండా
వీరి ఆదేశం ప్రకారం నడుచుకునేది
డి శరీరంలోనుంచి తన విషాన్ని తానే
క అద్భుత చర్యలు చేసి మంత్రశాస్త్ర
ించిన శాస్త్రిగారు 1921 ప్రాంతంలో
ఈ వ్యాసం కళ్లకు కట్టినట్లు చిత్రిస్తుంది.

ఆయింటి యజమానితో చెప్పింది. మీబావగారు నిన్న సాలూరు వెళ్లేరు. అన్నయ్యా నువ్వు వేగంవెళ్ళి చెప్పి తీసుకురా! ప్రకాశి గాడు దేవుడి పెట్టెదగ్గర కూలబడి ఉన్నాడు. ఇంటినిండా పాములే. ఏంజరిగిందో తెలియదు'— వెంటనే ఆయన వాణీ వేసుకుని సాలూరు పరుగెత్తాడు. శాస్త్రులుగారు సాలూరులో రాజావారి సంస్థానంలో ఇష్టాగోష్ఠిలో ఉన్నారు. సరాసరి అక్కడికేవెళ్ళి కథఅంతా చెప్పాడు. శాస్త్రులుగారు చిన్నకోపంతో ఒక నవ్వు నవ్వి

'వెర్రి వెధవ ఆపుస్తకం ఎందుకుతీశాడూ! సరే మరేంభయం లేదు. అలాగే ఉండమను ఆ పెద్దమనుషుల్ని. ఒక గంటలో వస్తున్నానని చెప్పు, నువ్వు వెళ్లు. పో' అన్నారుగట్టిగా.

పుస్తకమెందుకు తీశావురా!

రాజుగారి కొలువు అయిపోయింది. సాలూరులో ఉన్న సొంతయింటికి వెళ్ళి శాస్త్రులుగారు స్నానంచేసి నీమా, జామా దిద్దుకొని భోజనంచేసి, ఒకగంట పడక వేసిదలగా సాయంకాలానికి రామభద్రపురంవచ్చి ఇంట్లో కాలుపెట్టేరు. ఇంటినిండా పాములు వాడిపోయిన పొట్లకాయలలా తలలు వంచుకొని పడి ఉన్నాయి. సందుచేసుకుని శాస్త్రులుగారు సరాసరి దేవుడి పెట్టె దగ్గరకు వెళ్ళి ప్రకాశాన్ని యివతలకి తీసుకువచ్చి, అప్రనా ఆ పుస్తకం ఎందుకుతీశావురా! అని కసిరి పో పోయి యుద్దమించు అని పంపించివేసి ఇల్లాలిని పిలిచి 'అవునే యీ మాత్రందానికి కొంపమునిగిపోయినట్టు కబురుపెట్టా వేమిటికే? నాపనంతా

★ సీతారామశాస్త్రిగారి ★

అద్భుత చర్యలు

పాడు చేశావు పాచిపెంట జమీందారు గారి యింట్లో గ్రహబాధ పోగొట్టాలని హోమం కబురు చేశారు. వెళ్ళవలసి ఉంది. ఇదివరకు కొన్నిసార్లు చెప్పాను ఆ బుట్టలో ఉన్న విభూతి యింత జల్లితే పాములు పోతాయని. ఎక్కడ చెడిసింది నీ తెలివి? – అని నాలుగు తిట్టి పాముల్ని చూసి,

"ఏమయ్యా! మీలాంటి తగుమనుషులు ఇలా వచ్చి పిల్లల్నీ, ఆడవాళ్ళనీ భయపెట్టడం న్యాయమేనా? రండి ఇలా ఇవతలకి దయచేయండి ఊళ్లో ఉన్న విబుధులంతా దర్శనానికి వచ్చారు. వారికి దర్శనం ఇప్పించండి వేంచేయండి మర్యాదగా" అని అన్నారు. వెంటనే పాములన్నీ క్రమశిక్షణతో మైదానంమీద నడిచే రక్షకభటుల్లా వరసగా వచ్చి శాస్త్రులుగారికి ఒక గజం దూరంలో చేరుకొని ఉన్నాయి జనం అంతా యీ వింత చూడ్డానికి కదిలి ముంకట్టేశారు అందరికీ శాస్త్రులుగారి శక్తి తెలుసు. అయినా ఏమిటో వింత. ఇన్ని పాములు ఎలా వచ్చాయో? అనీ, ఒకటి కూడా కనపడకుండా ప్రొద్దస్తమానమూ వచ్చినట్లు ఇంట్లో పడిఉండడమూ వింత—

అప్పుడు శాస్త్రులుగారు వాటిని ఉద్దేశించి "ఇక దయచేయండి ఎప్పుడూ నేను లేనప్పుడు ఇలా గాండ్రించి గొప్పబని చేశారు. పిల్లలుంటారు. పెద్దలుంటారు. ముసలులుంటారు గుర్విణులుంటారు. ఎవరివల్ల ఏం వచ్చినా తనపాపానికి, లోకనిందా'—ఊఁ ఇక వెళ్ళండి"

అని గట్టిగా ఒక కేక వేశారు. ఒక్క పామూ అక్కడ లేదు. ఎక్కడికి పోయాయో, ఎలా పోయాయో ఎవరికీ తెలియదు. అంతా చూస్తూనే ఉన్నారు ఏముంది? శాస్త్రులుగారు ఉపసంహార మంత్రం పఠించారు ఆ కేకలలోనే. నాగబంధం అదృశ్యమయింది. అంతే. చూసే వారికి అది వింత ఆ సిద్ధపురుషుడికి అది ఒక సాధారణ క్రియ—

గారుడం; ఆంజనేయం

పందొమ్మిదో శతాబ్దం ఉత్తరార్థం. భాషాభేదాలు లేని మన స్తత్వాలతో, విశాల హృదయాలతో మానవులు మానవులుగా జీవిస్తూన్న దినాలవి. మంత్రాలనూ, మహిమలనూ మహారాజులు కూడా చేతులెత్తి నమస్కరిస్తున్న పుణ్యదినాలు ఆ సమయంలో పుట్టిన మహనీయుడు గోడా సీతారామశాస్త్రిగారు బొబ్బిలి, సాలూరు, చెముడు, శంబర మొదలయిన జమీలు శాస్త్రులు గారిని యథోచితంగా సత్కరించాయి వారిమహిమలు కళ్ళారా చూచినవారు ఆ జమీందార్లు. సాలూరు తాలూకా రామభద్రపురం శాస్త్రులుగారి జన్మస్థానం. తండ్రి బుచ్చి శాస్త్రులుగారు. బుచ్చిశాస్త్రులు గారికి తర్క వ్యాకరణాది శాస్త్రాల పరిచయం ఏమీ లేకపోయినా మంత్రశాస్త్రములో కొంత ప్రవేశం వున్నట్టు వినికిడి. రామోపాసన కలవారు. ఎవరికేనా జ్వరం వస్తే, గాలిపిశాచాలు వాలితే, ఏదేనా గుప్తమయిన పుండు పుడితే బుచ్చిశాస్త్రులు గారితో మనవి చేసుకొనేవారు. అప్పుడు మంత్రించిన తీర్థం గాని, విభూతి గానీ శాస్త్రులు గారు ఇచ్చేవారు అది సేవిస్తే వెంటనే బాధలు నిమ్మళించేవి ఇది బుచ్చిశాస్త్రులు గారి విషయం. ఇక నిత్య జీవితం..... చెప్పుకోతగ్గంత లేకపోయినా కొంచెం వ్యవసాయం ఉండేది. అది కూడా పల్లపు భూమి అది సేద్యం చేసుకుంటూ కుటుంబ పోషణకి, అతిథి, అభ్యాగతుడూ వస్తే ఆదరించడానికి లోపం లేకుండా వారికి ప్రొద్దు గడిచిపోయేది. ఆ బుచ్చిశాస్త్రులు గారి చెప్పుకోదగ సంతతిలో సీతారామశాస్త్రిగారొక్కరే ముఖ్యులు.

సీతారామశాస్త్రిగారికి చిన్ననాటి నుండీ కులాక్రమాగతమయిన రామభక్తి ఎక్కువ తాను ఆంజనేయుణ్ని అని వారి నమ్మకం. శ్రీరామచంద్రుడొక్కడే దైవమని వారి తీర్మానం. వారి బాల్యంలో విద్యార్జన అంత చెప్పుకోదగ్గంత ఏమీ లేదు ఏవో నాలుగు శబ్దాలూ, అమరంలో కొన్ని శ్లోకాలూ, కావ్యాలలో మూడు నాలుగు సర్గలూ...అంతే వారు సంపాదించిన సంస్కృత విద్యాధనం. తెలుగులో వారికి చూపే లేదు చదవవలసేది లేదని కాదు. వారికి ఆ ఉత్సాహం లేదు. కాని వారు చేసిన పురాణకాలక్షేపాలు చాలాకాలం తెలుగు భారత రామాయణాలే వారు పురాణం చెప్పడానికి మూల్యంటే తెలుగు పుస్తకంలో అడ్డే ఘట్టం ఏదీ లేదు. గోకర్ణ పాటలాపాడేసేవారు పద్యాలు. కొన్ని వందల తెలుగుపద్యాలు వారికి మొదలు అందిస్తే చాలు అమాంతం పూర్తి అయిపోయేవి. అదేదో వింతబుద్ధి—

సీతారామశాస్త్రులుగారు ఉపనయనం అయిన వెంటనే నేర్చుకొన్నది కొంచెం వేదంలో సామాన్యంగా వచ్చే ఆశీర్వచన భాగం. అంటే నవోనవోభవతీత్యాదులు కాని మంత్రశాస్త్రంలో వారికి ప్రత్యేకాభిమానం ఉండేది దానిలో శాస్త్రులుగారికి వచ్చిన మంత్రాలు రెండు. ఒకటి గారుడం, రెండవది ఆంజనేయం రెండూ అక్షర లక్షలు పునశ్చరణ చేసి దానికి తగ్గంత హోమం, బ్రాహ్మణారాధనా, శాంతి చేసి పిలిస్తే పలికినట్టు చేసుకొన్నారు. సుమారుగా పదారేళ్ళు వచ్చేసరికి ప్రముఖ మాంత్రికులై పోయారని మా పితృపాదులు లక్ష్మీనరసింహారావు గారు చెప్పేవారు

బుట్టలో పాములు మాయం!

ఒకనాడు పాములాడించుకొని జీవించే సాయెబు ఒకడు రామభద్రపురం వచ్చాడు ఆచారం ప్రకారం ఊళ్ళో ఉన్న గ్రామ మునసబుగారు ఆ సాయెబుతో చెప్పారట శాస్త్రులుబాబుతో మనవి చేసుకొని పాములాడించుకోమని. ఆ సాయెబుకి ఆగ్రహం వచ్చి అన్నాడట, నాకే పాములాటకి బొమ్మనిక్క మునిసేగాలా' అని-ఆ మునసబుగారు అలా కాదు నీ మంచికే చెబుతున్నానన్నారట ఆరిమంచికి నేను చెప్తానన్నాట సాయెబు సరే అని మునసబుగారు తీసుకున్నారు సాయెబు గోలు కొట్టాడు పలెబ్బూగుయురి అంతా చూస్తూ చేరారు పాములాట చూడడానికి. సాయెబు ఒయ్యారంగా వేణువు ఊదుతూ ఒక పెద్ద పెట్టె ముందుకి తీసి, ఇద్గో ఇది బద్రాచలం అడివిలో పట్టుకొన్నాను. రామన్నా నాగు...అంటూ తాపీగా భయం నటిస్తూ పెట్టె తీశాడు ఏముంది? పెట్టెఖాళీ...అరెరే ఎక్కడా పోయిందీ రామన్నా నాగూ' అంటూ ఇంకో పెట్టె తీసి చూశాడు. అదీ ఉత్తదే. ఇంకో పెట్టె అదీ అంతే పెట్టెలన్నీ ఒక్కొక్కటే తీసి గాభరా పడుతూ చూస్తే ఇంకేం చూస్తాడు అన్నీ వట్టి పెట్టెలే. సాయెబు గారికి ఆశ్చర్యం, ఆగ్రహం అంతూ పొంతూ లేదు. మునసబు గారు చిన్న నవ్వుతో నేను ముందే చెప్పాను శాస్త్రులుబాబుతో చెప్పిరా అని. నువ్వు విన్నావా? ఇప్పుడేనా పోయి వారి కాళ్లు పట్టుకో అన్నారు. ఈ మాటతో మరి

మండిపడి 'మీశాస్త్రులు పనిపట్తాను. చూడూ మా నిషాఖా' అంటూ వెళ్ళిపోయాడు. ఆసమయానికి అప్పుడే పొలంనుంచి వచ్చి శాస్త్రులుగారు వీధిగడీమీద కూర్చుని క్షౌరం చేయించుకొంటున్నారు. వారికేదో అనుమానం కలిగి 'ఒరే రామిగా' పడికాలి బోటనవేలికి కొసని చిన్నగంటు పెట్టరా' అన్నారు. ఎందుకుబాబూ అన్నాడు రామిగాడు. 'అదెందుకురా నీకు? గంటు పెట్టరా అన్నారు కోపంతో' తప్పనిసరిగా రామిగాడు చిన్నగంటు పెట్టాడు. అక్కడి గంటి ముఖములోనుండి వస్తున్నట్టు బళ బళా నీరురావడం మొదలు పెట్టింది. అలా ఒక పది పదిహేను నిమిషాలు నీరు ప్రవహించింది. వాకిలిఅంతా జలమయం—శాస్త్రులుగారు చిన్నవవ్వుతో 'అయిపోయింది సాయెబు గాడిపని'—అన్నారు. ఈ వింత చూస్తున్న జనానికి ఇదేమిటో అర్థం కాలేదు ఇంతలో ఆసాయెబు శాస్త్రులుగారి యింటికివచ్చాడు. ఏముంది? అంతా జలమయం... చూశాడు. శెల్లాచుటినగుడ్డ తీసి నడుముకి కట్టుకొని శాస్త్రులుగారికి మూడుసలాములుచేసి ముందుకి కూలబడి అల్లా! కూడూపోతుంది. బుద్ధి గడ్డి మేసింది షమించు అల్లా—అంటూ ఏడిచాడు.

శాస్త్రులుగారు సహజంగా దయాశీలురు. చిరునవ్వుతో వాణి లేవనెత్తి 'ఫరవాలేదు సాహెబూ! చాలా గట్టివాడివి. నువ్వు చేసిన పనిమాత్రం ప్రాణాంతీసేపని ఇంకో లాటి వాడైయితే చచ్చిఊరుకొంటాడు. క్షమించమన్నావు సహించాను. పో పో. అవుగో నీపాములు, తీసుకుపో' అని పెరటివేపు చూపించారు. వాడిబుట్టలలో ఉండే పాములన్నీ పందిరికి పొటకాయల లాగు వ్రేలాడుతున్నాయి. అందరికీ ఆశ్చర్యం! అదలాఉండగా కనుకట్టూ, మణికట్టూ తెలిసిన పాముల సాయెబే ఆశ్చర్యపడ్డాడు శాస్త్రుల్లుగారి మహిమకి వాడికి ముచ్చెమటలూ పోసి పోయాయి నోట మాటరాలేదు. ఎలా అయితేనేం? వాడి పాములు మళ్ళీ వాడికివెళ్ళేయి. వాడు ప్రయోగించాడు. దానికి శాస్త్రుల్లుగారు ఎదురుదెబ్బకొట్టి తప్పించుకొన్నారు.

ఇది వారు చాలా చిన్నతనంలో చూపిన మహిమ.

ఆగు! ఏంపని ఇది!

వయస్సువచ్చిన తర్వాత శాస్త్రుల్లుగారు శ్రీ సాలూరు జమీందారుగారికి ఆస్థాన విద్వాంసులుగా ప్రవేశించి ఉండేవారు. అందువల్ల సాలూరులో ఒక యిలు అవసరం అయింది. దానికి డబ్బు లేదు. అప్పుడు సరిగా ఉభా అవుతున్న రోజులు. రామచంద్రపురంలో రైతులను అడగడానికి వారికి మనస్కరించలేదు. ఒకనాడు తిన్నగా నడిచి బొబ్బిలివెళ్ళారు బొబ్బిలి రాజావారిని అప్పు అడుగుదామని శాస్త్రులుగారి ఊహ. తెల్లవారుజామున లేచి నడకసాగించి ఉదయం అవుతూ అవుతూ ఉండగా బొబ్బిలిలో కాలుపెట్టారు. అగ్రహారంవీధిలోకి వెళ్ళేసరికి ఒక యింటిముమ్మంముందు సుమారు ఒక వందమంది గుంపుకట్టి ఉన్నారు. ఏడుపులూ, మొత్తలూ వినబడుతున్నాయి. ఏమిటా అని శాస్త్రులుగారు వడివడిగా వెళ్ళి ఒకరిని అడిగారు. వాడుచెప్పాడు! "ఈ యింటి పిల్లవాడికి చంద్రపాడ కరిచింది. చచ్చిపోయాడు. పాపంఒక్కడే కొడుకు" అని

'ఎప్పుడు కరిచింది?'

'సుమారు రెండు గంటలవుతుంది.'

'పామెక్కడ? కొట్టేశారా పాపం?'

'కొట్టేశారయ్యా! పాపం అంటావేమిటి? క్షుద్రాగుణస్తే.'

'చచ్చిపోయాడా ఇంతలోనే,—ఏదీ చూదాం'—అని శాస్త్రులుగారు దారి చేసుకొని నేలమీద చొంగలుకారుస్తూ కొయ్యబారి పడిఉన్న పిల్లవాణ్ణి, దూరంగా నడుం విరిగి నల్లికిలా పడి ఉన్న మూరెడు పామునీ చూశారు. చూడగానే కళ్ళనీళ్ళు పెట్టుకొన్నారు. ముందు గబగబావెళ్ళి పడిఉన్న పాముని మీదికెత్తి క్రిందపడేశారు. దెబ్బతిన్నపాము లేచినట్టు అది బుస్సుమంటూ మీదికిఎగిరింది. శాస్త్రులుగారు కొంచెం వెనకకుతగ్గి 'ఆఁ ఆగు. ఏం పని ఇదీ? వారికి ఒకేఒక పలడట గొప్పతపు మనిషివే. ఏం గొప్పపనిచేశావు? మీ జాతికి అప్రతిష్ఠ కాదూ? నీ వస్తువు తీసుకొని మర్యాదగా వెళ్లు'-అన్నారు.

ఆపాము మెల్లగా పిల్లవాడి కుడిమణాము దగ్గరకువెళ్ళి ఒక పది నిముషాలపాటు తన మూతిని అక్కడపెట్టి గాలిని పీల్చనారంభించింది. తిరువాతవచ్చి శాస్త్రులుగారి పాదాల దగ్గర నిలబడ్డాది. పిల్లడు కొంచెం కళ్ళు తెరిచి అమ్మో పామన్నాడు.

'అబ్బాయీ! లేనాయనా! అన్నారు శాస్త్రులుగారు. అంతే గభీమని లేచాడు. అమ్మో పాముని అరిచాడు.

'అదేం చేయదులే, నేను దగ్గిరేఉన్నాను కదుటోయ్' అన్నారు. ఇంకేం చెప్పడం అందరూ ఈవింతచూసి మైమరచిపోయారు. ఆ యింటి యజమానికి అసలు చైతన్యమే లేదు. ఈలాంటి మహిమ అంతవరకూ యెవరూ కనీ వినీ యెరగరు.

శాస్త్రులుగారు పాముని వెంట రమ్మన్నారు. ముందు వారు వెనక పాము, పెంపుడుకుక్కలా వెడుతూంది. జనం వెంట పడ్డారు. అలా దానిని ఊరి వెలుపల ఒక మైలుదూరం తీసుకువెళ్ళి ఒకపుట్ట చూపించి 'ఊఁ! ఇందులోకి వేంచేయండి ఇక యెవరికంట పడకండి. మహోపకారంచేశారు. దయచేయండి', అని గద్దించారు. చిత్తం వెళ్తున్నానన్నట్టు ఆ పాము శాస్త్రులుగారిని ఒకమారు చూసి ఆ పుట్టలోకి వెళ్ళిపోయింది.

బిందెలు నమస్కరించాయి

ఆ యింటి యజమాని శాస్త్రుల్లుగారికి తనయింట ఆతిథ్యం ఇచ్చి సత్కరించి వేనోళ్ల ప్రశంసించాడు. ఈ భోగట్టా కోటలోకి వెళ్లింది. మధ్యాహ్నం రాజావారు కబురుచేశారు శాస్త్రుల్లుగారిని దయచేయవలసిందని.

అనుకోకుండా వారి పిలవడం. శాస్త్రుల్లుగారి పని సగం అయినట్టే. మధ్యాహ్నం చల్లబడ్డాక కోటలోకి వెళ్ళారు. కోరి రమ్మన్నారు కనక రాజావారి దర్శనం సులభంగానే అయింది.

'శాస్త్రుల్లుగారు మంత్రశాస్త్రంలో గొప్పవారని విన్నాం.'

'చిత్తం' ఏవో పొట్టకూటికి పుట్టెడు విద్యలు.

'ఇంకేమేనా ప్రజ్ఞలు?'

'ఏవో కనుకట్టువిద్యలు. వీటికి ప్రభువు వారు ఎక్కువగా మెచ్చుకొంటున్నారు.'

'కాదు కాదు. శాస్త్రులుగారి శక్తి కొంచెం చూదామని సభవారు అంటున్నారు.'

'చిత్తం! రెండు నీళ్ళబిందెలు తెప్పించండి దివాన్ సాహెబుగారూ! అన్నారు శాస్త్రులుగారు. నీళ్ళబిందెలు వచ్చాయి. శాస్త్రులుగారు కూచున్నచోటినుండి లేవనే లేదు. ఆ బిందెలు రెండూ అమాంతంమీదికి లేచి శాస్త్రులుగారి పాదాలకు మూడుమార్లు నమస్కరించినట్టు వాలి, లేచి మళ్ళీ యథాస్థానంలో ఉండిపోయాయి.'

'అబ్బే అంతేనా? ప్రభువులకు కూడా ఒక నమస్కారంచేసి ఈ ఊరు వదిలిపొండి' అన్నారు శాస్త్రులుగారు. ఇవి అలాగే చేశాయి. బిందెలు దభీమని కిందపడ్డాయి. హోరుమని చప్పుడుతో పెద్దగాలి వీచింది రెండు నిమిషాలపాటు. సభ అంతా నిశ్శబ్దం, నిశ్చైతన్యం.

కొంతసేపయాక 'యేమిటిది' అన్నారు రాజావారు.

ఏమీలేదు. గుఱ్ఱాలసాలలో ఉన్న రెండు పిశాచాలను అవతలికి పంపివేశాను' అన్నారు శాస్త్రులుగారు రాజావారి ఆశ్చర్యానికీ, ఆనందానికీ అంతులేదు. యథోచితంగా సత్కరించి శాస్త్రులుగారు కోరిన ధనం కూడా యిచ్చి పంపారు.

ఆ రాత్రికి రామచంద్రపురం వచ్చి పడుకొని తెల్లారుజామున సాలూరు వెళుతున్నారు

సీతారామశాస్త్రిగారి అద్భుతచర్యలు

శాస్త్రులుగారు. తారాపురం దాటి కొట్టక్కి దగ్గరకు వెళ్ళేసరికి దారికి కొంచెం దూరంగా మడిగట్టు దగ్గర ఒక యేతవాడు పడి కొట్టుకొంటున్నాడు శాస్త్రులుగారు దగ్గిరికివెళ్ళి యేమిరా యేమిటి బాధ? అని అడిగారు.

'బాబో పాము పొడిచింది. అదా; ఆ తాటిచెట్టుమీద' అన్నాడు.

'ఓస్ అంతేనా! లే - అన్నారు. వాడు నవ్వుతూ లేచి, 'బాబో నాను బతకడం కాదు. మీ దయవల్ల నా పెళ్లాం, పిల్లలూ బతికినారు. మీకు ఎయ్యిదండాలు' అని మొక్కాడు. నవ్వుతూ శాస్త్రులుగారు 'పో-వెఱ్ఱివాడా...అని 'ఇలా దిగువకి దయచేయండి' చెట్టుమీద కొలువుచేస్తూ వచ్చేపోయేవారిని సతాయిస్తున్నారా! ఊఁ అన్నారు. దబ్బున కిందపడ్డాది తాచుపాము. బారెడు పాము-దానిని దూరంగా అడివిలోకి పంపివేసి పాలూరు చేరుకొన్నారు.

పాదాలపై పడిన అధికారి

పాలూరు వెళ్ళి డబ్బులో పల దాచి మంగలివాణ్ణి పిలిపించి క్షౌరం చేయించుకొంటున్నారు. శాస్త్రులుగారు. సగం క్షౌరం అయింది అంతలో మేజస్ట్రేటుగారి బంట్రోతువచ్చి:

'శాస్త్రుల్లుబాబో! ఉన్నపాళాన మేజస్ట్రేటుగారు రమ్మని సెలవయింది' అని చెప్పేడు. శాస్త్రుల్లుగారు ఇదిగోవస్తున్నానని అలాగే కచ్చేరికి వెళ్లారు. మేజస్ట్రేటు ఒకఅయ్యరుగారు. శాస్త్రులుగారి వాలకంచూసి అసహ్యపడి; ఏమిటీ వికారం? అదేదో పూర్తిచేసుకొని రాకూడదటయ్యా! ఛా ఛా అని కసిరారు.

'తమని కొరపు ఆర్డరు అలాఉంది. పూర్తిచేసికొని వస్తాములెండి' అంటూ శాస్త్రుల్లుగారు ఇంటికి వెళ్ళిపోయారు. అయ్యరుగారు పరియ్యో మొర్రో అంటున్నారు. గుమాస్తాలూ, బంట్రోతులూ ఏమిటో అని పరుగెత్తుకు వచ్చారు.

అయ్యరుగారికి కంటపడినదల్లా కస్సుమంటూ మీదికివస్తూన్న పామే. బుస్సుమంటూ విషంగక్కుతూ మీదపడుతూన్న కోడెనాగు. కూర్చున్న కుర్చీ పాముపడగలా ఉంది. లేస్తే కాలుఎక్కడపెట్టడం? అదీ సందేహమే. భూమిఅంతా పడగవిప్పినపామే అయ్యరుదృష్టిలో.

జరిగినసంగతిఅంతా తెలుసుకొని హెడ్ గుమాస్తా అయ్యరుగారిని తీసుకువెళ్ళి శాస్త్రుల్లుగారి పాదాలమీద పడవేసేడు.


లే, లే, పాములూ, చీములున్నా. వాటికేంపని, నీకేంపని. పో అన్నారు శాస్త్రులుగారు. పామూ లేదు, ఏమీ లేదు. అదిమొదలుకొని ఆ అయ్యరు దక్షిణాదికి వచ్చినతరువాతకూడా శాస్త్రులుగారిని ఒకటిరెండేళ్ళకు ఒకమారు పాలూరువచ్చి దర్శనం చేసుకొంటూ ఉండేవాడు ఆ అయ్యరు ఒకనాడు ఎప్పుడో అన్నాడట సంగీతానికి చింతకాయలు రాలుతాయా? మంత్రాలకి మనుషులు లొంగుతారా అని.

అసలువిషయం ఏమిటంటే శాస్త్రులుగారికి తారాపురంలో మఖీ చెరువు ఇస్తానాలో కొంతచల్లపుభూమి ఉంది. ఆ భూమికి రైతులతో ఏదో తగువు వచ్చింది ఒకప్పుడు. శాస్త్రులుగారు రైతుకి ఎన్నోవిధాల చెప్పారు. వాడు గండమూర్ఖుడు. వినలేదు 'సరే' అని శాస్త్రులుగారు తన దస్తావేజు ప్రకారం మడిగట్టు హద్దులు ఏర్పాటుచేసి సాగుచేయించారు. గుర్రాక్రమణ చేశారని రైతు పాలూరుకోర్టులో కేసు పెట్టాడు. ఆ తరువాత జరిగినది పైసంగతి.

హేళన చేసిన నాయుడు

ఒకనాడు శాస్త్రులుగారు పెద్దకోమటిపేటలో రాత్రి పురాణం చెపుతున్నారు. ఆనాడు ఒక నాయుడు (ఏవూరో జ్ఞాపకం లేదు.) పాలూరులో చుట్టాల యింటికి వచ్చాడు. వాడు కొత్త సంస్కారి. కాళిదాసత్రయం చదువుతున్నాడు. తెలుగు పుస్తకాలు కొన్ని చదువుకొన్నాడు. రాగవరసగా పద్యాలు చదువుతాడు. అయితే చిన్న గర్వం ఉంది. మనకంటె బాగా యీ వూళ్ళో పురాణం చదివేవాళ్ళూ చెప్పేవాళ్ళూ ఉన్నారా? అని కాని యింటి యజమాని యీ వూళ్లో అలాంటి మాటలు అనవద్దు. గోడాశాస్త్రుర్లుగారు గట్టివారు. నీ బీమ్మం అయినగారు కూడ పనికిరాదన్నాడు. కాని ఆ కుర్రవాడు మానలేదు ఊళ్ళో అక్కడా అక్కడా తన ధోరణి కనపరుస్తున్నాడు. ఆనోటా ఆనోటా శాస్త్రులుగారికి యీ మాటలు వినవచ్చాయి ఆ రాత్రి ఆ సంస్కారిని కూర్చోపెట్టారు పద్యాలు చదవమని శాస్త్రుల్లుగారి పురాణం చాలా విచిత్రమైనది. ఇప్పటికీ ఆ ప్రసిద్ధి ఆ తాలూకాలో ఉంది. 'గోడా సీతారామశాస్త్రులుగారి పురాణం' అని చెప్పుకుంటారు. రామాయణం చదువుతూంటే భారత కథ చెపుతారు భారతం చదువుతూఉంటే భాగవతం కథ చెపుతారు అదో వింతప్రకృతి, అల్లరి. అలరికి అంచేమిటని. కాని ఆ వింతపురాణంకూడా వినడానికి ఇంపుగానే ఉంటుంది బాగా రక్తికడుతుంది. ఆనాడు కథాఘట్టం సీతాపహరణం. ఆ నాయుడు రంయినని రాగం విరిసి పద్యాలు చదువుతున్నాడు. శాస్త్రులుగారు అర్థం చెబుతున్నారు. ఆ విధంగా రావణాసురుడు ద్రౌపదీదేవి జుత్తుపట్టుకొని యీడుస్తూ ఉంటే కూడానూ దారిలో వసుదేవుడు అడుకొని ఏం చేశాడయ్యా అంటే — ఊఁ తరువాత చదువు నాయుడూ! అన్నారు. ఎవరూ కూర్చున్నవారు పెదవి కదపకుండా శ్రద్ధగా వింటున్నారు ఆ నాయుడికి ఈ ధోరణి చికాకు కలిగించింది అసహ్యపడి ఏంశాస్త్రుల్లుగారూ? అర్థజ్ఞానం లేకుండా చెపుతున్నారే పురాణం అని వికటంగా నవ్వి ఈ పురాణానికేనా మీకు ఇంత పేరు వచ్చిందన్నాడు. ఓహో అదా! సరిలే చదువు మాది పొరపాటే ఏం చదువుకొన్నాం మేము. ఏదో కాలక్షేపం, చదువు పద్యం అన్నారు. నాయుడు చదవబోయి పుస్తకం చూశాడు. 'అమ్మో పాము' అని ఒక్క కేకవేసి కంగారుపడుతూ లేచిపోయాడు. శాస్త్రులుగారు

(54-పేజీ చూడండి)



భట్రాజు

వి. జయలక్ష్మి

విక్రమపురి నేలునట్టి
  చక్రధరుని కొలువులోన
భట్టాచార్యుండనియెడు
  భట్రాజొక డుండె మునుపు

ప్రభువు పల్కు మాటలన్ని
  మంచివైన చెడ్డవైన
నిశ్చయముగ నిజమటంచు
  వెనువెన్కనె పల్కు నతడు.

అంతట ప్రభువొక్కనాడు
  సరసమైన ధోరణితో
"వంకాయను బోలుకూర
  ఇలలో లేదనుచు పల్కె.

భట్టాచార్యుండంతట
  ఏమియు ఆలోచింపక
ఉత్సాహముతోడ లేచి
  ఈ విధమ్ముగా పల్కెను.

"అందువల్లనే రాజా!
  ధ్వజస్తంభము పగిదిగా
వంకాయకు మీద తొడిమ
  పరమేశ్వరుడే పాతెను"

కొలువులోని వారంతయు
  సంతసించి రెంతెంతో.
భట్టాచార్యుండొసగిన
  వింత జవాబంత పొగడి

ప్రతిరోజున ప్రభువుగారు
  వంకాయల కూర తినెను.
కొంతకాలమైన పిదప
  విసుగుపుట్టె దానిపైన.

వెనువెంటనె సభికులతో
  ప్రభువెంతయు విసుగుతోడ
వంకాయొక చెడ్డకూర
  నేనెరిగితినని పల్కెను.

అంతలోనె భట్రాజనె:
  "అందుకేను మహారాజా
అడ్డానికి మీద కొయ్య
  దిగగొట్టెను దేవుడంచు"

పల్కిన భట్రాజుని గని
  ప్రభువును సామంతవరులు
మంత్రులు, జనులేకముగా
  భళిరా! భళి! అని పల్కిరి.

★ గాన-కచ్చేరి ★

పిఠాపురం జమీందారుగారు యుక్తిపరుడని ప్రసిద్ధి. ఆయనంటే ప్రజలకు మంచి గౌరవం ఉంది. అలాంటి విక్రమబహద్దరుగారు షష్టిపూర్తి జరుపుగుంటున్నారంటే ప్రజలు సంబరపడ్డారు. జమీందారుగారెంత సరదామనిషో లోలోపల అంత లుబ్ధుడు. ఆ లుబ్ధత్వం తన చమత్కృతి వలన సాధారణంగా కనబడనియడు. అందుచేత ప్రజలు ఆయన లుబ్ధత్వాన్ని లోపంగా అనుకునేవారు కాదు.

షష్టిపూర్తి వైభవంగా జరుపుతారని, విశేషాలూ వినోదాలూ చూడవచ్చుననీ ప్రజలు అనుకున్నారు.

జమీందారుగారు పందిళ్లు వేయించి అలంకరణ చేయించారు. వీధి ముందు అరఫర్లాంగు మేర యిటూ అటూ తడిపించి ఇంటి దాసీలచేతనే ముగ్గులు వేయించారు. షష్టిపూర్తి ఇంక వారంరోజులుందనగా అచ్చొత్తిన ఆహ్వానాలు అందరికీ పంచిపెట్టించారు. ఆహ్వానంలో ఉన్న ప్రోగ్రాం దివ్యంగా ఉందనుకుని సంతోషించారు ప్రజలు. ఆరోజుకోసం ఎదురుచూస్తున్నారు-రానే వచ్చింది కూడాను.

ప్రోగ్రాంలో వేసిన ప్రకారం అవేళ గానకచ్చేరిఉంది. ముఖ్యంగా అందుకే చాలమంది వచ్చారు. విశాలమైన జమీందారుగారి కచ్చేరిహాల్లో అందరూ నిశ్శబ్దంగా ఉన్నారు. ఇంకా జమీందారుగారు కాని పాటగాళ్లు కాని రాలేదు. అంతా కూర్చొని సుమారు గంట దాటింది. టైము ఐపోతూంది.

కన్నసామి

అందరికీ విసుగుగా వుంది. జమీందారుగారు వస్తే అడిగేద్దామనుకున్నారు కొందరు. ఆయన మరొక పావుగంటకు తిరుబడిగా వచ్చారు. అంతా నమస్కరించారు. ఒక కుర్చీ మీద కూర్చున్నారాయన. ఏ పాటగాడూ వెంటలేడు. ఆయన తీరు చూస్తే ఏదో మాట్లాడబోయేటట్టున్నారు. ఇద్దరు సభ్యులు లేచి వెళ్ళి "అంతా గానకచ్చేరికోసం నిరీక్షిస్తున్నారు," అని చెప్పారు. జమీందారు "అదెక్కడిదీ?" అన్నారు. అడిగినవాళ్లాశ్చర్యపోయి "ప్రోగ్రాంలో వేయించారు కదండీ" అన్నారు. "కచ్చేరి ఉందనా?" అన్నారాయన తిరిగీ. ఒకతను ప్రోగ్రాం పేపరు చూపి, "ఇదిగో చూడండి," అన్నాడు. "చదువు," అన్నారు జమీందారుగారు నవ్వుతూ.

"...సభలో జమీందారుగారుపన్యసింతురు ... గానకచ్చేరిలో అందరూ నిశ్శబ్దంగా పాల్గొని, వినప్రార్థితులు.

"అంటే ఏమిటి?" అన్నారు జమీందారుగారు.

"మీరుపన్యసిస్తారొకటీ, గానకచ్చేరిలో అల్లరి చెయ్యొద్దని ఒకటీ."

"కాదయ్యా నేనుపన్యసిస్తాను గాన-కచ్చేరీలో—అంటే ఈ కచ్చేరీ సావిట్లో, మీరంతా నిశ్శబ్దంగా కూర్చొని వినాలని. అందుచేత నా ఉపన్యాసం వినండి ఇంక," అన్నారు జమీందారుగారు.

"హాఁ" అన్నారంతా! అందరికీ కోపం పోయింది. జమీందారుగారు తన కబుర్లతో అందర్నీ నవ్వించేశారు. ★

దొంగాటకం

పుచ్చ పువ్వులా వెన్నెలకాస్తోంది. డాబా మీద వెన్నెల్లో మంచంమీద పడుకుని కబుర్లు చెప్పుకుంటున్న అమ్మలు, బాబు లేచి, ఇంకో మంచంమీద పడుకున్న నాన్న దగ్గరికి వచ్చి మెల్లిగా చెరోపక్కలో సర్దుకున్నారు. వీళ్ళిద్దర్నీ చూచి "యింకా నిద్ర రాలేదా?" అన్నాడు నాన్న.

"ఒక కథ చెప్పు నాన్నా!" అమ్మలు అడిగింది.

"అవును నాన్నా! గోపీవాళ్ల వ్వ రోజూ మంచికథలు చెబుతుందట" బలపరచాడు బాబు.

"మరి మీకూ అవ్వుంటే మంచి మంచి కథలు చెప్పేది" అన్నాడు నాన్న.

"మాకు అవ్వలేదా నాన్నా?" అడిగింది అమ్మలు.

"లేదు దేముడిదగ్గరకువెళ్ళింది."

"మరిక్కడకు రాదూ?"

"రాదు మనమే అవ్వ దగ్గరకు వెళ్తాము."

"ఎప్పుడు వెళ్తాం నాన్నా?"

"మనంకూడా అవ్వలాగ మంచి మంచి కథలు ఎప్పుడు చెబుతామో అప్పుడే వెళ్తాం."

"అయితే......"

"అబ్బ! ఉండవే. నువ్వు కథ చెప్పు నాన్నా!" మళ్లా కథ జ్ఞాపకం చేశాడు బాబు.

"ఊ చెప్పునాన్నా!" తోసింది అమ్మలు తప్పింది కాదు నాన్నకి.

"అనగా అనగా ఒక రాజట. రాజుకి ఏడుగురు కొడుకులట..."

"అబ్బ! అదొద్దు నాన్నా!" విసుక్కున్నాడు బాబు

"మరింకేం చెప్పేదీ......"

"గోపీ వాళ్ళవ్వ చెప్పే కథల కన్నా మంచికథ చెప్పాలినాన్నా!" అమ్మలు దృఢంగా అనేసి దగ్గరగా జరిగింది.

"అనగా అనగా ఒక పట్నంలో ఒక అబ్బాయి ఉన్నాడు."

"నాన్నా! మరి మనూరు పట్నమేకదూ?" బాబు ప్రశ్న.

"ఆఁ పట్నమే. ఆ పట్నానికి ఎనిమిదిమైళ్ళ దూరంలో ఒక పల్లె ఉంది."

పి. సరళాదేవి

"మైలుకి ఎనిమిది ఫర్లాంగులు కదునాన్నా! మా బడి వీధిగుమ్మం దగ్గరనించి పెరటిగోడవరకు వున్న పొడుగు ఒక ఫర్లాంగట – మా మాష్టారు చెప్పారు." తెలివితేటలొలకబోశాడు బాబు.

"ఆరుమైళ్ళకి ఎన్ని ఫర్లాంగులురా?"

"ఊ ఊ నువ్వెప్పుడూ ఇంతే- కథ చెప్పమంటే లెక్కలు చెబుతావు. ముందు కథ చెప్పునాన్నా!" అమ్మలు గునిసింది. బ్రతికిబోయాననుకున్నాడు బాబు. నాన్న కథ సాగించాడు.

"వినండిమరి. ఆ అబ్బాయి ఒక రోజు ఏదో పనిమీద పల్లెకు వెళ్ళవలసి వచ్చింది. దగ్గరేకదా అనుకుని ఉదయం సైకిలు మీద బయలుదేరాడు. ఆ మధ్యాహ్నం అక్కడ తెలిసిన వాళ్ళింట్లో భోజనం చేశాడు. పని తెమలడంలేదు. సాయంత్రం కావస్తోంది. వాళ్ళ పొలంలో పని చేస్తుండే నలుగురు రైతులువచ్చి "రేపటి సంతకి పట్నం పోతున్నాం బాబూ! మీరుకూడావచ్చేస్తారా?" అని అడిగారు. ఆ అబ్బాయికి పని తెమల్లేదు అందుచేత మీరు వెళ్ళండి తరువాత నేను వస్తాను" అని చెప్పి పంపించాడు. వాళ్ళు వెళ్ళిపోయారు. ఆ అబ్బాయికి పనంతా పూర్తయేసరికి చీకటి పడుతోంది. వెంటనే సైకిలుమీద బయలుదేరాడు. రెండుమైళ్ళువచ్చేసరికి చీకట్లు ఎక్కువగా వచ్చేశాయి. చుట్టూ తోటలు దట్టంగా వున్నాయి. ఆ తోటల్లో పడి రావాలి. ఆతోటల వలన చీకట్లు మరీ త్వరగా వస్తాయి. ఇంకొంచెం దూరం వచ్చేసరికి చీకటి బాగా వచ్చేసింది. ఆ అబ్బాయికి భయం వేసింది."

"అవును నాన్నా! ఒక్కళ్లూ చీకట్లో రావాలంటే భయం వెయ్యదూ...?" అంది అమ్మలు.

"అతనికి భయం. స్నేహితులు చెప్పిన దెయ్యాల విషయాలు జ్ఞాపకం వస్తున్నాయి. అతనికి వణుకుపుట్టింది. కటికచీకటి, కీచురాళ్ళధ్వనులూ, గాలికి కదలిన ఎండుటాకుల గలగలలూ...అతని భయం ఎక్కువై పోతోంది. చిన్న శబ్దానికి త్రుళ్ళిపడుతున్నాడు. భయ

★ దొంగాటకం ★

ఎక్కువయిపోయి వణుకు జాస్తి అయిపోయి సైకిల్ తొక్కలేక పోయాడు. దిగి నడక మొదలెట్టాడు. క్రింద పాములూ అవీ వుంటాయని నడుస్తూంటే అసలే భయమేసింది. అలసిపోయి, సైకిల్ చేత్తో పట్టుకు నడుస్తూ అలాగే వస్తున్నాడు. ఇంతలో ఏటివంతెనవచ్చింది. మరింక నడవలేక సైకిల్ అక్కడపెట్టి, క్రింద కూర్చుని భయంతో కళ్లు మూసుకున్నాడు. ఆ ఏరు పారుతోన్న శబ్దంవినేసరికి మరింత భయమేసింది ఒళ్ళంతా చెమటలు పోసింది. గొంతారి పోయింది. చచ్చిపోతానేమో అనుకున్నాడు. అతనికి భయం విపరీతమయిపోయి "అమ్మా" అని కేకవేసి గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

"పాపం ఎవరైనా అలావస్తే ఎంత బావుండును" బాబుసానుభూతి.

"ఏయ్! ఏమిటూ కేకలూ?" అనే మాట వినేసరికి కళ్ళు తెరిచాడు. నల్లని ముసుగులు వేసుకుని నలుగురు మనుషులు కన్పించారు. అతను భయంతో వణికిపోయాడు. "నీ దగ్గర ఏమేమున్నాయో మర్యాదగా తీసి ఇక్కడపెట్టు" అన్నారు. ఇతనేమీ కదల్లేదు. వీళ్ళు నలుగురూ జేబులన్నీ వెతికి పర్సూ, రిస్టువాచీ, పార్కర్ పెన్నూ, ఉంగరం తీసుకుని వెళ్ళిపోయారు. ఆ అబ్బాయి బొమ్మలా అలా చూస్తూ వుండిపోయాడు."

"అవును. నలుగురు మనుషుల్తో ఒక్కడు పోట్లాడ గలడా? అయినా ఆ దొంగలు నరకానికి పోతారులే నాన్నా!" నాన్న మీద జాలి చూపించేసింది అమ్మలు. నాన్నకు బలే నవ్వొచ్చింది.

"ఈ దొంగలు ఇలా వెళ్ళారో లేదో మళ్ళీ మనుషులు వస్తోన్న అలికిడయింది. అతను కదల్లేదు. చేతిలో లాంతరుతో వాళ్ళు దగ్గరకు వచ్చారు. ఇతనికంటే ముందు బయలుదేరిన రైతులే వాళ్ళు ఇతని అవస్థచూచి చన్నీటితో మొగం తుడిచి నోట్లో నీళ్లు పోశారు. అప్పుడు కొంత శక్తి, ధైర్యం వచ్చి లేచి అంతా చెప్పాడు వాళ్ళు ఛాలావిచారించి "మేము రామయ్యగారి బంగళాలో ఆగాం లేకపోతే ఈ సరికి పట్నం వెళ్ళిపోయే వాళ్ళమే" నన్నారు. అందరూ కలిసి మెల్లగా పట్నం వచ్చారు. అబ్బాయిని ఇంటి దగ్గర విడిచి వాళ్ళు వెళ్లిపోయారు. ఇంటికివచ్చి స్నానం చేసి, భోజనం చేసి జరిగిన సంగతంతా అమ్మా నాన్నకు చెప్పాడబ్బాయి. వాళ్లమ్మ ఇదంతా విని రాగాలు పెట్టుకుంటూ మిరపకాయలు, వుప్పు తెచ్చి దృష్టి తీసి పారేసింది."

"అంతేనా నాన్నా!"

"అబ్బే! అప్పుడేనా? ఇంకా వుంది. మర్నాడు అబ్బాయితో కలిసి వచ్చిన రైతులు వచ్చారు. "మాకు తగువొచ్చింది అది మీరు తీర్చాలి." అన్నాడొక రైతు.

"ఏమి టాతగువు?" అడిగాడబ్బాయి.

అప్పుడారైతు చెప్పాడు: నేను సరదాకి రంగడికిరూపాయి దాచాను. వాడు వెదుకుతూంటే ఏమీ ఎరగనట్టూరుకున్నాను వాడిని గాబరా పెట్టి ఏడిపించి యిచ్చాను. నేను రూపాయి ఇవ్వగానే వాడు 'దొంగతనంకూడా మొదలెట్టావన్నమాట' అని మండిపోయాడు. సరదాకి అలా చేశానని చెప్పినా వాడూరుకోలేదు. మీరే చెప్పండి నా తప్పేమైనా ఉందేమో?"

అప్పుడా అబ్బాయి నవ్వుతూ 'ఓస్! ఈమాత్రందానికే యింత గొడవా? సరదాకి దాచాడు ఇచ్చేశాడు. ఇందులో రూపాయి పోలేదు కనుక దొంగల్లేరు' అన్నాడు.

'తగువు విప్పినందుకు మీ ఋణం వుంచుకోములెండి' అంటూ ఒక మూట ఇచ్చారురైతులు. అబ్బాయి విప్పిచూచే సరికి అందులో రాత్రి పోయిన పర్సు, రిస్టువాచి, పెన్ను, వుంగరం వున్నాయి."

"వీళ్ల దగ్గర కెల్లా వచ్చాయి నాన్నా!" అన్నారు అమ్మలూ, బాబూ ఒక్కసారిగా.

"వినండి. 'ఇవి మీ కెలా దొరికాయని' అడిగాడబ్బాయి ఆశ్చర్యంగా.

"దొరకడ మేమిటండి. రాత్రి వచ్చిన దొంగలం మేమే అయితే. సరదాకి మిమ్మల్ని తమాషా చేశాం మరేమీ అనుకోకండి." అన్నాడు ఒక రైతు.

"మీ వస్తువులు పోలేదు కనుక మేము దొంగలం కాము" అన్నాడింకొకడు. తగువు ఎందుకు విప్పించారో బోధపడిందబ్బాయికి. ఇంక వాళ్ల నేమనడానికి తోచక రాత్రి ప్రవర్తన జ్ఞాపకంవచ్చి నవ్వేశాడు. రైతులు, అబ్బాయివాళ్ళ నాన్న

"చూశారా, చుప్పనాతు లిద్దరి పని?"

"తాయిలమోయ్ తాయిలము
హోయిహోయి తాయిలము
ఎవ్వరికీ ఒక్క పిసరు
ఇవ్వనంటె ఇవ్వనుగా!"



"అక్కా యీ చూశావా
ఒక్కముక్క పెట్టవటా!"

* * *

"ఎలాగైన మనమూ తా
యిలాన్నెగిరి కొడద మా?"



"చూశారా చూశారా
చుప్పనాతు లిద్దరి పని!
నంగనాచులల్లె వచ్చి
దొంగ దెబ్బ తీసినారు"

★

ముఖ్యఫొటో: పవల కృష్ణకుమార్,
మొదటిఫొటో, మూడవఫొటో:
—శ్రీపాద వెంకన్న.

★



అందరూ నవ్వేశారు."నాన్న పూ ర్తి చేసి ఫూపిరిపీల్చాడు.

"బలే. బలే. చాలా బావుంది నాన్నా!" అంటూ అమ్మలు చప్పట్లు కొట్టింది.

"ఆ రైతులు ఎంత తమాషా చేశారునాన్నా! ఇంతకీ ఆఅబ్బాయి పిరికివాడు కాబట్టి తెలుసుకోలేక పోయాడు" అన్నాడు బాబు.

ఇంతలో కిండంతా పనిముగించుకొని, తలుపులు వేసుకుని అమ్మ డాబామీదకువచ్చింది. ఇంకో మంచం మీద కూలబడుతూ

"బాబూ, అమ్మలూ ఆపిరికబ్బాయి ఎవరో తెలుసునా?" అంది. ఇద్దరూ వచ్చి అమ్మపక్కలో చేరారు.

"అదేమిటమ్మా! కథలో మనుషులు నిజంగా వుంటారేమిటి?" అన్నాడు బాబు కళ్ళుపెద్దవిచేసి.

"నిజంగావున్న మనుషులే కథలో వుంటార్రా!" అంది అమ్మ.

"మరిచెప్పమ్మా!ఆ పిరికబ్బాయి ఎవరమ్మా?" అంది అమ్మలు

"మీ నాన్నగారే నమ్మా!" అంది అమ్మ నాన్నవైపుచూచి నవ్వుతూ.

"బలే బలే.నాన్నేనా? నిజమేనా నాన్నా!" అంది నాన్ననుచూచి.

"అమ్మపూరికేఅలా చెవుతోంది. నాన్న అలాంటి వాడు కాడు" నాన్నను వెనకేసుకొచ్చాడుబాబు.

"అలాంటి వాడుకాడేం? నాన్న పిరికబ్బాయి నువ్వూ పిరికివాడివే!" బాబుని వెక్కిరించిం దమ్మలు.

'నువ్వే పిరికిదానివి. నేనేం

(54-వ పేజీ చూడండి)

ప్రత్యుపకారం

ఒకప్పుడు వెనిస్ దేశానికీ, టర్కీ దేశానికీ మధ్య పెద్ద యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో ఎందరో టర్కీ దేశస్థులు వెనిషియన్ల చేతుల్లో పడ్డారు. అటువంటి వాళ్లల్లో హామెట్ ఒకడు. వెనిషియన్లు చాలామంది తుర్కీ దేశస్థులని బానిసలుగా అమ్మేశారు. పోతే, హామెట్ ఒక్కడు మిగిలిపోయాడు. బేరం వచ్చినప్పుడు అమ్మవచ్చునని హామెట్‌ని ఒక కొట్లో పడేశారు ఖైదీగా!

హామెట్ ఉంటున్న కొట్టు పక్కనే పెద్దమేడలో 'ఫ్రాన్సిస్కో' అనే ధనవంతుడు ఉంటున్నాడు. అతనికి ఒక్కడే కొడుకు. ఆ కుర్రాడికీ, హామెట్‌కీ ఎలాగో స్నేహం కలిసింది.

ఆ కుర్రాడికి హామెట్ అంటే పంచప్రాణాలూను. రోజూ సాయంత్రంపూట వచ్చి ఇనప ఊచలదగ్గర నుంచునేవాడు కుర్రాడు. హామెట్ కూడా అక్కడకు వచ్చేవాడు.

హామెట్‌ని కుర్రాడు ఏవేవో అడిగేవాడు, ఎన్నెన్నో ప్రశ్నలు వేసేవాడు. హామెట్ అన్నింటికీ విసుక్కోకుండా సమాధానం చెప్పేవాడు. వాళ్ళిద్దరికీ మధ్య ఇనప ఊచలున్నా, హృదయాలు మాత్రం ఏకమయ్యాయి.

ఇద్దరూ ఎంతోసేపు అవీ, ఇవీ మాటాడుకునేవాళ్లు. ఆ కుర్రాడు హామెట్‌కి తనదగ్గరవున్న చాక్లెట్లూ, పిప్పరమెంట్లూ ఇచ్చేవాడు. అంతేగాకుండా వాటిని బలవంతాన, మారంచేసి హామెట్ చేత తినిపించేవాడు.

ఆకుర్రాడికి హామెట్ ఎప్పుడూ అలా విచారంగా ఎందుకుఉంటాడో అర్థంకాలేదు. తనతోవున్న నాలుగు ఘడియలూ సంతోషంగామాట్లాడుతాడు. కాని, తర్వాత విచారంగా వెళ్ళి గడ్డిలో కూచుంటాడు.

పిల్లా సుబ్బారావుశాస్త్రి

ఒకనాడాకుర్రాడు తండ్రి దగ్గరకు వెళ్ళి-"నాన్నా! మన తోట దగ్గరే...ఒక తుర్కీ ఆయన ఉన్నాడు. అతను చాలా మంచివాడు. నాకేం ... మంచి మంచి కబుర్లూ, కథలూ చెబుతాడు. కానీ, ఆయనెప్పుడూ విచారంగావుంటాడు. ఎందుకునాన్నా?" అని అడిగాడు.

"ఏమో...పాపం...!"అన్నాడు, మరేదో ఆలోచిస్తూ ఫ్రాన్సిస్కో.

"అతని విచారం పోగొట్టవూ?" అని అడిగాడు కుర్రాడు. "సరేలే!" అని పంపివేశాడు కుర్రాణ్ణి ఫ్రాన్సిస్కో.

ఆ కుర్రాడు తండ్రి ఆ విషయమై శ్రద్ధ తీసుకోకపోగా మళ్లీ వెళ్లి జ్ఞప్తికితెచ్చాడు తండ్రికి-

"అతను మంచివాడు నాన్నా! నువ్వువచ్చి అతని విచారం పోగొట్టకుంటే వీల్లేదు! రా!!" అని ఫ్రాన్సిస్కోని బలవంతం చేశాడు కుర్రాడు.

ఫ్రాన్సిస్కో కొడుకు మాటని తోసెయ్యలేక కుర్రాడితో హామెట్ ఉండేచోటుకు వచ్చాడు.

"ఇతనే...నాన్నా హామెట్!" అన్నాడు కుర్రాడు.

"హామెట్! నువ్వెప్పుడూ విచారంగా ఉంటావటగా...! కారణం...?"అని అడిగాడు ఫ్రాన్సిస్కో.

"విచారం గాకపోతే నాలాటి అభాగ్యుడికి సంతోషం ఎక్కణ్ణుంచి వస్తుందీ?...స్వాతంత్ర్యం లేక శత్రుదేశంలో ఖైదీగా ఉన్నాను. బేరం వస్తే బానిసగా అమ్ముడుబోతాను. నా అన్నవాళ్లెవ్వరూ లేరు! వేళకు తిండిలేదు, కంటినిండ నిద్రఉండదు. భవిష్యత్తు అయినా బాగుంటుందని తృప్తిపడేందుకయినా అవకాశాలు లేవు సంతోషం ఎక్కడిదీ?..." అని అడిగాడు హామెట్.

"మరి, మీటర్కీ దేశస్థులు, మా వెనిషియన్లని ఎందర్నిలా బాధపెట్టడంలేదు! వాళ్ళ గురించేమంటావ్?" అని అడిగాడు ఫ్రాన్సిస్కో.

"నా దేశస్థులు చేసిన దానికి నేనా బాధ్యుణ్ని! అందుకు నేనా కారకుణ్ణి!! అలాఐతే, మీ దేశస్థులు చేసిన అన్యాయాలకీ, దుర్మార్గాలకీ...మీరే బాధ్యులా...? మీరే

కారకులా??" అని అన్నాడు హామెట్. మళ్ళీ హామెట్టే అన్నాడు—

"నా విషయం నేచెబుతున్నా! నాలాటి మానవుణ్ని నాకు బాని సగా చేసుకుందామని ఎప్పుడూ అనుకోలేదు. మీ దేశంలో ఉన్న ధనం దోచుకోవాలన్న ఆశ అంత కంటేలేదు—ఐనా భగవంతుడు చేసినదానికి విచారించనఖ్ఖర్లేదు" అని.

"హామెట్! నువ్వు మంచివాడివని అబ్బాయిచెబితే వచ్చాను. నీ మంచితనాన్ని తెలుసుకున్నాను కొంతవరకూ! నీకేం కావాలో చెప్పు!" అన్నాడు ఫ్రాన్సిస్కో.

"ఏ దేశస్థుడయినా కోరేది... స్వాతంత్ర్యం. ఎవరయినా తమ దేశంలోఉండాలని కాంక్షిస్తారు..." అన్నాడు హామెట్ కుర్రాడితల నిమురుతూ.

"ఐతే, నువ్వోపని చెయ్యాలి!" అన్నాడు ఫ్రాన్సిస్కో.

"ఏమిటది?" అని సూటిగా, ఆశగా ఫ్రాన్సిస్కో కళ్ళల్లోకి చూశాడు హామెట్.

"నిన్ను నే విడిపిస్తాను. ఐతే, నా శత్రువు ఒకడు ఉన్నాడు. వాణ్ని నువ్వు ఈరాత్రే హాం మార్చాలి!" అన్నాడు ఫ్రాన్సిస్కో

హామెట్ ఉగ్రుడయ్యాడు... "ఛీ..." అని చీదరించుకున్నాడు. "ఇదేనా ... మీరు చేసే ఉపకారం? ... ఇటువంటిపనిని ... మీరు మీ "వెనిస్" నంతా ధారపోసినా చెయ్యను. మీ ఉపకారం అఖ్ఖర్లేదు! ... వెళ్ళండి!! నేనిలా ఈఖైదులో మగ్గినశిస్తా... వెళ్ళండి!" అన్నాడు హామెట్.

"సెబాస్...హామెట్! అదీ... మానవత్వం అంటే...! మంచి అంటే అదే! నువ్వు నిజంగా చాలా మంచివాడివి. నీ కోరికని తీర్చాలనుకున్నాను. ఒక్క మారు నిన్ను పరీక్షించాను! పరీక్షలో నెగ్గావు. ఇవాళనే నిన్ను నీదేశం పంపిస్తాను. పద...! నీ అధికారికి రుసుం చెల్లిద్దాం!" అన్నాడు ఫ్రాన్సిస్కో.

"మీ కెంతయినా కృతజ్ఞుణ్ని! ఆవేశంలో అన్నమాటలకి క్షమించండి...!నా విడుదలకి ఈ చిరంజీవే కారణం! ఈ చిరంజీవి...చిరంజీవిగావాలి!!" అని కుర్రాణ్ని ఎత్తుకొని ముద్దుపెట్టుకున్నాడు

ఫ్రాన్సిస్కో హామెట్ కి కొంత డబ్బిచ్చి, టర్కీ వెళ్ళే నావమీద ఎక్కించేశాడు. హామెట్ కుర్రాణ్ని విడిచిపెట్టలేక విడిచి వెళ్లేడు. కుర్రాడు వెళ్లే హామెట్ కి కన్నీళ్ళతో "టాటా" చెప్పేడు.

2

కొద్దిరోజులతర్వాత ఒక అర్థరాత్రి అకస్మాత్తునా ఫ్రాన్సిస్కో మేడకు నిప్పు అంటుకుంది. అంతా నిద్రలో ఉన్నారు. ఫ్రాన్సిస్కో అరుపులకీ, మిగతా వారి గోలకీ అంతా నిద్రలోంచి లేచేసరికి మేడ చాలావరకూ కాలిపోయింది.

ఫ్రాన్సిస్కో కొడుకు మేడలోనే ఉండిపోయాడని తెలిసింది. వెంటనే ఫ్రాన్సిస్కో మేడవైపుకు పరిగెత్తాడు. కానీ, నలుగురూ కలిసి అతణ్ణి పట్టుకున్నారు. మంటలు బాగా పైకి ఎగసినయ్.

"నా బాబుని తీసుకురండి...! ఎవరయినాసరే...నా ఆస్తి నంతా ఇచ్చేస్తాను—" అని గగ్గోలు

(53 వ పేజీ చూడండి)



30

శత్రునౌక ముంపు

ఆ నౌకపేరు వినగానే మాహృదయాలన్నీ ఒక్కసారిగా విచార సాగరంలో మునిగిపోయాయి. అది ఫ్రాన్సు దేశస్థుల నౌక. కెప్టెన్ నీమో ఆ నౌకకేసి చూస్తూంటే అతని నేత్రాలు చింతనిప్పుల్లా ఎర్రబడి పోయాయి. ఏదో ద్వేషం అతనికళ్ళలో తోకతొక్కిన తాచులా బుసకొట్టింది.

క్రమంగా మా జలాంతర్గామి సముద్రంమీదికి తేలింది. సముద్రం అట్టడుగున మాకు కనిపించిన ఓడ క్రమంగా అంతర్ధాన మైపోయింది. దూరదూరంగా మాకొక ఓడ కనిపించింది సరిగా అదే సమయంలో ఒక ఫిరంగిమోత వినిపించింది నేను కెప్టెన్ నీమో కేసిచూచాను. అతడు నాకేమీ సమాధానం చెప్పలేదు.

అంతలో నెడ్‌లాండు, కొన్సెలు అక్కడికి వచ్చారు.

"ఏమిటా చప్పుడు?"

ఆ ఇద్దరికేసి చూసి అడిగాను.

"అది ఫిరంగి గుండు మోత!" అన్నాడు నెడ్‌లాండ్.

అంతలో మాకెదురుగా కనిపించిన నౌక మాకు బాగా దగ్గిరిగా వచ్చింది.

అనువాదం: "వినాయక"

"ఆ ఓడ సంగతి ఏమైనా తెలిసిందా?" నెడ్‌లాండ్‌తో అన్నాను.

"దాని ధోరణి చూస్తే ఏదో యుద్ధ నౌకలా కనిపిస్తూంది."

"అది మన జలాంతర్గామి నేమి చెయ్యగలదు?" అన్నాడుకొన్సెలు.

"అది ఏ దేశపు యుద్ధనౌకో చెప్పగలవా?" అని నెడ్‌లాండ్‌తో అన్నాను.

"ఆ సంగతి తెలియడం లేదు గాని అది ఏదో ఒక దేశపు యుద్ధ నౌక అయి ఉండవచ్చునని అనుకుంటున్నాను"

అంతలో ఆ యుద్ధనౌక మాకు దగ్గరిగా వచ్చేసింది. నెడ్‌లాండ్ అన్నాడు:

"అయ్యా! ఆ యుద్ధ నౌక మనకింకా బాగా దగ్గిరగా వచ్చేసిందంటే నేను కళ్లుమూసుకుని సముద్రంలో ఉరికేస్తాను. మీరుకూడా నా వెంటపడి రావడం మంచిది."

నేనతనిమాటలకు సమాధానం చెప్పకుండా అలాగే ఆ యుద్ధనౌక వైపు చూస్తూ అది ఏ దేశపు నౌక అయినా మాకు కొంచెం ఆశ్రయం ఇవ్వకపోదని అనుకొన్నాను.

అంతలో మరొక ఫిరంగి గుండు పేలింది.

"అదిగో వాళ్లు మనమీదికి గురిపెట్టి ఫిరంగులు పేల్చేస్తున్నారు."

జరిగిన కథ:—

అది 1866 వ సంవత్సరం ప్రారంభం. సాగర గర్భంలో బ్రహ్మాండమైన జలజంతువేదో కనిపించిందనే వార్త ప్రపంచప్రజలను విభ్రాంతులను చేసింది. సముద్రంలో ప్రయాణంచేసే నౌకలకది ఇట్టే కనిపించి ఇట్టే మాయమయ్యేది. అమెరికా ప్రభుత్వం అబ్రహాం లింకన్ అనే యుద్ధనౌకను ఆ జలజంతువును వేటాడడానికి నియమించారు. అమెరికా ప్రభుత్వ నౌకాశాఖా కార్యదర్శి హాబ్సన్ ఫ్రెంచి ప్రకృతిశాస్త్రపరిశోధకుడు ప్రొఫెసర్ అరోనాను ఈ విజ్ఞానయాత్రలో పాల్గొనవలసిందని ప్రార్థిస్తాడు. అతడు వెంటనే దాని కంగీకరించి తన పరిచారకుడు కౌన్సిల్‌తో సహా ఓడ ఎక్కుతాడు. అబ్రహామ్‌లింకన్ క్రమక్రమంగా పసిఫిక్ ఆమహాసముద్రంలో ప్రవేశిస్తుంది. అది అలాగ కొంతదూరం ప్రయాణం చేసేసరికి కొంతదూరంలో సముద్రతరంగాలమీద ఒక పెద్ద వెలుగుకనిపించింది. ఆ వెలుగు ఒక పెద్ద జలచరానికి సంబంధించినదై ఉండాలని నౌకాధికారులంతా ఊహించారు. నావ దానిదగ్గిరికి పట్టించి దానిమీద ఫిరంగిగుళ్ళవర్షం కురిపించారు. అబ్రహామ్‌లింకన్ తరవాత జరిగిన పోరాటంలో ఎందుకు పనికిరానిదై పోతుంది. ప్రొఫెసర్ అరోనా, కౌన్సిల్ నెడ్‌లాండులతో కలిసి ఒక జలాంతర్గామిలో ప్రవేశిస్తాడు. కొంతసేపటికి ఓడనావికులు వారికి సుష్టుగా భోజనం పెడతారు. కెప్టెన్‌నీమో ఇక ఆ ఓడలోనించి ఎవరు బైటపడలేరని చెప్పి ప్రొఫెసరు అరోనాకు జలాంతరామి యంత్రాల రహస్యాలు తెలియజేస్తాడు. కెప్టెన్ నీమో జలాంతర్గామి నడిపించేపద్ధతి అంతా ప్రొఫెసర్ అరోనాకు తెలియజేస్తాడు. పిమ్మట జలాంతర్గామి కిరువైపులా తెరుచుకున్న అద్దాలలోనించి అద్భుతమైన సాగరగర్భ జలచరాలు కనిపిస్తాయి. ఆ తరవాత జలాంతర్గామి సాగరగర్భంలోని క్రెస్పో ద్వీపానికి బయలుదేరుతుంది. జలాంతర్గామి వానికోరో ద్వీపంమీదుగావెళ్ళి గిలోబ్వాద్వీపానికి సమీపంలో నిలబడుతుంది. అరోనా అనుచరులతో కలిసి ఆ ద్వీపంలో ప్రవేశిస్తాడు. ముగ్గురు గిలోబ్వా ద్వీపంలో వేటముగించుకొనివస్తూండగా హఠాత్తుగా ఒకరాయి వారిదగర పడుతుంది. పిమ్మట కెప్టెన్ నీమో విద్యుదాయుధంతో ఆటవికుల నందరినీ హడలగొట్టి వేస్తాడు. క్రమంగా జలాంతర్గామి పగడాలదీవి జేరుకుంటుంది. చనిపోయిన నావికుని కొకనికి అక్కడ సమాధి ఏర్పాటుచేస్తారు. కెప్టెన్ నీమో మన్నారు సింధుశాఖలో ఒక పెద్దముత్యం సంపాదిస్తాడు. పిమ్మట ఎంతో చాకచక్యంతో ఒక బెస్తవాని ప్రాణాలు సంరక్షిస్తాడు. పిమ్మట జలాంతర్గామి మధ్యధరాసముద్రందాటి అట్లాంటిక్ మహాసముద్రంలో ప్రవేశిసుంది తరవాత జలాంతర్గామి నావికులు విగో అఖాతంలో మునిగి వెండిబంగారాలపోగులు సేకరిస్తారు. కెప్టెన్‌నీమో ప్రొఫెసర్ అరోనాకుఅట్లాంటిన్‌ఖండం చూపిస్తాడు. జలాంతరామి సముద్రం అట్టడుగున ఉన్న బొగ్గుగనులలోనించి బొగ్గు నింపుకుంటుంది క్రమంగా దుర్భేద్యమైన మంచుకొండ అడుగునించి ప్రయాణంచేసి దక్షిణధ్రువం సమీపిస్తుంది తరవాత కెప్టెన్ నీమో దక్షిణధ్రువం కనిపెట్టి అక్కడ తన జండా ఎగరవేస్తాడు. జలాంతర్గామి దక్షిణధ్రువం దగ్గిరినించి మళ్ళీ తిరుగుప్రయాణం సాగిస్తుంది. అష్టపాద జంతువులతో చేసిన పోరాటంలో జలాంతర్గామి నావికు డొకడు మరణిస్తాడు. తరవాత జలాంతర్గామి గల్ఫ్‌స్ట్రీమ్‌లో ప్రయాణం సాగిస్తుంది.

అన్నా నెంతో కంగారు పడుతూ.

బహుశః వాళ్లు కెప్టెన్ ఫరాగూ ఓడ మునిగిపోయిన విషయం విని ఉంటారనీ ఆ ముంచివేసినది ఏదో జలజంతువు కాదన్న విషయం కూడా గుర్తించి ఉంటారనీ అనుకొన్నాను. మళ్లీ ఫిరంగిగుళ్లు మా చుట్టూ పడడం మొదలుపెట్టాయి.

నెడ్‌లాండెంతో ఆత్రంగా నావైపు చూశాడు:

"మనం తప్పించుకు పారిపోవడానికిదే తగిన సమయం. మనం వాళ్ళ కేదైనా సంజ్ఞచెయ్యడం మంచిది."

అని చెప్పి నెడ్‌లాండ్ తన జేబు గమాలు పైకితీసి అది అటు ఇటు ఆడించాడు. అంతలో కెప్టెన్‌నీమో అక్కడికివచ్చి, నెడ్‌లాండు నొక్క తోపు తోశాడు:

"నేను యుద్ధం ప్రారంభించే ముందు నీ పెడరెక్కలు విరిచి కట్టెయ్యమన్నావా?" అని విసుగ్గా కసురుకున్నాడు. కెప్టెన్ నీమో కళ్లు నిప్పులు గక్కుతున్నాయి

అంతలోనే ఇంకొక ఫిరంగి రవ్వీమని మాజలాంతర్గామికి తగిలింది.

"మీరంతా తొందరగా లోపలికి వెళ్లిపోండి!"

అని కెప్టెన్ నీమో ఖచ్చితంగా మాకందరికీ ఆజ్ఞాపించాడు.

"మీరాఓడతో యుద్ధం చెయ్యబోతున్నారా?" అని అడిగాను.

"యుద్ధం చెయ్యడమేమిటి? దాన్ని ముంచివేస్తున్నాను"

"మీరు దాన్ని ముంచి వెయ్యడానికి వీల్లేదు"

"నేను దాన్ని ముంచితీర్తాను. ముందుగా వాళ్ళే మనమీద ఫిరంగులు పేల్చారు. దాని ఫలితం వాళ్ళనుభవించి తీరవలసిందే."

"అది ఏ దేశపు ఓడ?"

"మీకు తెలియదా? తెలియక పోతే మరీమంచిది. తొందరగా లోపలికి వెళ్ళిపోండి!"

మాకతని ఆజ్ఞప్రకారం నడుచుకోక తప్పలేదు.

మేమంతా లోపలికి వెళ్ళిపోయాము. అంతలో ఇంకొకఫిరంగి గుండువచ్చి మా ఓడకి తగిలింది.

"పేల్చండి! మీకందరికీ ఆయుర్దాయం మూడింది!" అన్నాడు కెప్టెన్ నీమో!

ఒళ్ళెరగని కోపంతో అంటున్న అతని మాటలు జలాంతర్గామి లోపల ఉన్న మాకుకూడా వినిపించాయి.

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

సాయంత్రం 4 గంటలయింది. లోలోపల సురక్షితంగా ఉన్నా నన్న మాటేగాని నాకేమీ తోచడం లేదు.

నేను మళ్లీ జలాంతర్గామి టాపు మీాదికి వెళ్ళి కేప్టెన్ నీమోతో ఆ ఓడను ముంచివెయ్యడం అన్యాయమని సణిగాను. కేప్టెన్ నీమో నామీాద విరుచుకుపడ్డాడు :

"ఆ న్యాయాన్యాయాలేవో నాకు తెలియకపోలేదు. నే ననుభవించిన యమయాతనలు మీాకేం తెలుసును? నాభార్య, పిల్లలు, తల్లి తండ్రీ అందరు శత్రువుల హస్తాల్లో పడి నశించిపోయారు! ఇక ఈ సంగతి నాతో మాట్లాడకండి!"

ఇక నేతనితో మాట్లాడితే లాభం లేదనే నిశ్చయానికి వచ్చేశాను. నెడ్‌లాండ్, కౌన్సెలు ఉన్న చోటికి వెళ్లాను:

"మన మింక యీ ఓడలోనించి తప్పించుకుపోయి తీరాలి!" అన్నాను.

"ఇంతకీ అది ఏ దేశపు ఓడ?" అన్నాడు నెడ్‌లాండ్.

"ఏమో నాకు తెలియదు గాని తెల్లవారేసరికి అది మునిగిపోతుంది. దానిపని అయిపోయింది." అన్నాను.

బాగా చీకటిపడింది. చుట్టూరా గాఢాంధకారం కమ్ముకుంది. జలాంతర్గామి ఇంకా నీటిమీాదే తేలుతూ వుంది.

నా అనుచరులు, నేను ఆ యుద్ధనౌక మాకు ఇంకా బాగా దగ్గరగా రాగానే జలాంతర్గామిలోనించి పారిపోయి తీరాలని నిశ్చయించుకున్నాము. ఇంకా కొంత సేపటిలో చంద్రోదయం కాబోతుంది. ఆ వెన్నెలలో మేము నీటిలో తేలుతూన్న సంగతి యుద్ధనౌకలో జనం కనిపెట్టవచ్చును. అందుచేతనే మేమంతా ఆ సమయంలో జలాంతర్గామిలోనించి పారిపోవాలనినిశ్చయించాము.

క్రమక్రమంగా తెల్లవారుతూంది. నెడ్‌లాండ్ సముద్రంలోకి దూకాలని అనుక్షణము ఉవ్విళ్ళూరుతూనే ఉన్నాడు. నే నతన్ని తొందర పడవద్దని ఆపుజేశాను. జలాంతర్గామికీ, యుద్ధనౌకకు పోరాటం జరిగే సమయంలో తప్పించుకు పారిపోవడం బాగా తేలికౌతుందని నచ్చజెప్పాను.

ఇంకా బాగా తెల్లవారలేదు. కెప్టెన్ నీమో జలాంతర్గామి టాపు మీాద నిలబడి బాగా పరిశీలనగా యుద్ధనౌకకేసి చూస్తున్నాడు. జలాంతర్గామిలోని నావికులు లోలోపల అట్టుడికిపోయిన ట్టుడికిపోతున్నారు.

శత్రు యుద్ధనౌక మా జలాంతర్గామి కించుమించుగా రెండుమైళ్ళ దూరంలో నిలబడింది.

6 గంటలు కొట్టారు. నేను కెప్టెన్ నీమోపక్కనే నిలబడ్డాను. అయినా కెప్టెన్ నీమో నాతో మాట్లాడే ధోరణి కనబడలేదు.

యుద్ధనౌక ఇంకా అరమైలు దూరం మావైపుగా ప్రయాణం సాగించింది.

అప్పటికి బాగా తెల్లవారింది. యుద్ధనౌక మామీాద మళ్ళీ అగ్నివర్షం కురిపించడం మొదలుపెట్టింది.

నేనా జలాంతర్గామి లోపలికి వెళ్లి నెడ్‌లాండ్‌ను, కౌన్సెలును గట్టిగా హెచ్చరించాను:

"మనం కళ్లు మూసుకుని ముందుకురికితే మనం అదృష్టంపండి అంతా బతికి బయటపడవచ్చును"

నెడ్‌లాండ్ ముందు కురికి వెయ్యాలని సిద్ధంగా నిలుచున్నాడు. కౌన్సెలుకూడా ఎక్కడా చెక్కు చెదరకుండా నిలబడ్డాడు

అంతలో నీరు లోపలికి ప్రవహిస్తున్న ధ్వని వినిపించింది. కొన్ని నిమిషాల తరవాత జలాంతర్గామి నెమ్మదిగా సముద్రంలోపల మునిగిపోయింది

నా కది అంతా బోధపడిపోయింది. జలాంతర్గామి యుద్ధనౌక ఎదట నిలబడి పోరాటం సాగించడాని కిష్టంలేక సముద్రంలోపల మునిగిపోయిందనీ లోపల మునిగి యుద్ధనౌకపై దెబ్బతియ్యవచ్చనీ ఊహించాను.

మా ప్రయత్నాలన్నీ మంటగలిసిపోయాయి. మేమంతా మళ్ళీ జలాంతర్గామి ఖైదులో చిక్కుకుపోయాము. అందరం కలిసి నాగది

లోకి వచ్చాము. ఊపిరి విడవకుండా ముందేమి జరుగుతుందో అని హడిలి పోతున్నాము. నేను ఒళ్ళంతా చెవులు చేసుకుని ఎంతో ఆత్రంగా వింటూ నిలబడ్డాను

క్రమంగా జలాంతర్గామి వేగం ఎక్కువైపోయింది. ఆ వేగంతో జలాంతర్గామి అంతా గజగజా వణికిపోయింది.

ఒక్కక్షణంలో మాకు చాలా దగ్గరగా ఒక పెద్ద కరుణాక్రందనం వినబడింది. ఏదో పెద్ద ఆఘాతం తగిలిట్టుగా చప్పుడైంది. జలాంతర్గామి మా శత్రుయుద్ధనౌక నొక్క దెబ్బతో రెండు ముక్కలుగా చీల్చివేసింది. నేనింక నిలబడలేక పోయాను. పిచ్చెక్కిన వాడిలా కెప్టెన్ నీమోదగ్గరకి పరిగెత్తాను.

అతడలాగే నదురు బెదురు లేకుండా నిలబడిఉన్నాడు ఆయుద్ధ నౌక గబగబా మునిగిపోతూంది. దానితోబాటు మా జలాంతర్గామి కూడా క్రమక్రమంగా కిందికి దిగి పోతూంది

నా కా హృదయవిదారక దృశ్యం చూస్తూంటే ఒళ్ళంతా పక్షవాతం కమ్ముకుంటూన్నట్లనిపించింది.

యుద్ధనౌకలోనించి ఒక్కమారుగా ఒక పెద్ద పేలుడు ధ్వని వినిపించింది. ఆ దెబ్బతో అది పూర్తిగా సముద్రంలో మునిగి పోతుంది.

కెప్టెన్ నీమో కళ్ళలో విద్వేష జ్వాలలలాగే వెలుగుతున్నాయి. అతనికా యుద్ధనౌకపై అంత ద్వేషం ఎందుకో అని నేనలాగే నిర్ఘాంత పోయాను.

కెప్టెన్ నీమో తలుపులు మూయించివేశాడు. తిరిగి తన గది లోకి వెళ్ళిపోయాడు. నేనుకూడా అతని వెనకాలే వెళ్లాను.

కెప్టెన్ నీమో తన గదిలో ఒక పెద్ద బీరువా తెరిచాడు. అతని కెదురుగా ఇద్దరు చిన్నపిల్లలసరసనే నిలబడిన ఒక యువతి చిత్రం కనబడింది. నేనతనికి బాగా దగ్గరగా వెళ్ళకుండా ఇంకా దూరంగానే నిలబడ్డాను. నేనతనిని అనుసరించినట్లు కెప్టెన్ నీమో గ్రహించాడో లేదో!

అతడా చిత్రానికెదురుగా మోకరిల్లి సభక్తికంగా ఏదో గొణుగుకున్నాడు. కొంచెం సేపు ఆకాశంకేసి చూస్తూ ఇంకా ఏదో గొణుగుకొన్నాడు.

వెంటనే లోలోపలనుంచి ఉబుకుబికి వస్తున్న ఆవేశం నిగ్రహించుకోలేక వట్టి పసిపాపలా వెక్కి వెక్కి ఏడ్చాడు.

నే నా యువతి అతనిభార్య కావచ్చుననీ ఆ పిల్లలిద్దరు అతని సంతానం కావచ్చుననీ ఊహించాను. వారంతా ఏదో ఓడప్రమాదంలో మరణించి ఉండవచ్చునని కూడా అనుకొన్నాను. బహుశః అందుచేతనే అతడావిధంగా జలాంతర్గామి నిర్మించి మానవులెవ్వరు చొరరాని సాగరగర్భంలో సంచరిస్తున్నాడని కూడా అనుకొన్నాను. మానవులంటే అతని హృదయంలో అంత ద్వేషం బయలుదేరడానికిదే కారణమేమో! ఎవరు చెప్పగలరు?

కాని తనసహచరులంటే అతని కెంతో ప్రేమ! అష్టపాద జంతువులకు బలియైపోయిన ఆ నావికునిగురించి అత డెంతగానో విచారించాడు. అతని హృదయార్ద్రత అంతా నా కతని దుఃఖంలో స్పష్టంగా ప్రత్యక్షమైంది.

అయినా అతడా యుద్ధనౌక సముద్రగర్భంలో ముంచివేశాడు. నే నెంతగా వద్దన్నా వినలేదు.

దానికి కారణం లేకపోలేదు. ముందుగా ఆ యుద్ధ నౌకే మాపై ఫిరంగిగుళ్ళు ప్రయోగించింది. అది మమ్మల్ని ఎంతగా ఎంతగా ఎదిరించినా నీమో చాలా సేపటిదాకా ఓపిక పట్టాడు.

ఇంక మార్గాంతరం లేక దాన్ని నీటిలో ముంచివేశాడు. అదీ గాక ఆ యుద్ధనౌక జండానుబట్టి అది ఏ దేశపు నౌకో అతనికి తెలిసిపోయింది. బహుశః ఆ యుద్ధనౌక అతని భార్యను, సంతానాన్ని పొట్టబెట్టుకొన్న దేశానికి సంబంధించిన ఓడేనేమో! ఎవరు చెప్పగలరు? అందుచేతనే అతని నేత్రాలలో అంతటి భయంకర విద్వేష జ్వాల ప్రజ్వలించి ఉండవచ్చును. నేమెంత చెప్పినా వినక పోవడానికి కూడా అదే కారణమై ఉండవచ్చును.

ఇదంతా ఆలోచించిన తరవాత నాకు కెప్టెన్ నీమో జాలిలేని కటికి గుండెవాడనడానికి మనసొప్పలేదు.

అతనికి తెలియకుండానే నెమ్మది నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ తిరిగి నా గదిలోకి వెళ్లిపోయాను. ఆనాటి దృశ్యం నేనెన్నడు మరిచి పోలేను.

—ఇంకా ఉంది.

వనితా లోకం



పూతరేకులు చేసే పద్ధతి

కొన్ని పిండి వంటలకి ఎక్కువ వస్తువులు కావలసివుంటుంది. కొన్నిటికి ఓపిక, నేర్పూ అవసరం. పూతరేకులు ఈ రెండో తరగతికి చెందినవి. దీనికి కావలసినవి పావుశేరు బియ్యం, పావుశేరు నెయ్యి. పదిఫలాలు పంచదార, కొద్దిగా ఏలకులు, నున్నటికుండ, చిన్న వెదురుబద్ద.

ముందర, బియ్యాన్ని ఐదుగంటలసేపు నాన బెట్టాలి. తరవాత ఆ బియ్యాన్ని శుభ్రంగా రెండు, మూడుసార్లు కడిగి, నీళ్లుఓడ్చి, పిండిగా దంపుకోవాలి. దంపిన పిండిని కోటిలో వేసి, కొద్దిగా నీళ్లుపోసి మెత్తగా రుబ్బుకోవాలి. చేతితో లేసిన తీగలాసాగే వరకు, అట్టే పల్చగా కాక అట్లపిండిమాదిరిగా తయారవుతుంది.

కట్టెలపొయ్యిలో నిప్పుచేసి, ఆపైన కుండను బోర్లగిలా పెట్టాలి. అంటే కుండ అడుగుభాగం మీదికి వస్తుందన్నమాట. ఈ కుండ పైభాగం చాలా నున్నగావుండాలి. ఏమాత్రంగరుకుగావున్నా రేకుసరిగారాదు.

వెదురుబద్దను ఒకచివర కొద్దిగా చీల్చి, పల్చని బట్టని దానికి కుంచెలా చుట్టుకోవాలి. ఆ కుంచెని నూనెలో ముంచి, కుండపైన నూనెరాయాలి రుబ్బినపిండిని ఒక పళ్ళెంలో పోసుకోవాలి చేతిరుమాలు అంత తెల్లని, పల్చని బట్టను తీసుకోవాలి. బట్ట రెండు కొనలను మన రెండు చేతులతో పట్టుకొని పిండిలో ముంచాలి. పిండితో నున్న ఆ గుడ్డను కుండపై వెనుక నుండి

ద్వివేదు విశాలాక్షి

మనవైపుగా లాగుకోవాలి ఈ లాగడం చాలా త్వరగా చెయ్యాలి. (లేకుంటే గుడ్డ కుండకి అంటుకుపోతుంది) గుడ్డ తీసిన వెంటనే పల్చని కాగితంలా రేకు కుండపై లేస్తుంది. ఇది కుండకి ఏమాత్రం అంటదు. ఈవిధంగా తయారయిన రేకులు ఎన్నిరోజులైనా నిలువ వుంటాయి.

ఇక, ఈ రేకులను పూతచుట్టలుగా చుట్టుకోవడం:

పంచదారను మెత్తగా, పిండిలా నూరుకోవాలి. ఏలకపళ్లను పొడిచేసుకుని అందులో కలుపుకోవాలి. నెయ్యి కరగించుకుని పక్కని అట్టేపెట్టుకోవాలి.

ఒక రెండు బట్టలను తడుపుకుని గట్టిగా నీళ్లు పిండుకుని తెచ్చుకోవాలి ముందర, ఒక బట్టను రెండు మడతలుగా నేలమీద పరచి అందుమీద పూతరేకులను వరసగా పేర్చాలి. తరవాత ఆ దొంతరమీద రెండవ బట్టను కప్పాలి.

రెండు నిముషాలలో రేకుల పెళుసుతనం పోయి మెత్తబడి చుట్టుటకు వీలుగా వుంటాయి. ఒక్కొక్క రేకుకే నెయ్యి రాస్తూ (వెదురుబద్దతో) మూడేసి నాలుగేసి రేకులను దొంతుగా పెట్టుకోవాలి. పైరేకుపై పంచదార చల్లి మడతలుగా చుట్టుకోవాలి. ఈ పూతచుట్టలను చాలరకాలుగా చుట్టుతారు. కొందరు కోలగానూ, కొందరు చదురంగాను, మరికొందరు చిలుక ముడత లాగ అంటే ముక్కోణంగా చుట్టుకుంటారు. తీపి ఎక్కువగా కావలసినవారు ప్రతి రేకుకీ నెయ్యి రాసి పంచదార చల్లుకోవచ్చు. ఏమైనా ఇది ఓపికతో చెయ్యవలసిన పని. ఇద్దరు స్త్రీలుంటే సులువుగా చెయ్యొచ్చు. ★

★ స్త్రీలు - ఉన్నత విద్యావశ్యకత ★


పుతుకుమల్లి సుశీల

పూర్వం రోజుల్లో ఆడవాళ్ళకి చాకలి పద్దు వ్రాయగలిగేంత చదువు వుంటే చాలనుకునేవాళ్లు. పరిస్థితుల మార్పుతో ఆడవాళ్లకి కూడా చదువు అవసరమేనని గుర్తింపబడి బాలికలకు ప్రత్యేక పాఠశాలలు ఏర్పడటంతో స్కూల్ ఫైనల్ వరకూ చదవటం ఆర్థికయిబ్బందులు లేని ఆడపిల్లలందరికీ సాధారణవిషయమైంది. ఆపైన వారిచదువు సాగించేందుకు యీనాడు కూడా ఎక్కువ అనుకూలవాతావరణం కన్పించటం లేదు

స్త్రీల ఉన్నత విద్యాభ్యాసానికి వ్యతిరేకంగా అందరి దృష్టిలోవుండే కారణాలలో ముఖ్యమైనవి రెండు (1) ఆడపిల్లలు పెద్ద చదువులు చదవగానే జీవితంపట్ల అనేకమైన అపోహాలు (False notions) పెంచుకుంటారు. ఇంతేకాక బాలబాలికలు కలిసిచదివే కళాశాలలో యుక్తవయస్సు వచ్చిన ఆడపిల్లలు చెడిపోయేందుకు అవకాశాలు ఎక్కువ. (2) ఎంతచదివినా ఆడపిలలు పెళ్ళిచేసుకుని వంటా వార్పూ చూసుకోవలసిందే. కాని, ఉద్యోగాలుచేసి ఊళ్ళేల నక్కరలేదు. కాబట్టి వృధా వ్యయప్రయాసలతో కూడిన ఉన్నత విద్యాభ్యాసం అనవసరం.

కొంచెం దీర్ఘంగా ఆలోచిస్తేయీరెండు కారణాలూ పునాదిలేనివిగానే కనిపిస్తాయి. మొదటి కారణం తీసుకుందాం. ఆడపిల్లలు హైస్కూలులో చదివినా, కాలేజీలో చదివినా, వారి జీవితమంతా విద్యాసంస్థలలోనే గడవదు. వారానికి ౫, 6 రోజులు, రోజుకి ౫ గంటల కాలం చొప్పున వారి విద్యాలయాల్లో గడుస్తుంది. మిగిలిన కాలమంతా వారి తలిదండ్రుల లేక ఇతర పెద్దల సమక్షంలోనే గడుస్తుంది. కాబట్టి జీవితం పట్ల అపోహాలు, పొరబాటు ఉద్దేశాలు మొదలైన భ్రమ ప్రమాదాలకి గురికాకుండా రక్షించేందుకు సదా పెద్దల పర్యవేక్షణ వుండనే వుంటుంది. ఇక బాలబాలికలు కలిసి చదువుకునే కళాశాలల్లో ఒక్క బాలికలే చెడిపోతారనుకోవటం పొరబాటు. ఆడపిల్లలకి వచ్చే "వయస్సు" మొగపిల్లలకీ వస్తుంది. చెడిపోవటమంటూజరిగితే యిద్దరూ చెడిపోతారుకాని ఒక్కరుకాదు.

కాని ప్రతిరోజూ, ప్రతి క్షణం అన్నిరంగాలలో జరిగే మార్పులు గమనిస్తే, యీ భయం విస్మరించటం అంతకష్టమైన పని



పత్రవలయం

స్త్రీలు - ఉన్నత విద్యావశ్యకత

కాదు. అంతేకాక సృష్టిలో జరిగే వ్యభిచారాలకి, దుష్ప్రవర్తనలకి కాలేజీలే నిలయాలు కావు. ఆడపిల్లలు కాలేజీలో చేరినంతమాత్రాన శీలం పోగొట్టుకుంటారనుకుంటే, మన విశ్వవిద్యాలయాల, విద్యావేత్తల ఆశయాలను, లక్ష్యాలనే సందేహిస్తున్నామన్నమాట...

ఇక రెండవ కారణం: ఉద్యోగం ఎలాగూ చేయాలనేముందు, ఉద్యోగం చేయటంలోని లాభనష్టాలు తెలుసుకోవటం అవసరం. ఇంటిపరిస్థితులు అనుకూలంగా వుండి తగిన ఉద్యోగార్హతలుంటే భార్యాభర్తలిద్దరూ ఉద్యోగం చేసినా తప్పులేదు. భార్య అనారోగ్యంతో బాధపడుతున్నా, లేక చాలామంది పిల్లలు వుండి వారిని చూచుకునేందుకు ఇతరులెవరూ లేకపోయినా, పిల్లలలో ఒకరుగాని, పెద్దవాళ్లెవరైనా గాని రోగగ్రస్తులై సేవచేసేవాళ్లు లేకపోయినా, ఇటువంటి ఏ యితర యిబ్బందులున్నా, స్త్రీలు ఉద్యోగం చేయనక్కరలేదు. ఏ ఆటంకాలు లేనప్పుడు ఉద్యోగం చేయటం ప్రారంభించినా, మధ్యలో ఈ ఇబ్బందులు వస్తే స్త్రీలు ఉద్యోగం మానాలా అనే ప్రశ్న రావచ్చు. అక్కరలేదు. అటువంటప్పుడు అవసరమైనంత కాలం ఉద్యోగానికి సెలవు పెట్టవచ్చు. స్త్రీలే ఎందుకు సేవచేయాలి అంటే అందుకవసరమైన నేర్పు, ఓర్పు సహజంగానే మనలో వున్నాయి కనుక. కాని ఏవిధమైన యిబ్బందులు లేనపుడు స్త్రీలు ఉద్యోగం చేయటం వాంఛనీయమే. భార్యలు ఉద్యోగం చేయటం తమ అప్రయోజకత్వానికి చిహ్నమని భావించే భర్తలుండరని ఆశిద్దాం. ముఖ్యంగా మధ్య తరగతి కుటుంబాల ఆర్థికస్థితి దృష్ట్యా, స్త్రీలు అవకాశం వున్నప్పుడే వీలైనంత ఉన్నత విద్యాభ్యాసం చేసి, సంపాదనార్హతలు ఏర్పరచుకోవటం అత్యావసరం.

సంపాదన అంటే

సంపాదన అంటే కేవలం ఆఫీసుకి వెళ్ళి ఉద్యోగం చేయటమే కాదు. ఇంటి పరిస్థితులుగాని, వారి వారి అభిరుచులుగాని, బయటకు వెళ్ళి ఉద్యోగం చేసేందుకు అనుకూలంగా లేకపోతే, స్త్రీలు యితర విధాలుగా సంపాదించవచ్చు. ఉదాహరణకి, సంగీతం వచ్చినవారు (యీరోజుల్లో శాస్త్రీయ సంగీతం కూడా విశ్వవిద్యాలయాల్లో

పాశ్చాత్యంశమేనని అందరికీ తెలిసిందే) రేడియోలలో గాని, యితరచోట్లగాని గాన సభలు చేయవచ్చు. అలాగే కుట్టు, హిందీ మొదలైనవి తెలిసినవారు స్వయముగా ఇన్‌స్టిట్యూట్స్ (శిక్షణ కేంద్రాలు) నడిపి తోటి స్త్రీలకి సహాయపడవచ్చు. ఇలాగే గౌరవంగా ధనార్జన చేసే పద్ధతులెన్నో వున్నాయి.

స్త్రీ ఉద్యోగం చేస్తే భర్తను, బిడ్డలను, కుటుంబములోని ఇతరవ్యక్తులకు సంబంధించినంతవరకూ తన విధులను సక్రమంగా నిర్వర్తించలేదని కొందరి భయము. ఉదాహరణకి వంటచేయటం. ఇది, వారుచేసే వుద్యోగాలనుబట్టి వీలుంటుంది. స్కూలు టీచరుకి టైమువుంటుంది కనుక వంటచేయగల దనుకుందాం. అదే ఏ డాక్టరో అయితే వీలుండదు. అప్పుడు తప్పనిసరిగా వంటమనిషిని పెట్టుకోవలసివస్తుంది. అంతమాత్రంచేత వారి విధినిర్వహణ సక్రమంగా లేదనలేము. అంతేకాక వారు కుటుంబములో గడిపే కాలము పరిమితమై వుండటంచేత దాని విలువను బాగా గుర్తిస్తారు.

ఒక ప్రశ్న

అయినా ఉద్యోగంచేయని స్త్రీలంతా 24 గంటలలో నిద్రకుపోగా మిగిలిన కాలమంతా తమకుటుంబానికి సేవచేసేందుకే వినియోగిస్తున్నారా? తమ, తమ భర్తల హోదాకీ, అంతస్తుకీ తాము పనిచేయటం తగదని అనుకునే ఎందరో స్త్రీలు అన్ని పనులకూ బయటిమనుష్యులను పిలుస్తారు. అటువంటివారు తమభర్తలకు చేయవలసిన కనీసపు సేవకూడా చేయటంలేదని ఎవ్వరూ అనరు అదే ఉద్యోగంచేసే స్త్రీ తీరికలేక గాని. శ్రమతగ్గించుకునేందుకుగాని పనివాళ్ళను పెట్టుకుంటె ఆమె గృహిణీధర్మాన్ని పూర్తిగా విసర్జించినట్లు బాధపడతారు. "పిల్లల్ని ఎవరిమీదో వదిలి ఆమె సంపాదించకపోతే యేం? ఆవిడ సంపాదించేది పనివాళ్ళకిచ్చేందుకే సరిపోతుంది." యీ విధమైనవిమర్శలు చెలరేగుతాయి. ఒక వంటమనిషిని పెట్టుకుంటే భోజనంతో సహా ఏభై అరవై రూపాయలు ఖర్చుఅవుతుంది. అది పోను మిగిలినజీతం, వంటచేసేశ్రమ మిగులే కదా?

స్త్రీ వుద్యోగంచేసినా లేకపోయినా, జీవితంలో ఆమెవిద్యకి వుండేవిలువ ఏమీ తగదు. అదెన్నటికీ వృథా కాదు. ఆమె గృహమును, పిల్లలను తీర్చిదిద్దేపద్ధతిలో అడుగడుగునా ఆమె విద్యాప్రభావం కనిపిస్తూనే వుంటుంది. స్త్రీల ఉన్నతవిద్యాభ్యాసానికి యింతకంటే ముఖ్యమైనఅవసరం యింకొకటున్నది. స్త్రీ అవసరమైనపుడు స్వయంపోషకశక్తి కలిగివుండాలి. బాగా ఆర్జించే భర్త ఆకస్మికంగా మరణించటమో, లేక

స్త్రీలు - ఉన్నతవిద్యావశ్యకత

ఏదైనా ప్రమాదానికి గురియై ఉద్యోగం చేసేందుకు వీలులేకపోవటమో, దీర్ఘవ్యాధులలోనై జీతభత్యములు లేకుండా శెలవు తీసికోవటమో జరిగి విచ్ఛిన్నమైన సంసారాలెన్నో మనం చూస్తున్నాము. మా మిత్రురాలొకామెకు 22 సంవత్సరాల వయస్సు. ఆమె భర్త ప్రమాదవశాత్తూ నదిలో మునిగి చనిపోయాడు. ఇద్దరుపిల్లలతో ఆమెను పోషించే ఆర్థికస్తోమతు ఆమెతండ్రికి లేదు. ఆ వయస్సులో భర్త ఇన్స్యూరెన్సు డబ్బుతో 8 ఫారంనుంచి విద్య మొదలుపెట్టింది. అంతకుమించి ఆస్తిలేదు. ఇది ఎంతటి క్లిష్టపరిస్థితో చూడండి. అలాంటప్పుడు, ఇన్స్యూరెన్సులు, కొస్తా కూస్తా ఆస్తులకంటె, నికరంగా ఆదాయంవచ్చే ఉద్యోగాలే మెరుగనిపిస్తాయి. ఉద్యోగార్హతలు వుంటే వెంటనే కాకపోయినా, కొంతకాలం తరువాతనైనా ఉద్యోగం దొరికితీరుతుంది. కాబట్టి స్త్రీలు అవకాశం ఉన్నప్పుడే వీలైనంతవరకూ విద్యాభ్యాసం చేయటం అవసరం.

ఈ సందర్భంలో 14-11-56 వారపత్రికలోని శ్రీమతి బళ్లె అహల్యాదేవిగారి వ్యాసం (ఆడపిల్లలచదువులో అవసరమైన మార్పులు)లో యీ క్రిందిభాగం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. "పెద్దచదువులు చదివిన తల్లులు తనుపిల్లల పెంపకంలో అనాదరణ వహించి ఆయాలమీద ఆధారపడి వుండటం మనం నిత్యం చూస్తున్నదే. దినమెల్లాపనితో అలిసిన పెనిమిటికి యింటికి రాగానే ఆనందాన్ని కలిగించి, ఆప్యాయంగా ఆదరించి, అతని అలసటను పారద్రోలి, నవోత్సాహం కలిగించే శక్తిని కలిగి అతనికి చేదోడువాదోడుగా వుండాలి. పై అంశాల్లో ఏమాత్రం అనుభవంలేని ఈ విద్యావతుల్ని పెళ్ళిళ్లు చేసుకున్న యువకులు మొదట్లో సర్దుబాటుగా పోయినా, క్రమేపీ వారిలో ఓర్పుతగ్గి, అసంతృప్తి విద్వేషాలు చెలరేగి, ఆఖరికి యింటే నరకప్రాయంగా తయారై యిద్దరి జీవితాలు దుఃఖభూయిష్టమైపోతున్నవి."

ఆయాలమీద పిల్లలను వదిలే తల్లులంతా విద్యావతులే కారు. విద్యావతులందరికీ ఆయాలను పెట్టుకోగలిగేపాటి ఆర్థికస్తోమతు వుండదు. "శరభయ్యగారూ! టైమెంతెండి" అని (స్వయంగా చూడటం తెలియక) తమ చేతి గడియారాన్ని యితరులకి చూపే, తల్లులు, ఎందరో, తమ భర్తల ఉద్యోగపు అంతస్తునుబటి ఆయాలమీద పిల్లలను వదిలి కారలో షికార్లుకొడుతుంటారు. కళాశాలల్లో చదివే అనేకమంది ఆడపిల్లలు యింట్లో తమ్ముళ్లు చెల్లెళ్ళ పోషణ భారం వహిస్తూ, తల్లులకి వంటలో సహాయం చేస్తారు. మాతృత్వం అన్నివర్గాల స్త్రీలలోనూ ఒకేరకమైన అనుభూతుల్ని కలిగిస్తుంది దానికి విద్యతో నిమిత్తంలేదు. విద్యవుండటం వలన వారివారి బాధ్యతలను గురించిన పరిజ్ఞానం ఎక్కువ అవుతుందే కాని తగ్గదు. పిల్లలకు క్రమశిక్షణ యివ్వలేకపోవటం తల్లిదండ్రులలోపమే కాని విద్యావిధానంలో లోపం కాదు.

అలాగే "ఓనమాలు" రాని భార్యలో అలసి, సొలసి యింటికి వచ్చిన భర్తకి

(53-వ పేజీ చూడండి)



సినిమా

★ టాకీ రజతోత్సవాలు ★

భారత ఫిలిం ఫెడరేషన్ ఆధ్వర్యాన డిసెంబరు మూడో వారంలో భారతీయ టాకీ రజతోత్సవాలు జరుగబోతున్నాయి. ఉత్సవ నిర్వహణకై నెలకొన్న సంఘం ఇంతవరకు సన్నాహాలు చేస్తోంది. కాని, దాని గురించి సంరంభం మాత్రం అట్టే కనబడటం లేదు.

టాకీలకు 25 ఏళ్ళు ప్రవేశించేటప్పుడు రజతోత్సవాలు జరపాలని పూర్వకాలమందు పెద్దలు కొందరన్నారు. మరికొందరు అనకపోవడమో, ఒకవేళ అంటే, మరోవిధంగా అనడమో, మరే కారణమో, ఏమయినా, మొత్తానికి రజతోత్సవాల ముహూర్తాన్ని గత జనవరి నుంచి మార్చి నెలకి మార్చామన్నారు. ఆతరువాత ఇంకొంచెం జరిపారు. ఇలా ముహూర్తం కప్పదాట్లు వేసుకుంటూ ఆ డిసెంబరునుండి ఈ డిసెంబరుకి చేరుకుంది. ఈ డిసెంబరు ముహూర్తం ఎలా ఉంటుందో ఇంకా తెలీదు గాని ఈసారి వాయిదా పడితే, "భారత చలనచిత్ర పరిశ్రమ, టాకీ రజతోత్సవాలను నిశ్శబ్దంగానూ, గంభీరంగానూ జరిపింది" అని మనం, ఘనంగా గంభీరంగా చెప్పుకోవచ్చు.

కాదా ఈ ధోరణిలో, పరిశ్రమ పరిస్థితిని సూచిస్తూ విషాదాత్మకంగా ఉత్సవాలు జరపాలని లోగడ సూచనలు చేశారు కొందరు ప్రసిద్ధ దర్శక నిర్మాతలు. ఈసారి సగర్వంగా పలికి, తమ అభిప్రాయాలను పునరుద్ఘాటించుకోనూ వచ్చును. ఈతరహా 'సిద్ధాంతులు' గత సంవత్సరం డిసెంబరు రోజుల్లో [illegible] అన్నారో, సరిగ్గా అదే రోజుల్లో ఇప్పుడు ప్రయత్నం కావాలని ఆశించబడుతోంది.

శ్రీ శాంతారాం, శ్రీ వాసన్ వంటివారు, సినిమా గుర్తింపు ఆవశ్యకతను ప్రభుత్వానికి చెప్పడానికి ఈ పద్ధతి అవసరం అని భావించారు. నిత్యజీవితంలో సినిమాలుకూడా ఒక భాగంగా అలవాటు అయిపోయిన వారందరికీ ఈ సమయంలో మాత్రం అటువంటి సరదా కలగదు.

ఉత్సవం జరిపే బాధ్యత ఈనాడు సినిమాలు తీస్తున్న వాళ్ళది మాత్రమే కాదు. అది జయప్రదం కావడానికి సినిమాలు చూచే ప్రజలంతా అందులో పాలుపంచుకోవాలి. ఆ దృష్టితోనే అంతా ఉత్సాహంతో ఎదురుచూస్తారు.

ఈనాడు దక్షిణ భారత ఫిలిం పరిశ్రమ అఖిల భారత స్థాయిలోనూ, ఉత్తరాది పరిశ్రమ అంతర్జాతీయ స్థాయిలోను చిత్రనిర్మాణం తలపెట్టి మార్కెట్ అవధులను సువిస్తృతం చేసుకొంటున్నాయి. 'మార్కెట్' కన్న ముందుగా, మనకి ఈ రంగంలో అంతర్జాతీయంగా పేరు ప్రతిష్ఠలు [illegible]. ఈనాడు సర్వత్రా చిత్రాలు భారీయెత్తున తయారవుతున్నాయి. పరిశ్రమ మంచి దశలో ఉంది.


అందువల్ల, ఈ సారి, ఆఖరు వాయిదా నాడైనా, టాకీ రజతోత్సవాలను దేశవ్యాప్తంగా, భారీయెత్తున, గత డిసెంబరులో అనుకున్న దానికన్న గొప్పగా, వైభవంగా జరపడానికి బాధ్యతగల చలనచిత్ర సంఘాలు పూనుకోవాలి.

పరిశ్రమకు తగిన స్థాయిలో ఉత్సవాలు జరపడానికి తగినంత ధనం సమకూర్చుకోవడం ఒక సమస్య. ఏడాది క్రితం ఈ సమస్యను ఎదుర్కొనడానికి పరిశ్రమ ప్రముఖులు ఒక మార్గం ఆలోచించారు. దేశంలోని థియేటర్లన్నీ ఒకరోజు సాయంకాలం మొదటి ఆట వసూళ్ళను పూర్తిగా రజతోత్సవనిధికి సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఇప్పుడుకూడా డబ్బు పెద్ద సమస్య అయితే, ఇటువంటి మార్గాలో మార్గాంతరాలో ఆలోచించి, ఉత్సవాలను మహోత్సవాలు అని చెప్పుకోతగ్గ విధంగా జరపడానికి ఇప్పటినుండి సన్నాహాలు చేయడం అవసరం. ★



శంకర్ ముఖర్జీ చిత్రం
"బారిష్"లో నూతన్



మద్రాసులో జరిగిన చలనచిత్రపరిశ్రమ గోష్ఠిలో శ్రీయుతులు పి. వి. రాజమన్నార్, మంత్రి సి. సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు బి. ఎన్. రెడ్డి, ఎస్. ఎస్.

విశ్వవిద్యాలయాలలో ★ ★ చలనచిత్రకళకు స్థానం

నవంబరు 16, 17 తేదీలలో చలనచిత్రాభిమానుల సంఘం ఆధ్వర్యాన మద్రాసు దాసప్రకాష్ హోటలులో చలనచిత్ర పరిశ్రమపై గోష్ఠి జరిగింది. సంగీత నాటక అకాడమీ అధ్యక్షుడు శ్రీ పి. వి. రాజమన్నార్ ప్రారంభోత్సవం చేస్తూ, చలనచిత్ర నిర్మాణంలో వ్యాపారం ప్రధానమైనా, నిర్మాణం పూర్తి అయి, చిత్రం విడుదల కావడంతో, ప్రాధాన్యం కళదే అవుతుందని, ఈ సత్యాన్ని దృష్టిలో వుంచుకొని చలన చిత్రకారులు వ్యవహరించాలనీ అన్నారు. సినిమాలలో శృంగార రసాన్ని అసభ్యమైన స్థాయికి దించి, తద్వారా డబ్బు చేసుకో చూడడం బాధాకరమని, నిర్మాతలూ, దర్శకులూ ఈ విషయంలో బాధ్యత తెలిసి వ్యవహరించగలరని తమకు గట్టి నమ్మకం ఉన్నదనీ రాజమన్నారుగారన్నారు.

సభకు అధ్యక్షత వహించిన శ్రీ బి. ఎన్. రెడ్డి, చలనచిత్ర పితామహుడు శ్రీ హెచ్. ఎం. రెడ్డి, చమేరియా అధిపతి శ్రీ సుందర్‌లాల్ నహతా ప్రభృతులు పరిశ్రమ స్థితిగతులను, సాధక బాధకాలనూ, కర్తవ్యాలనూ వివరించారు.

విశ్వవిద్యాలయాలలో స్థానం

మద్రాసు హోంశాఖ కార్యదర్శి శ్రీ లోబో ప్రభు మాట్లాడుతూ, చలన చిత్ర కళకు విశ్వవిద్యాలయాలలో స్థానం కల్పించాలని సూచించారు. చలనచిత్ర నిర్మాణం, నటన, రచన మొదలైన వివిధశాఖలలో శిక్షణ వసతులు ఏర్పాటు చేయగచ్చునని, పరిశోధనకు కూడా ఒకశాఖ నెలకొల్పవచ్చునని ఆయన అన్నారు.

పరస్పర ప్రబోధాలు

ఈ సభలో తొలిరోజున మద్రాసు మంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం ప్రసంగిస్తూ చలన చిత్ర పరిశ్రమ సుస్థిర భూమికను, దాని విధ్యుక్త ధర్మాలను పునరుద్ఘాటించారు.

చలన చిత్ర పరిశ్రమ, జాతిభక్తినీ, ఐకమత్యాన్ని, సంస్కృతినీ పెంపొందించాలనీ, ప్రబోధాలు చేయాలనీ ఆయన ప్రబోధించారు.

పరిశ్రమ తరఫున శ్రీ ఎస్. ఎస్. (జెమినీ) వాసన్ ప్రసంగిస్తూ ప్రభుత్వం చలన చిత్రాలపై వినోదంపన్ను తగ్గించాలని ప్రబోధించారు. ★

చలన చిత్ర కథ

అభిశప్తుడి కథ

కావలసిన డబ్బు, 'ఓహో' అనిపించుకునేటంత పేరు, అనుంగు నెచ్చెలి, ఇంకా చిల్లర మల్లర సదుపాయాలూ హంగులూ అన్నీ కష్టపడి సమకూర్చుకున్న తరవాత 'రైటో' అనుకుని నెచ్చెలితో కలిసి యుగళ గీతం పాడబోయే సరికి గొంతుక బొంగురు పోయి బోలెడు అపశ్రుతులు పలుకుతాయి కొందరికి. మరికొందరికి పాట బాగా వచ్చినా హఠాత్తుగా వీధిలో చావు బాజా వినబడుతుంది.

వీళ్లు నిత్యదుఃఖితుల జాబితాలో చేరతారో లేదో కాని, రోజులు రాజాలా సాగుతున్నపుడు బాగుందని ఆనందడోలిక మీద కాలు మోపబోయినపుడల్లా అది కాస్తా జారిపోడం చూస్తే అభిశప్తులన్నమాట గుర్తుకు వస్తుంది.

ఎడ్డీ డూచిన్ పియానో వాద్యగాడుగా మంచి పేరు ప్రతిష్టలు గడించుకున్నాడు. పేరు రావడానికి అతని చేతిలో విద్య ఒక కారణం అన్నా, అదృష్టం మరొకటనుకున్నా, మార్జరీ ఆశ్రితన్ని చేయూత ముఖ్య కారణం.

మార్జరీ ధనికురాలు. హైక్లాసు 'సోసైటీ' రాగద్వేషాలూ, కోపతాపాలూ మోతాదు మించకుండా, కృత్రిమమందహాస పాశాలతో బిగించి అభినయించే పెద్ద మనుష్యుల మధ్య తిరిగే మార్జరీకి అటువంటి కృత్రిమలక్షణాలు లేని ఎడ్డీ డూచిన్ విలక్షణ వ్యక్తిగా కనిపించాడు. ఆమె దృష్టిని ఆకర్షించాడు. ఆమె సహాయంతో, ఎడ్డీ ఒక కాసినోలో పియానిస్టుగా కొలువు సంపాదించుకున్నాడు. ఆమె దోహదం వల్లనే పురప్రముఖుల కంటికి కానాడు. కొద్ది రోజుల్లోనే గొప్పవాడయ్యాడు. ఒకసారి విందు ఆహ్వానం అందింది డూచిన్‌కు. కిరాయి పియానిస్టుగా కాకుండా, గొప్పవాళ్లతో సమానస్థాయిలో తింటూ తిరుగుతూ కాలక్షేపం చేసే అవకాశం వచ్చిందని మురిసిపోతూ ఆ విందుకు వెళ్లాడు డూచిన్ తన గొప్పతనాన్ని బట్టే ఆహ్వానం వచ్చిందనుకున్నాడు

విందులో పదినిముషాలు గడచేసరికి గృహస్థు వచ్చి డూచిన్ విధ్యుక్తధర్మం తెలియచెప్పడంతో అతని కళ్లు తెరుచుకున్నాయి. అతని చిన్నసైజు గాలిమేడ కూలిపోయింది. చిన్నబుచ్చుకుని, నోరు మూసుకుని పియానో దగ్గర కూర్చున్నాడు.

మార్జరీ ఇది గమనించి ఓదార్చబోయింది.

"నాదే తప్పు. నా అంతస్తు తెలుసుకోకుండా, నా స్థానం ఎక్కడో గ్రహించుకోకుండా, తగుదునమ్మా అని ఎగరబోయి బోర్లగిలా పడ్డాను. నా బుద్ధే అంత" అన్నాడు డూచిన్.

ఆ క్షణాన మళ్లా అతన్ని సిరి వరించింది.

"నీ చోటు కేం నిక్షేపంవంటిది. ఈ క్షణాన నీ చోటు నాపక్కనే" అంది మార్జరీ ఉద్వేగ ప్రేమతో.

*   *   *

మార్జరీ, డూచిన్‌ల వైవాహిక జీవితంలో రోజులు, సాఫీగా, హాయిగా, పట్టుదారం మీద ముత్యాలలా సాగిపోసాగాయి. డూచిన్ బాగా పేరు గడించుకున్నాడు

ఒకరోజున "డూచిన్ తన భార్యను కాసినోకి తీసుకెళ్లాడు స్వంతంగా డూచిన్ ఆర్కెస్ట్రాను" ఆరోజే ప్రారంభించినట్టు అక్కడ వెల్లడించాడు 'ఆరువారాల కృషి ఫలితం' అన్నాడు

'ఇన్నాళ్లు నాకు చెప్పలేదేం" అంది మార్జరీ ఆశ్చర్యంతో.


"నువ్వు పండంటిపాపని కనబోతున్నట్టు రెణ్ణెల్లనించి నాకు చెప్పలేదేం ?" అన్నాడు డూచిన్ నవ్వుతూ. డూచిన్ చిట్టచివరి నవ్వు అదే.

ఎందుకంటే, మార్జరీ క్రిస్మస్ పండుగనాడు పండంటి పాపని కని హఠాత్తుగా చనిపోయింది.

డూచిన్ ఈ అపశ్రుతిని భరించలేకపోయాడు. కొడుకుని తన ఆత్మీయులైన వాడ్స్‌వర్త్ దంపతులకు ఒప్పగించి, మనశ్శాంతికోసం దేశాటన చేయబోయాడు. అన్నీ ఉన్నాయి గాని ఆత్మశాంతి ఒక్కటే కొరవడిపోయింది అతనికి. కొంతకాలానికి మరో అమ్మాయిల మైదాన్ని కూడా పోగొట్టుకొన్నాడు డూచిన్...ఐదారేళ్లపాటు దేశంలో పర్యటించి, మనసు కుదుటపరుచుకుని, ఒకనాడు తన కొడుకును చూడబోయే సరికి, ఆసంగతి తెలిసివచ్చింది డూచిన్‌కి.

కన్ను తెరచిన తరువాత కన్నతల్లినీ, తండ్రినీ కూడా చూడనోచుకోని పీటర్‌కు, ఐదేళ్లు మరొకరి ఇంట పెరిగేసరికి, తండ్రి అనేవాణ్ణి చూడవలసిన అవసరం కూడా కనబడలేదు.

డూచిన్ ఎంత అనురాగంతో చేరదీసు



... విద్యార్థి విజ్ఞానసమితి సాంస్కృతికోత్సవాల సందర్భంలో ఇటీవల ప్రముఖ భానుమతికి సన్మానం జరిగింది తపీ ధర్మారావు, నాగయ్యగార్లను కూడా ఈ చిత్రంలో చూడవచ్చును

★ అభిశప్తుడి కథ ★



మద్రాసు ఆంధ్రకళాకుంజేలివారు ఈ 11-న చలన చిత్రకళాకారులు బి. ఎన్. రెడ్డి, ఎస్. వి. రంగారావు, అంజలీదేవి గారలను సన్మానించారు. 1955 తెలుగు తమిళ చిత్రాలలో ఉత్తమనటిగా సన్మానం అందుకొని ప్రసంగిస్తున్న అంజలి.

ఉన్నా పీటర్ అనుమానాన నిలుస్తూ వచ్చాడు. కొడుకును చూచుకుని, భార్యా వియోగదుఃఖాన్ని మరచిపోదామని కొండంత ఆశతో వచ్చిన డూచిన్ గాలిమేడ మళ్ళీ కూలిపోయింది.

ఈసారి పారిపోవడానికి యుద్ధం అవకాశం ఇచ్చింది. నావికాదళంలో చేరిపోయాడు డూచిన్.

ఇంకో పదేళ్ళకి ఇంటికి తిరిగివచ్చాడు. యుద్ధం ముగిసింది. కొడుకుకి తనమీద లవలేశం ప్రేమ, అభిమానం కలగలేదు. మరింత దూరమైనట్లు తోచింది.

“మా పీటర్కి ఇప్పుడు మంచి నేస్తం దొరికింది. ఆ పిల్ల పేరు ‘చికిటా’. పీటర్ చికిటా అంటే పంచప్రాణాలూ పెడతాడు” అన్నారు పీటర్ పెంపుడు తలిదండ్రులు.

తీరా చూడబోయేసరికి పదేళ్ళ పీటర్ నేస్తం చికిటా, ‘పాతికేళ్ళ బాలిక!’ చికిటా బ్రిటిష్ యువతి. యుద్ధంలో ఆమె తల్లి తండ్రులు చనిపోయారు. ఇల్లూవాకిలీ ధ్వంసం అయిపోయాయి. అనాథబాలికగా న్యూయార్క్ వచ్చి వాడ్స్వర్త్ దంపతుల ఇంట ఉంటోంది.

చికిటా శాసించినా వినే పీటర్, తను లాలించినా ఖాతరుచెయ్యకపోవడం బాధ కలిగింది డూచిన్కి.

“వీడు నా కొడుకు” అని ఓసారి గట్టిగా అనుకుని అధికారం చలాయించబోయాడు.

చికిటా వారించింది. “వాడు పసివాడు. మీ దగ్గిర అలవాటులేదు. మెల్లిగా మంచి చేసుకోవాలి” అంది సానునయంగా.

“నా కొడుకు ప్రేమకోసం నేను కూడా వాయిదాల పద్ధతి ఏర్పాటుచేసుకోవాలా?” అన్నాడు డూచిన్.

“మార్గాంతరం లేదు.”

“చికిటా! నా బిడ్డకు నా వాడనే మాట చెప్పు. కావాలంటే వాడిముందు మోకరిల్లుతాను” అన్నాడు డూచిన్

“అదెలాగా తప్పదు” అంది చికిటా.

* * *

చికిటా చెప్పిన మార్గాన, మెలిమెలిగా తన పిల్లడిని చేరదీసి మంచి చేసుకోగలిగాడు డూచిన్.

పీటర్ పియానో వాయించడంలో గడించిన ప్రతిభ, దానిమీద అభినివేశం, అందుకు తగ్గట్టు, తండ్రి చేతిలో ఉన్న విద్య, చికిటా నేర్పు, ఓర్పు ఇందుకు దోహదం చేశాయి.

డూచిన్ జీవితంలో మళ్ళీ వసంతం తొంగిచూచింది. అంతలోనే ‘అంతం’ కూడా వచ్చి పడింది

దూరమైన కొడుకు చేరువై, ఆత్మశాంతి, సౌఖ్యం, సంతోషం ఇంట నిలచిన వేళ, మృత్యుదేవతకూడా ప్రమాదకరమైన వ్యాధి రూపంలో ప్రవేశించి తిష్ఠ వేసింది. ఆ సంగతి ముగింపు చేసిందని తెలిసికూడా, చికిటా డూచిన్ను పెళ్ళి చేసుకుంది.

ముప్పై ఏళ్ళ జీవితంలో మూడవసారిగా, అందబోయిన ఆనందడోలికమీద సతీసుత సమేతంగా కాలూనబోయిన ఎడ్డీ డూచిన్, ఈసారికూడా జారి పడిపోయాడు.

ఈ అభిశప్తుడి కథను కొలంబియా పిక్చర్స్ వారు “ఎడ్డీడూచిన్ స్టోరీ” పేరిట టెక్నికలర్ సినిమాస్కోప్ చిత్రంగా నిర్మించారు. డూచిన్గా టైరన్ పవర్, మార్జరీగా కిమ్ నోవాక్, చికిటాగా విక్టోరియా షా, పీటర్ గా రెక్స్ థాంప్సన్ నటించారు. దర్శకుడు జార్జి సిడ్నీ. ★

సినిమా వార్తలు

ప్రభా ప్రొడక్షన్స్వారి తొలిచిత్రం “[illegible]” రికార్డు పూర్తి కావచ్చింది.

అంజలి, నాగేశ్వరరావు, కన్నాంబ, గుమ్మడి, రేలంగి, రాజసులోచన మొదలైనవారు ఇందులో పాల్గొంటున్నారు.

ఈ చిత్రానికి కథ, సంభాషణలు పినిశెట్టి శ్రీరామమూర్తి వ్రాశారు. ఇప్పటికి రికార్డు అయిన రెండు పాటలలో ఒకటి ఆరుద్ర, మరొకటి రాజశ్రీ వ్రాశారు.

సంగీత దర్శకుడు: ఎస్. రాజేశ్వరరావు దర్శకత్వం సి. ఎస్. రావు నిర్వహిస్తున్నారు. ఈ చిత్రం సంక్రాంతినాటికి విడుదలచేయాలని సంకల్పించినట్లు నిర్మాతలు తెలియచేస్తున్నారు.

* * *

విక్రం ప్రొడక్షన్స్వారి “భక్త మార్కండేయ” చిత్రం విక్రం స్టూడియోలో చురుకుగా తయారవుతోంది. త్వరలోనే విడుదలకు సిద్ధంకాగలదని తెలుస్తోంది. మరుద్వతిగా పుష్పవలి, మార్కండేయుడుగా ఆమె కుమారుడు బాబ్జీ, మృకండుడుగా నాగయ్య నటిస్తున్నారు. సి. ఎస్. ఆర్., నాగేంద్రరావు, కాంతారావు, రఘురామయ్య, రమణారెడ్డి, మాస్టర్ ప్రభాకర్, ఆనంద్, సురభి బాలసరస్వతి, సూర్యకళ ప్రభృతులు ఇతర భూమికలు నిర్వహిస్తున్నారు. రచన సముద్రాల రాఘవాచారి. దర్శకుడు బి. ఎస్. రంగా.

* * *



మద్రాసు [illegible] ఈనెల 11 న అన్నామలై హాలులో గాన సభ చేసిన బొంబాయి సైగాల్ గాయకుడు. కుమార్ రత్.

★ ప్ర త్యు ప కా రం ★

[39 వ పేజి తరువాయి]

పెట్టాడు ఫ్రాన్సిస్కో.

ఎవరూ డబ్బుకోసం ధావడానికి సాహసించలేకపోయారు. ఇద్దరు ముగ్గురు ప్రయత్నించారు కానీ, ప్రాణాలమీద వున్న తీపివల్ల పారిపోయివచ్చారు.

ఇంతలో ఎక్కణ్ణుంచో ఒకతను పరిగెత్తుకుంటూ వచ్చి, ఆ మంటల్లోకి దూరిపోయాడు. అంతా అతను చచ్చిపోయాడనుకున్నారు. కానీ, కొద్దినిమిషాల్లో ఆ మనిషి... పసివాడితో...నల్లగా మాడిపోయి బయటకు వచ్చాడు.

అంతా గోలగా అతనిమీద పడ్డారు, అతనెవరా అని. మసి పట్టిన అతనిని ఎవరూ పోల్చలేకపోయారు.

"రక్షించారు! ఇవిగో...యీ నాణాలు తీసుకోండి! రేపు నా ఆస్తినంతా మీపేర రాస్తాను!" అన్నాడు ఫ్రాన్సిస్కో పసివాణ్ణి హృదయానికి హత్తుకొని.

"అక్కర్లేదు! మీ దగ్గర్నే వుండనియండి!" అన్నాడు ఆమనిషి-ఆ గొంతు యిదివరలో ఎక్కడో విన్నాడు ఫ్రాన్సిస్కో. మనిషిని పరికించి చూశాడు. కొద్ది క్షణాల తర్వాత ఫ్రాన్సిస్కో అరిచాడు "హామెట్!" అని.

"మళ్ళీ ఎలా వచ్చావ్?" అని అడిగాడు హామెట్ని ఫ్రాన్సిస్కో.

"భగవంతుడి దయవల్ల!" అన్నాడు హామెట్.

"ఔను...అంతా దైవకృప. ఐనా, ఎలా వచ్చావో చెప్పు!"

"నేను ఓడమీద సురక్షితంగా రేవు చేరుకున్నాను అప్పుడే...... వెనిస్కు ఓడ బయలు దేరుతోంది. అందులో వెనిషియన్లు మా నాన్నని బానిసగా ఎక్కించుకొని తీసుకు పోతున్నారు. మా నాన్న చాలా ముసలాడు. వెంటనే నేను ఆ ఓడ యజమాని దగ్గరకు వెళ్ళి ఎన్నోవిధాల బ్రతిమలాడేను. కానీ అతనికి దయ కలిగింది కాదు. చివరకు 'నన్ను తీసుకు వెళ్ళండి! నేనైతే యువకుణ్ని! చాకిరీ చేస్తాను. నన్ను అమ్ముకుంటే నాలుగురాళ్ళయినా వస్తాయి. ఆ ముసలాడు మీకేం పనిచేయగలడూ?...అతణ్ణి వదలండి నన్ను తీసుకుపొండి! అతణ్ని విడిచిపెట్టి నందుకుగాను ఈ డబ్బు తీసుకొండి!!' అని మీరు ఇచ్చిన డబ్బు యిచ్చేసి, నాన్నను పంపేసి...నేను ఇక్కడకొచ్చేసాను. ఇక్కడికి చేరి మూడురోజు లయింది. దగ్గర్లోనే బానిసగా ఉంటున్నాను" అన్నాడు హామెట్.

ఫ్రాన్సిస్కో కళ్ళ వెంబడి జలజలా నీళ్లు కారినయ్.

"దేవుడి దయవల్ల మీ ఋణం తీర్చుకున్నాను. అసలీ జన్మలో నే మీ ఋణం తీర్చుకోలేననుకున్నాను కాని, "హామెట్ కృతఘ్నుడు కాదు. కృతజ్ఞుడే!" అనిపించుకున్నాను. భగవంతుడు ఏదయినా మన మేలుకోసమే చేస్తాడు. ఇందుకే నన్ను రప్పించి వుండాలి!" అన్నాడు హామెట్.

"హామెట్! నీ ఋణం నే నెలా తీర్చుకోగలనూ?...నా ఆస్తినంతా నీ పేర రాస్తాను తీసుకో...!" అన్నాడు ఫ్రాన్సిస్కో.

"వద్దు...వద్దు! అది నీ దగ్గర్నే ఉండనీ" అన్నాడు హామెట్.

"ఐతే, ఈసారి నిన్ను విడిపించడమే గాదు. నీ దేశస్థు లందర్నీ కూడా విడిపించి, భద్రంగా టర్కీ పంపిస్తాను. అందుకే ఆస్తి అంతా ఖర్చుచేస్తాను" అన్నాడు ఫ్రాన్సిస్కో. హామెట్ ఆనంద బాష్పాలు రాల్చాడు. ★

దొంగాటకం

(37వ పేజీ తరువాయి)

పిరికి వాడ్ని కాను." ఉక్రోషంవచ్చేసింది బాబుకి.

"నేనేం కాను. నువ్వే"

"నువ్వే" ఇలా వాళ్ళిద్దరూ పోట్లాడుకోవడం చూచి అమ్మ నవ్వుకుంటూ అమ్మల్ని లాక్కెళ్లి బలవంతంగా ప్రక్కలో పండుకో బెట్టుకుంది. బాబుని నాన్న ప్రక్కలో వేసుకున్నాడు. వాళ్ళిద్దరూ గునుస్తూనే నిద్రపోయారు. ★

స్త్రీలు-ఉన్నతవిద్యావశ్యకత

(48 వ పేజీ తరువాయి)

గుక్కెడు మంచినీళ్లయినా యివ్వని వారెందరో వున్నారు. ఒకేపనిని ఒకచదువుకున్న స్త్రీ, చదువుకోని స్త్రీ చేస్తే, అందులోని లోపం చదువుకున్నామె చదువుకీ, చదువుకోని ఆమె అజ్ఞానం (తెలియనితనం) కీ ముడిపెటటం మనకి అలవాటయిపోయింది. విద్యావిధానం ఎంత మార్పు చెందినా "పైఅంశాల్లో అనుభవం" అంటే Practical training యివ్వటం సాధ్యమయేది కాదు. ఇక విద్యావతులు కాని స్త్రీలు పై అంశాల్లో-అంటే పిల్లల పెంపకం, భర్తని ఆదరించి ఆనందింపచేయటం వివాహపూర్వమే అనుభవం కలిగివుంటారేమో నేను గ్రహించలేకుండా వున్నాను. పెళ్లిళ్లయి ఇల్లు చక్కబెట్టుకోవటం చేతకాక చాలామంది పెళ్లికే దూరంగా వున్నారంటే తప్పులేదేమో కాని, అతిశయోక్తి అనిపిస్తోంది. ★

సీతారామశాస్త్రిగారి అద్భుతచర్యలు

(32 వ పేజీ తరువాయి)

పోనిస్తారా? చదవవోయ్ పుస్తకంలో పాము ఎక్కడ వస్తాయ్ ఛాందసంగాని అని కూర్చోపెట్టారు. కూర్చున్నాడు మళ్ళీ బుస్‌మంటూ ఒక పాము కనపడింది. అమ్మో! బాబోయ్ కోడెనాగు అదుగో అంటూ లేచిపోయాడు ఎదురుగా ఉన్న దీపమూ వ్యాసపీటా, భాస్కర రామాయణం అన్నీ కోడెనాగుల్లా కనబడుతున్నాయ్ ఇంకేం కూర్చుంటాడు. పరుగుతీశాడు. ఎంతదూరం వెళతాడు. అడుగు కదలనీకుండా రెండు పిశాచాలు పట్టుకొని లాక్కొచ్చాయి. శాస్త్రులుగారి కాళ్ళమీద దబ్బున పడ్డాడు. క్షమించి కాపాడమన్నాడు, పామూ లేదు పిశాచంలేదు. శాస్త్రులుగారు నీ ప్రవీణత కూర్చో, ఏం లేదు. గర్వం పనికిరాదు నాయనా! ఏదో కాస్త చదువుకొన్నవాడివి. బాగుపడే లక్షణాలుండాలి. ఎదిరించడం క్షేమంకాదు. కూర్చో అన్నారు పురాణం సవ్యంగా జరిగిపోయింది

ఎవరేనా దురహంకారంతో శాస్త్రులుగారిని ఎదిరిస్తే వాడిని ముప్పతిప్పలూ పెట్టి మూడు చెరువుల నీళ్ళు త్రాగించి, త్రాహి అనిపించేవారు తన జోలికి ఎవడూ రాకపోతే ఏ అల్లరీ లేదు.

ఎత్తిన చెయ్యి ఎత్తినట్లే!

సాలూరు తాలూకా శివరామపురంలో లక్ష్మీనరసింహులు భుక్తగారు శ్రీమద్రామాయణం చదివి రామపట్టాభిషేకం చేస్తున్నారు. గొప్ప అన్నదానం, పండిత సత్కారం చేస్తున్నారు. దక్షిణాదినుంచి ఎవరో ఇద్దరు మాంత్రికులు ఆ నాటికి భుక్తగారింటికి వచ్చారు సాలూరునుంచి సీతారామశాస్త్రులుగారు రావడం కొంచెం ఆలస్యమయింది భోజనాలకి వేళ దాటిపోయింది ఆ మాంత్రికులకు కోపం వచ్చింది శాస్త్రులుగారు వచ్చారు వీడికోసం మేము ఇంతసేపు తిండిలేక కూర్చోవాలా? అన్నారు వారు. వెంటనే శాస్త్రులుగారికి కడుపు భేరీలాగు పొంగిపోయింది ఒక అయిదు నిమిషాల పాటు చాలా బాధపడ్డారు అందరికీ భయం వేసింది ఉన్నట్టుండి హఠాత్తుగా ఏమిటీ యీ ప్రమాదం అనుకొన్నారు. శాస్త్రులుగారు మెల్లగా నూతిదగ్గరికి వెళ్లి ఎలాగో కష్టపడి స్నానం చేసి వచ్చారు. అంతా పంక్తులు తీరి భోజనాలకి కూర్చున్నారు శాస్త్రులుగారి కడుపుపొంగు తీసిపోయింది. అందరూ పరిషేచన పట్టి ప్రాణాయామం పుచ్చుకొంటున్నారు మాంత్రికులకు ఇద్దరికీ కుడిచెయ్యి నోటిదగ్గరా, ఎడమచేతి తర్జని విస్తరిలోనూ ఉండిపోయాయి. కళ్లు రెప్పవాలకుండా ఉండిపోయాయి నోటమాటలేదు. శ్వాసఉంది గాని కళేబరం కదలదు. భుక్తగారు నేతిజారీ పట్టుకొని వచ్చారు ఈ జీవన్మృతుల వాలకం చూచారు కార్యం రసాభాసు అయిపోయిందని భయపడి అలా నిలబడిపోయారు ఎవ్వరూ భోజనాలకి ఉపక్రమించరు. ఏమిటీవింత అని చూస్తున్నారు అప్పుడు భుక్తగారు శాస్త్రులుగారిని వేడుకొన్నారు ఏమిటి అన్నగారూ! ఈ సంగతి? అని.

అప్పుడు శాస్త్రులుగారు అన్నారట వాళ్లు గొప్ప మంత్రశాస్త్రజ్ఞులు మనలని పరీక్ష చేశారు. దానికి మనం జవాబిచ్చాం అన్నారు. 'కార్యం రసాభాసు, బ్రహ్మహత్య' అన్నారు భుక్తగారు.

'ఆ! అంతవరకూ రానిస్తామా' కానీయండయ్యా! బ్రాహ్మణోత్తములంతా కనిపెట్టుకొని కూర్చున్నారు' అని శాస్త్రులుగారు బిగ్గరగా ఒక నవ్వునవ్వారు మళ్ళీ మాంత్రికులు ఈ లోకంలో పడ్డారు. అలాగే లేచి వెళ్ళి శాస్త్రులుగారి పాదాలు పట్టుకొని ప్రాధేయపడ్డారు.

'కానీయండి బుద్ధిగా వెళ్ళండి మంత్రాలు వచ్చినవాళ్ళు ఈ కాలంలో కూడా ఉన్నారు. మంత్రాలు నేర్చుకోవడం ఎదటివాడి ప్రాణాలు తోడడానికా? జాగ్రత్త!' అన్నారు. వాళ్లు బుద్ధివచ్చిందని క్షమించబడి తినిపోయారు. భోజనాలు అయాక శాస్త్రులుగారు వాళ్లకి భూరిసంభావన లిప్పించి పంపివేశారు

అసలు పాముదర్శనం

శాస్త్రులుగారి జీవితంలో చెప్పుకోవలసినది చాలా గొప్పసంగతి ఒకటి ఉంది

సాలూరుతాలూకా శివరామపురం అగ్రహారంలో రామిజాలలక్ష్మీనరసింహులుగారు జమీందారీఫాయాలో తొంభైయేళ్ళపైగా మహోదర్గాగా బ్రతికిన పూర్వపురుషులు. నిరతాన్నదాత జనసామాన్యం ఆయనను దేవుడే అని ప్రశంసించేది అమోఘమైన వాక్కుగల అజాతశత్రువు. ఆయనకీ శాస్త్రులుగారికీ దోస్తీ. వారు ఒకనాడు శాస్త్రులుగారిని కోరారట. 'అన్నగారూ! ఈ పాములన్నీ క్షుద్రపురుగులని మీరు చెపుతున్నారు మరి అసలు సర్పం ఎలాఉంటుంది? ఎక్కడ ఉంటుంది? చూపించుతే చూద్దామని ఉంది' అని దానిమీద 'అన్నగారూ! ఇవి నా కుదఘటియలు అని అనుకోవద్దు మీరు కోరారు కనక వారి దర్శనం చేసుకొందాం దయచేయండి' అని శాస్త్రులుగారు వారిని రామభద్రపురం తీసుకుపోయి మూనాళ్లు పచ్చిమంచినీళ్ళైనా ముట్టకుండా కటికఉపవాసం చేసి ఇంకా మరి ముగ్గురు నలుగురు వస్తామని వెంటబడితే రండని ఒక పెద్ద వెదురుబొంగు పట్టించుకొని జన్నివలసఅడివిలోకి తీసుకుపోయారు. అందరినీ దూరంగా నిలబడమన్నారు. అక్కడ ఒక పుట్టమీద వెదురుబొంగు పాతించి పుట్టకి ముమ్మారు ప్రదక్షిణం చేసి సాష్టాంగనమస్కారం చేసి మంత్రాక్షతలు ఆ బొంగుమీద చల్లారు. ఒక్క అయిదునిముషాలు అయేసరికి రాజబెట్టినట్టు కాలధూమం కమ్మింది మరో అయిదునిముషాలలో ప్రళయాగ్నికీలలు విస్ఫులింగాలు, ఎగయచిమ్ముతూ పైకి వచ్చాయి పెటపెట లాడుతూ వెదురుబొంగు పేలి, కాలి, మసి

పసుపు, కుంకుమ....

(19 వ పేజీ తరువాయి)

ఆమె చెప్పింది బాగానే ఉందనిపించింది భర్త మనసుకి ఊరట కలిగింది

మధ్యాహ్నం భర్త రాగానే ఆయన చెవిని వేస్తే ఆయన అభ్యంతరం చెప్పలేదు. "అలాగే ఇచ్చుకో సాయంత్రం తీసుకొస్తాను" అన్నారు.

మర్నాడు ఓ ముత్తయిదువని పిలుచుకుని భోజనం పెట్టి కాళ్లకి పసుపురాసి నుదుట కుంకం బొట్టుపెట్టి ఇంత పసుపూ కుంకుమా, వికలగుడ్డా ఆమె చేతిలో పెట్టి దణ్ణం పెట్టుకుంది.

పక్కింట్లో దుస్సంఘటన జరిగి నాలుగు రోజులయింది. దీని ప్రభావం చాలా విశితంగా కౌమాతుమ్మ చేసే ప్రతి ఆలోచన మీదా కనిపించసాగింది.

మధ్యాహ్నం భర్త ఆలస్యంగా ఇంటికి వస్తే ఎన్నడూ పడనంత కంగారుపడింది కౌమాతుమ్మ. రాగానే ఆతృతగానే వంద ప్రశ్నలు వేసింది ఆయన విసుక్కున్నారు. ఆమె చిన్నబుచ్చుకుంది.

'నీ ధోరణి విపరీతంగా ఉంటోంది. ఎన్నడూ లేనిది నామీద ఇంత నిఘా వేశావేమిటి? చాదస్తం ఎక్కువయింది బయల్దేరే ముందు జాగ్రత్త! జాగ్రత్త!! అంటూ వంద మార్లు హెచ్చరిక చేస్తావు. ఓ నిముషం ఇంటికి రావటం ఆలస్యం అయితే, నానా గొడవా చేస్తావు," అంటూ ఆయన చిరాకుపడ్డారు.

కౌమాతుమ్మ తలవంచుకుని లోపలికి వెళ్లిపోయింది

ఈ వారం రోజుల్లోనూ భగవంతుడిమీద భక్తి ప్రపత్తులు విపరీతంగా పెరిగిపోయాయి. పూజలూ, పునస్కారాలూ, మడి, ఆచారం అన్నీ వచ్చి పడ్డాయి

"నన్ను జాగ్రత్త, జాగ్రత్త అంటావు రోజల్లా ఇలా తడిబట్టలు కట్టుకుంటే, ఆరోగ్యం పాడవదూ? ఉపవాసాలు చేస్తే, మనిషి నీరసించిపోవూ?" అంటూ భర్త చేసిన మందలింపులు ఫలించలేదు.

"అలా అనకూడదు తప్పు" అని ఎదురు మందలించింది కౌమాతుమ్మ

ఓనాడు, ఎవరైనా మంచివంశం చూసి చక్కని పిల్లవాడ్ని తెచ్చుకుని పెంచుకుంటే బాగుంటుందేమో అని పిస్తోంది" అంది.

భర్త ఈమాటలు వినిపించుకోలేదో, లేక, ఈ ఆలోచన నచ్చకనో మౌనం వహించారు.

కౌమాతుమ్మ మళ్లీ రెటించింది

"ఎంత లావాటికి అమ్మా అని పిలిపించుకోవాలని కోరిగ్గా ఉందా?" అన్నాడాయన నవ్వుతూ.

అయిదో పడిలోపడ్డ కౌమాతుమ్మ సిగ్గుపడి తలవంచేసుకుంది.

"ముసలమ్మ సిగ్గుపడితే, మూడుముచ్చటగా ఉందే" అంటూ ఆయన పరాచికాలు ఆడారు

"ఏం నా ఆలోచన బాగుండలేదా? పెద్దవాళ్ళం అవుతున్నాం కొస్తచేతి ఆసరా లేకపోతే, ఇద్దరికీ కష్టమే కాస్తో కూస్తో ఆస్తి ఉందాయె. మనతర్వాత మనపేరు చెప్పుకుని అనుభవించేందుకు ....!

"ఆస్తి అనుభవించేందుకు ఎవరూ ఉండరేమో అని దిగులుపడకు. కావాల్సినంత మంది వస్తారు."

"ప్రాణం మీదికొస్తే, గొంతులో నీళ్లు పోసేందుకైనా కావద్దుటండీ."

"అలాగా. ఆలోచిద్దాంలే. పడుకో"

అంతటితో ఆ ప్రసక్తి ఆగిపోయింది. "వరలక్షుమ్మది పాపం ఒంటరి బ్రతుకైపోయింది. కడుపున పుట్టకపోయినా ఎవర్నయినా పెంచుకుంటే బాగుండిపోయేది" అనుకుంది కౌమాతుమ్మ.

తనలో ఏదో మార్పు వచ్చిందనీ, దీని ప్రభావమోతనమీద గాఢంగా పనిచేస్తోందనీ అస్పష్టంగా అవ్యక్తంగా అనిపించసాగింది కౌమాతుమ్మకి ఇదివర కెన్నడూ ముందురోజు గురించి ఆలోచించి ఎరగదు. కాని ఈ మధ్య ప్రతినిముషం రాబోయే నిమిషాన్ని గురించే ఆలోచన

భోజనం చేస్తుంటే, ఈమాటా ఆమాటా వచ్చి ఎవరెవరికెంతెంత వయస్సు అనే సందేహం వచ్చింది "నాకు అరవై దాటుతుంది" అన్నాడు ఆయన.

"అబ్బే! మీకసలు రెండు మూడేళ్లు ఎక్కువ వేస చెప్పుకోవటం సరదా! మీకు ఏభై ఏడేళ్ళు! నాకు వలభై ఎనిమిది," అంది కౌమాతుమ్మ వెంటనే

"నీ మొహం. నా వయస్సు నాకు తెలుస్తుందా నీకు తెలుస్తుందా? అరవై వడుస్తోంది ఇంక నెలాళ్లలో అరవై ఒకటి వస్తుంది" అన్నాడాయన మరింత పట్టుదలగా.

"కాదు ఏభైఏడే," అంది కౌమాతుమ్మ.

"కాదు అరవై" అన్నారాయన చేతిలో ముద్ద కంచంలో వేసి

సేమీ ఒప్పుకోలేదు కౌమాతుమ్మ. చివరికి ఆయనే, "ప్రతిఆడదీ తన భర్త చాలా చిన్నవాడనే అనుకుంటుంది. వయస్సు కూడా రెండు మూడు సంవత్సరాలు తక్కువే చెబుతుంది ఇప్పుడు ఎందుకొచ్చిన వాదన? అరవై అయితే పోయే దేముంది?

★ సీతారామశాస్త్రిగారి అద్భుతచర్యలు ★

అయిపోయింది. తలపై చిన్న పింఛం, వెండి కడ్డీలా తెల్లని శరీరం, చిన్నపడగ, అరుణ నేత్రాలు, విషం క్రక్కుతూన్న నాలుక, మూరెడే మూరెడు పాము పుట్టలోంచి బయటికి వచ్చి తోకమీద నిల్చుని శాస్త్రిలు గారిని చూచి ఇటూఅటూ ఒకసారి తిలకించింది. ఆమాపుల వేడికి ఆగలేక చుట్టూ మూరుగజాల దూరంలో పెనుమంటలు లేచాయి. చెట్టూ చేమలూ దగ్ధమయిపోయాయి. ఆ సర్పరాజుదగ్గర శాస్త్రిలు గారు వరసింహావతారం ముందు ప్రహ్లాదులా చేతులు జోడించి, నతశిరస్కులై ప్రార్థన చేస్తున్నారు.

'మహాప్రభూ! అనంతమూర్తీ! తమ దర్శనం అసాధారణం. తరించాము. శాంతించండి. ఇది క్షుద్రలోకం. ఇలా దయచేయండి.' అంటూ శాస్త్రిలుగారు ముందు దక్షిణదిక్కుగా నడుస్తూ ఉంటే పార్వశ్రీముడులా ఆసర్పరాజు వెంట వెళ్ళారు. అలా వెళ్ళి వెళ్ళి ఒక గుట్ట మీంచి క్రిందికిదిగి అక్కడ ఒక పుట్ట చూపి ఇందులోంచి తమలోకానికి వెంచేయండి, ఆ బ్రాహ్మణప్రభువు కోరిక కాదనలేక తమరిని బయటికి ఆహ్వానించాను. దాసుణ్ణి క్షమించండి' అన్నారు ఒక్కసారి శాస్త్రిలుగారిని చూచి ఆ సర్పరాజు పుట్టలోకి పోయాడు

లక్ష్మీనరసింహులుగారు శాస్త్రిలుగారి ప్రజ్ఞకి అమితానందం ఆశ్చర్యం పొందడం తప్ప ఏమీ చేయలేకన్నారు

పిశాచాలను రప్పించడం, వదలగొట్టడం, కరచినపామునే రప్పించి విషం తీయించడం శాస్త్రులుగారికి లెక్కలేనినిత్యకృత్యం.

ఆయన చూపిన మహిమలు అసాధారణాలు, ఎన్ని కుటుంబాలో వారు సజీవులై ఉన్నప్పుడు సర్ప పిశాచ బాధలనుండి విముక్తిని పొందాయి అవంగాలు మంత్రించియిస్తే, పాము విషం దిగిపోయేది. ఒక స్తంభం కట్టించి గారుడాన్ని, అందులో ప్రతిష్ఠిద్దామనుకొన్నారు మానవుల సహజ దౌర్భాగ్యంవల్ల ఆ పని పూర్తికాకముందే వారు దివంగతులైపోయారు. ★

★ పసుపు, కుంకుమ... ★

ఏ భావమయితే ఒరిగేదేముంది?" అన్నాడు భార్య ముఖంలోకి చూస్తూను

కామాక్షమ్మ మనసులోనే సమాధానం చెప్పుకుంది. 'ముసలివాడు' అనే పదానికి, 'మృత్యువు' అనే పదానికి ఏదో దగ్గర సంబంధం ఉందనిపించింది తనభర్త ముసలివాడు కాడని తృప్తిపడింది కామాక్షమ్మ.

*　　*　　*

ఏ విషయంలో అయితే అమిత శ్రద్ధా, భయం, ఆగుర్దా పెట్టుకుందో, అవ్యక్తంగా ఏ తలపెతే ఆమెని కృంగతీసి, నిత్యం నీడలాగ వెన్నాడుతూందో, అది నిజమవుతుందేమో అనే ప్రమాదస్థితి వచ్చిపడింది. నాలుగు రోజులు ముసురుపట్టి, ఎండపొడ లేకుండా ఒకటే వాన. ఈ నాలుగురోజుల్లో రెండు రోజులు పొద్దు కనిపించక కామాక్షమ్మ భోజనం చెయ్యలేదు.

భర్త మూలుగుతూ ఇంట్లో అడుగు పెడుతూనే మంచంమీద వాలిపోయారు వీధి గదిలో మూలుగు విని కామాక్షమ్మ కంగారుగా బయటికి వచ్చింది. మంచంమీద పడుకుని మూలుగుతున్న భర్త ఒంటిమీద చెయ్యి వేసింది. పేలిపోతూంది జ్వరం.

కామాక్షమ్మకి గుండెలు గుభిల్లుమన్నాయి అరికాళ్ళలోంచి వణుకు పుట్టుకొచ్చింది నోట మాట పెగల్లేదు క్షణం పోయింతర్వాత తేరుకుని, "ఏమండీ! ఏమండీ!" అని పిలిచింది భర్తని.

ఆయన బాధగా మూలిగారు

కామాక్షమ్మ జారిపోతున్న ధైర్యాన్ని ప్రయత్నంమీద నిలుపుకుంటూ, వీధిగుమ్మంలోకి వచ్చి ఎరిగున్న వాళ్ళెవరయినా కనిపిస్తారేమో అని చూడసాగింది. ఎదురింటాయన బయటికి వస్తుంటే, ఆయన్ని పిలిచి చెప్పింది. ఆయన వెళ్ళి డాక్టరుని తీసుకొచ్చారు. డాక్టరు వచ్చి చూసి ఫర్వాలేదు తగ్గిపోతుందంటూ మందిచ్చాడు. ఈ డాక్టరు చెప్పే, 'ఫర్వాలేదు' 'తగ్గిపోతుంది' అనే మాటలమీద ఇప్పుడామెకి నమ్మకం పూర్తిగా పోయింది. ఆమె నిలువునా కృంగిపోయింది.

ఆమెకి తరుచు భర్త శవంమీద పడి విలపించే వరలక్ష్మమ్మే స్మృతికి రాసాగింది. ఆ దృశ్యమే ఎంతకాదనుకున్నా, కంటిముందు తిరుగుతోంది ఏదో బెంగ ఆమె మనసుని పూర్తిగా ఆవరించింది. అవ్యక్తంగా ఆమె పడే బాధ ఇంతా అంతా కాదు రాత్రి ఏ రెండింటికో భర్తపడుకునే మంచం కోడుకు తల ఆనించిపడుకుంది.

ఫర్వాలేదు రెండురోజులలో నయమవుతుందన్న డాకరు ఎనిమిది లంఖణాలు పడేసరికి ఇదేమిటంటే, "చూదాం. చూదాం" అంటూ నసిగాడు. కామాక్షమ్మ అక్కడ నిలబడలేక పెరట్లోకి వెళ్ళిపోయింది

మర్నాడు మంచం వారగా నిలబడి, "ఏమండీ," అని పిలిచింది.

ఆయన నీరసంగా కళ్ళు తెరిచి ఏమిటన్నట్టు చూశారు. ఆయన ముఖంలోకి చూడలేక తన ముఖంలో విషాదం ఆయనకి కనిపించకూడదనే ఉద్దేశంతో వెనక్కి తిరిగి మందు కలుపుతూ, 'అసలు మీ కెలాగుంది? డాక్టరు ఫర్వాలేదు. తగ్గిపోతుందంటున్నాడు," అంది వణుకుతున్న పెదాలు అణిచిపెట్టుకుని.

ఆయన సమాధానం చెప్పలేదు, మూలిగాడు. మంగు పడుతూ, "ఇదిగో ఇటు చూడండి. అబ్బే!! అలా కన్నీరు పెట్టుకుంటే ఎలాగూ? ఫర్వాలేదు. తగ్గిపోతుంది అంది" కామాక్షమ్మ ఈ మాటలయితే గంభీరంగా అనగలిగింది గాని, లోపల గుండెలు గడగడమంటూనే ఉన్నాయి

ఆయన నీరసంగా చూస్తూ ఉండిపోయారు. సాయంత్రం డాక్టరు వచ్చి చూశాడు. వెళ్ళబోతూ "మీరు కంగారు పడుతున్నారు ఆయనకి మీరు ధైర్యం చెప్పాలి గాని ఇలా మీరే దిగులుపడిపోతే లాభంలేదు," అన్నాడు

ఆమె కన్నీరు అణుచుకుంటూ, రెండు చేతులూ జోడించి, "డాక్టరుగారూ పది కాలాలపాటు నా పసుపూకుంకుమా.. " ఆపైన గొంతు పూడిపోయింది

ఆయన గట్టిగానే మందలించాడు "ఇలాగయితే వైద్యం చెయ్యటం కష్టం," అన్నాడాయన.

రాత్రి చాలా సేపటివరకూ కామాక్షమ్మ మంచాన్ని ఆనుకుని అలాగే కూర్చుండిపోయింది ఆమె మెదడు అనేకరకాల ఊహాచిత్రాల్ని చిత్రించింది. కోటి గొంతులు ముక్తకంఠంతో ఎలుగెత్తి రోదిస్తున్నటుగా ఆమె మనసు ఘోషపెట్టింది.

జ్వరతీవ్రతతో భర్త మూలుగటం వినిపించి లేచి "ఏమండీ" అంది.

ఇలా కూర్చో అన్నట్టుగా సౌంజ్ఞ చేశాడాయన.

కామాక్షమ్మ రాయిలా మంచంమీద కూర్చుంది. చేష్టలుడిగిన ఆమెని చూసి ఆయనేదో చెప్పాలని ప్రయత్నం చేస్తున్నారు. చెప్పలేకపోతున్నారు. ముఖం ఇటూ, అటూ తిప్పుతూ, చివరికి "ధైర్యంగా ఉండు" అన్నాడు. ఇక చెప్పలేక బాధగా మూలిగాడు.

కామాక్షమ్మ లేవబోతే, ఆయన చెయ్యి పట్టుకుని లేవనివ్వ లేదు. ఆయాసంతో గుండెలు ఎగిరి ఎగిరి పడుతున్నాయి. బాధగా తల అటూ ఇటూ తిప్పుతున్నాడు.

కామాక్షమ్మ ఆయన చెయ్యి తీసిపక్కన పెట్టి, పొర్లు కొస్తున్న దుఃఖాన్ని అణిచిపెట్టుకుని తూలుతూ వంట గదిలోకి పరిగెత్తింది. నేలమీద పడి భోరుమని ఏడ్చింది. జుట్టు పీక్కుంది. తలమొత్తుకుంది దేవుడి విగ్రహం ముందు పడి గుండె బాదుకుని, కన్నీటితో అభిషేకం చేసింది ఆమె కంటికి ఎటువైపు చూచినా మృత్యుదేవత భీకరస్వరూపం కనిపించ సాగింది ఒళ్ళంతా ముచ్చెమటలు పోశాయి ఆ ఉద్వేగంలో చేతి గాజులు రెండు పటుక్కుమన్నాయి.

తెల వారింది!!!

జ్వరం తీవ్రత తగ్గుముఖం పట్టి ముసలాయనకి కొద్ది కులాసా ఇచ్చింది ఆయన నీరసంగానే భార్యని పిలిచారు ఎంత పిలిచినా సమాధానం రాలేదు. ఎంతసేపు చూచినా మనిషి కనిపించలేదు

ఆయన ఓపిక చేసుకుని, మంచం పట్టి దేకుతూనే వంటగది దాకా వెళ్ళారు. తలుపు నెట్టారు. కాని గడియ వేసి ఉంది. తలుపు సందులోనుంచి లోపలికి చూశాడు. ఒక్క ఊపున వీధిలోకొచ్చి పెద్దగా కేక వేసి కూలబడిపోయాడు. పదయ్యేసరికి ఇంటి ముందు గుంపులు గుంపులుగా జనం చేరసాగారు ఎవరికితోచినట్టు వాళ్ళు చెప్పుకోసాగారు పోలీసులు వచ్చిన తర్వాత వంటగది తలుపులు బద్దలుకొట్టి, లోపలికి చొరబడ్డారు. వంటగదిలో మధ్యని నేలమీద వెల్లకితలా పడి ఉన్న కామాక్షమ్మని చూసి ఎక్కడివాళ్ళక్కడ నిలబడి పోయారు!

దేముడి విగ్రహం పక్కగా పల్లమందూ, నూనె కలిపిన ముద్ద పోలీసుల కంటపడింది.

కామాక్షమ్మ మృత కళేబరాన్ని బయటికి తీసుకురావటానికి కదిపేసరికి ఆమె రెండు గుప్పిట్లూ సడలి ఒక గుప్పిట్లోంచి పసుపూ, రెండో గుప్పిటలోంచి కుంకుమా కిందపడ్డాయి. ★


Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1 Editor S Sambhu Prasad.



ఆరోగ్యవంతులైన పిల్లలు ప్రతిరోజూ లైఫ్‌బాయ్ సబ్బుతో స్నానము చేయుదురు

–అది ప్రతిదిన*మలినములోని క్రిములను కడిగివేయును!

* మనకు ప్రతిదినం తార్శపడే మామూలు మురికిలో క్రిములున్నాయి. మనలో ప్రతివారికీ యీ క్రిములవల్ల రోగాల ప్రమాదం వుంది. అందుచేతనే చాలామంది ఆరోగ్యవంతులగు జనులు లైఫ్‌బాయ్ సబ్బుతో మురికిని మరియు క్రిములను రోజూ కడిగివేసుకొనుట వల్ల తమ ఆరోగ్యమును కాపాడుకొనుచున్నారు — అది ఆరోగ్యవంతమైన హాయిని గలిగించును.



L. 257-X52 TL

భారతదేశంలో తయారుచేయబడినది

Regd No M 4479 Andhra Patrika Illustrated Weekly

